హైదరాబాద్
సంపుటి 6
సంచిక: 239
18, ఆదివారం
ఫిబ్రవరి, 2018

ఆదివారం మన తెలంగాణ

www.manatelangana.news

అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Mana Telangana

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | పేజీలు: 12 + 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



యాదాద్రి బ్రహ్మోత్సవాలు షురూ

స్వస్తి వచనంతో శ్రీకారం, బాలాలయంలో పూజలు

మన తెలంగాణ/ యాదాద్రి: తెలంగాణ మాహాక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీలక్ష్మీ నరసింహ్మస్వామి యాదాద్రి క్షేత్రంలో శ్రీ వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా యాదాద్రి క్షేత్రంలో ప్రతి సంవత్సరం పాల్గుణ మాసంలో జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు శనివారం బాలాలయంలో శాస్త్రోక్త పూజలతో అర్చకులు శ్రీకారం చుట్టారు. పాల్గుణ శుద్ధ పాడ్యమి 17వ తేదీ శనివారం నుండి పాల్గుణశుద్ధ ద్వాదశి 27వ తేదీ వరకు పదకొండు తరువాయి 6లో

జన్మదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చిన ప్రజలకు కెసిఆర్ అభివాదం 3లో



త్వరలో ఆర్‌టిసిలో 280 కానిస్టేబుల్ కొలువులు

షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు: కడియం 2

కందికి కేంద్రం నుంచి అందింది సగమే

- నాఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసింది 75,300 టన్నులు
- చెల్లించవలసింది రూ.410.39 కోట్లు
- ఇప్పటి వరకు అందింది రూ.226.53 కోట్లు
- మార్క్‌ఫెడ్, హాకాలకు ఇంకా మంజూరు కాని రుణం
- అధికారుల అలసత్వమే కారణమని విమర్శలు
- అప్పుల పాలవుతున్న రైతులు



మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కందులు అమ్ముకున్న రైతులకు కేంద్రం నుంచి ఇంకా చెల్లింపులు పూర్తిస్థాయిలో అందలేదు. పంటను అమ్మిన 48 గంటల్లో రైతు ఖాతాకు సొమ్ము చేరాల్సి ఉన్నా ఇప్పటికీ కేంద్రం చెల్లించలేదు. దీంతో నిత్యావసరాల కోసం రైతులు అప్పులు చేయక తప్పడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 1.75 లక్షల టన్నుల వరకు కందుల కొనుగోళ్లు జరిగితే అందులో కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ ఆధ్వర్యంలో తరువాయి 6లో

వీరాధి వీరుడు అతడు



ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదినం సందర్భంగా గోరటి వెంకన్న పాట పల్లవిని ట్వీట్ చేసిన కెటిఆర్



సిఎం కెసిఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన కుమారుడు, మంత్రి కెటిఆర్ ఉదయమే శుభాకాంక్షలు తెలియజేస్తూ ట్వీట్ చేశారు. మరికొన్ని సంవత్సరాలు మంచి ఆరోగ్యంతో, మరింత సంతోషంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కెసిఆర్‌పై గోరటి వెంకన్న రాసిన గీతం 'వీరాధి వీరుడు అతడు, విజయానికి బావుట అతడు'' పల్లవిని ట్వీట్‌లో పంచుకున్నారు.



నీరవ్‌పై నోరు విప్పాలి

- వజ్రాల వ్యాపారి కుంభకోణంపై ప్రధాని మోడీ దేశానికి సమాధానం చెప్పాలి : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : పిఎన్‌బి స్కామ్‌పై ప్రధాని నరేంద్ర మోడీ దేశానికి సమాధానం ఇచ్చుకోవల్సి ఉందని కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ కేంద్ర బిందువుగా పిఎన్‌బి కుంభకోణం చోటు చేసుకుంది. శనివారం రాహుల్ గాంధీ పార్టీ సారథ్య సంఘం సమావేశంలో మాట్లాడిన తరువాత ఇతర తరువాయి 6లో

తెల్లని దగా!



- పత్తి రైతును దోచుకోడానికి మోన్‌శాంటో బిటి విత్తనదాడి
- బిజి-1,2 విత్తనాలకు మితిమించిన ధరలను ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ



మన తెలంగాణ/ హైదరాబాద్ : మోన్‌శాంటో ప్రతిపాదించిన విక్రయ ధరతో ఈసారి పత్తి రైతులపై మరింత విత్తన భారం పడనుంది. బిజి–1, బిజి–2 పత్తి విత్తన ప్యాకెట్‌ల ధరను రూ. 950గా నిర్ణయించాలని, ప్రభుత్వమే రాయల్టీని నిర్ణయించి కలపాలని కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపడమే ఇందుకు నిదర్శనం. బిటి పత్తి విత్తనాల అమ్మకం ధరలకు సంబంధించిన ప్రతిపాదనల లేఖ 'మన తెలంగాణ' సంపాదించింది. గతేడాది 450 గ్రాముల పత్తి విత్తన ప్యాకెట్ ధర (రాయల్టీతో కలిపి) రూ. 830 ఉండగా ఈసారి రాయల్టీ లేకుండానే దానిని రూ.170 పెంచ డం గమనార్హం. ఒకవేళ రాయల్టీ కలిపితే ఈ మొత్తం మరింత పెరగనుంది. వాస్తవానికి బిజి–1 విత్తనం 2006లోనే గులాబీ రంగు పురుగును తట్టుకునే శక్తిని కోల్పోయింది. దాంతో మరోమారు జన్యుమార్పిడి చేసి బిజి–2 పత్తి విత్తనాన్ని ప్రవేశపెట్టింది. ఇదీ 2012 నాటికి గులాబీ రంగు పురుగును తట్టుకునే శక్తి కోల్పోయింది. గత నాలుగేళ్లుగా ఈ విత్తనం సాగు చేస్తూ తెగుళ్ల బారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. తెలంగాణలో లక్షల ఎకరాల్లో గులాబీ రంగు పురుగు సోకి పంట చేతికి రాని సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పటికే అనేక రకాలుగా నకిలీ పత్తి విత్తనాలు రైతుల ఉసురు పోసుకుంటున్నాయి. అయినప్పటికీ 2018 వానా కాలం సీజన్‌కు పస లేని, తెగుళ్లను తట్టుకునే శక్తి లేని బిజి–1, బిజి–2 విత్తనాలను అధిక ధరకు అంటగంటాలని మోన్‌శాంటో ప్రయత్నిస్తోంది. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వానికి తెలిసినా కంపెనీలకు లాభం చేకూర్చే విధంగా ఈ నెల 22వ తేదీన జరిగే సమావేశంలో నిర్ణయం తరువాయి 6లో



అంచనాలకు మించిపోయిన మద్యం అమ్మకాలు

- లక్ష్యానికి రెట్టింపుగా ఆదాయం

2లో



26 నుంచి కాంగ్రెస్ బస్సు యాత్ర

- జూన్ 1న రాహుల్ రాక, భారీ బహిరంగ సభ



జిఎస్‌టి నేను తీయలేదు

కాన్సెప్టే నాది

పోలీసులతో దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ

- మూడున్నర గంటలపాటు ప్రశ్నించిన అధికారులు
- 24 ప్రశ్నలకు సమాధానం
- మొబైల్, ల్యాప్‌టాప్ స్వాధీనం

మన తెలంగాణ/ హైదరాబాద్: జిఎస్‌టి షార్ట్ ఫిల్మ్‌లో మహిళలను కించపర్చేలా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల కేసులో దర్శకుడు రామ్ గోపాల్ వర్మను శనివారం హైదరాబాద్ పోలీసులు విచారించారు. సుమారు మూడున్నర గంటల పాటు ఆయనపై పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించారు. 24 ప్రశ్నలకు ఆయన నుంచి వివరణ తీసుకున్నారు.ఈ సందర్భంగా దర్యాప్తు అధికారులు తరువాయి 6లో

కుంచెపోటు



కాంగ్రెస్ మిమ్మల్ని మరిచిపోయింది, బిజెపి బాగా తలచుకుంటుంది నెహ్రూజీ!



యువత ఆలోచనలకు ప్రతిరూపం

టిహబ్

మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభలో మంత్రి కెటి రామారావు

మన తెలంగాణ/ హైదరాబాద్ : యువత ఆశలకు, ఆకాంక్షలకు ప్రభుత్వాలు ఆసరాను అందిస్తే వారికి ప్రపంచాన్నే జయించే శక్తి ఉంటుందని, అందుకే యువశక్తి ఆలోచనలకు తరువాయి 6లో

చెంప చెళ్లు

- మీడియా సమావేశంలోనే మహిళా నిందితురాలిపై చేయి చేసుకున్న ఎసిపి రంగారావు
- బదిలీ చేస్తూ తక్షణమే ఉత్తర్వులు



మన తెలంగాణ/ హైదరాబాద్: చోరీ కేసులో మీడియా ఎదుట ప్రవేశపెట్టిన మహిళా నిందితురాలిపై బేగంపేట ఎసిపి రంగారావు చేయి చేసుకున్నారు. ఈ విడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నగర పోలీసు కమిషనర్ వివి శ్రీనివాస్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఉదంతంపై విచారణ జరిపి నివేదిక అందించాలంటూ నార్త్‌జోన్ డిసిపి సుమతిని ఆదేశించారు. ఆభరణాల దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్న తరువాయి 6లో

బిజెపి, టిఆర్‌ఎస్‌ల మధ్య అనైతిక స్నేహం : పొన్నం ప్రభాకర్

మన తెలంగాణ/ హైదరాబాద్ : బిజెపి, టిఆర్‌ఎస్‌ల మధ్య అనైతిక స్నేహం ఉన్నదని టిపిసిసి ఉపాధ్యక్షులు పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వమే దేశంలో నెంబర్ వన్ అని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యానించిన తరువాత రాష్ట్రంలో బిజెపి శాఖ ఎందుకుని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ ఎపికి చెంబు ,మట్టి ముంత ఇచ్చి తెలంగాణకు ఆవుకథ చెబుతున్నారని అన్నారు. తెలంగాణ ను కించపరిచేలా మోడీ పార్లమెంటులో మాట్లాడుతున్న సమయంలో టిఆర్‌ఎస్ ఎంపిలు మౌనంగా కూర్చున్నారని, వారికి పౌరుషం లేదా అని ప్రశ్నించారు. మంత్రి హరీశ్‌రావు కంది రైతుల సమస్య పై కేంద్రానికి లేఖ రాసి చేతులు దులుపుకున్నారని అన్నారు. పార్లమెంట్ లో జై ఆంధ్ర అన్న ఎంపి కవితకు ఎర్ర జొన్న రైతులు ఆందోళనలు చేస్తుంటే కనపడడం లేదా? అని అన్నారు. కేంద్రం మెడలు వంచి తెలంగాణ తెచ్చానని చెప్పుకునే కెసిఆర్ హైకోర్టు ,ఉక్కు ఫ్యాక్టరీ ఎందుకు సాధించడం లేదన్నారు. ఇలాగే రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడితే టిఆర్‌ఎస్ ఎంపిలకు కుంకుమ ,గాజులు పంపిస్తామన్నారు. కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పోలవరం పై ఎన్‌డిఎ రెండవ సారి తీసుకువచ్చిన సవరణను తొలగిస్తామని చెప్పారు.





ప్రతి ఒక్కరికీ ఆరోగ్య కార్డులు

మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు సిఎం కెసిఆర్ కృషి చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు చేసి, ఆరోగ్య కార్డులు అందించాలని నిర్ణయించారని వెల్లడించారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏషియల్ కాంగ్రెస్ ఆఫ్ ఓరల్ ఇంప్లాంటలాజిస్ట్స్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సిఎం కెసిఆర్ జన్మదినం సందర్భంగా నిర్వాహకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని విద్యార్థులందరికీ ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, విద్యాశాఖ ద్వారా వారికి ఆరోగ్య కార్డులు అందించాలని ప్రయత్నిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఆరోగ్య కార్డులు ఇచ్చే సందర్భంలో దంతపరీక్షలకు సంబంధించి ఇండియన్ డెంటల్ అసోసియేషన్ తెలంగాణ చాప్టర్ స్వచ్ఛందంగా సేవలు అందించాలని కోరారు. కాన్ఫరెన్స్ ఛైర్మన్ డాక్టర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ లేని 'కాకతీయ' కారం!



మన తెలంగాణ/హైదరాబాద్ : నాణ్యమైన ఆహార ఉత్పత్తులను 'కాకతీయ' బ్రాండు పేరుతో విక్రయించేందుకు రాష్ట్ర ఉద్యాన సంస్థ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. పసుపు, కారం, చింతపొడి, కొత్తిమీర పొడి, అల్లం, వెల్లుల్లి పేస్ట్, ధనియాల పొడి వంటి 9 రకాల ఆహార ఉత్పత్తులను కాకతీయ పేరుతో ప్యాక్ చేసి విక్రయించనున్నట్లు ఉద్యానశాఖ సంచాలకులు వెంకట్రామ్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ఉద్యాన సంస్థ ఆధ్వర్యంలో రూ. 10.62 కోట్ల వ్యయంతో జీడిమెట్లలో ఉత్పత్తుల తయారీ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కర్నాటకలోని జాతీయ ఆహార సాంకేతిక పరిశోధనా సంస్థ సాయంతో ఆధునాతన పరిజ్ఞానంతో వీటి తయారీ యంత్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వెయ్యి ఎకరాల్లో ఈ పంటల సాగుకు రైతులతో ఒప్పందాలు చేసుకోనున్నట్లు తెలిపారు. ఏటా 2400 టన్నుల ఉత్పత్తులను తయారు చేసి విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. కల్తీ లేని ఆహారోత్పత్తులను తక్కువ ధరలో అందించాలనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు.

ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయండి

మన తెలంగాణ / హైదరాబాద్ : రైతులకు మద్దతు ధరలు కల్పించేందుకు 'ధరల స్థిరీకరణ నిధి'ని ఏర్పాటు చేయాలని, అప్పుల్లో కూరుకుపోయిన రైతులను ఆదుకునేందుకు దాదాపు రెండేళ్ళ క్రితం శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం పొందిన 'వ్యవసాయ రుణ విమోచన కమిషన్'ను నియమించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా ఆర్మూర్‌లో జరుగుతున్న ఆందోళనల ద్వారానైనా పాలకులు కళ్లు తెరవాలని, మద్ధతు ధరల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రైతు ఉద్యమాలు మరింత ఉధృతంగా జరుగుతాయని ఆయన హెచ్చరించారు. కందులు పండించిన రైతు కంగుతింటున్నాడని, కందులకు కనీస మద్దతు ధర రూ.4600 ఉండాల్సింది పోయి, రూ.2 వేలకు కూడా అమ్ముడుపోవడం లేదని, ఎర్రజొన్న పండించిన రైతులకు ఏడుపే మిగిలిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంది రైతులకు మద్దతు ధర గురించి కేంద్రం పట్టించుకోకపోతే, రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేస్తున్నదని, కేంద్రానికి లేఖ రాశామని చెప్పి చేతులు దులుపుకుంటే ఇది రైతు ప్రభుత్వం ఎలా అవుతుందని ప్రశ్నించారు. టిఆర్‌ఎస్ ఎంపిలు ఎందుకు ఢిల్లీలో నోరు మెదపడం లేదని, రైతుల ఆత్మహత్యలు ఈ ప్రభుత్వానికి పట్టవా అని ఆయన అన్నారు. మిర్చి రైతుకు క్వింటాల్‌కు రూ.11వేలకు పైబడి వుంటే, పంట చేతికొచ్చిన తర్వాత రూ.2500 లకు పడిపోవడం వెనుక మధ్య దళారీ దోపిడీ వ్యవస్థ ఎంత విశృంఖలంగా వ్యవహరిస్తుందో అర్థమవుతుందన్నారు.

ఇంటింటి కంటి వైద్యం

- **సరోజినిదేవి ఆసుపత్రి వైద్యుల వినూత్నయత్నం**
- **ఊర్లోకే ప్రత్యేక వైద్య బృందాలు**
- **సర్కార్ నిర్ణయంతో మరింత విస్తరణ**

మన తెలంగాణ/ హైదరాబాద్:రాష్ట్రంలో కంటి సమస్యలను పరిష్కరించేందుకు సరోజిని దేవి ఆసుప్రతి వైద్యులు వినూత్నంగా ముందుకు సాగుతున్నారు. 'ఇంటింటి కంటి వైద్యం' పేరుతో జిల్లాల్లో ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నారు. మూడు నెలల కిందట శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు నాలుగు జిల్లాల్లో 200 మందికి శస్త్రచికిత్సలను నిర్వహించి మరో మూడు వేల మందికి అవసరమైన మందులతో పాటు కంటి అద్దాలను అందజేశారు. వైద్య బృందంగా నేరుగా గ్రామాలకు చేరుకొని ప్రత్యేక శిబిరాల ద్వారా క్యాంపులను నిర్వహిస్తున్నారు. సిద్దిపేట, మెదక్‌తో పాటు వనపర్తి జిల్లాలో ఎనిమిది క్యాంపులను నిర్వహించారు. కంటి వ్యాధులు లేని రాష్ట్రంగా తెలంగాణను అభివృద్ధి చేయాలని ప్రభుత్వ నిర్ణయంతో తమ సేవలను మరింత విస్తారిస్తామని ఆసుప్రతి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవీందర్‌గౌడ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చేసిన ప్రకటన తమకు మరింత ఆనందాన్ని కలిగిస్తుందన్నారు.

ఆసుప్రతికి చేరుకోలేని వారి కోసమే : రాష్ట్రంలో కంటి జబ్బులతో బాధపడుతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు ఈ సమస్యలతో సతమతమవుతున్నారు. వారు కనీసం ఆసుపత్రికి వెళ్లలేని దయనీయ స్థితి నెలకొంది. వివిధ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు తమతో కలిసిన సందర్భంగా ఈ విషయాలు చెప్పారని సూపరింటెండెంట్ వివరించారు. అసలే అంతంత మాత్రంగా ఉండే నేత్ర వైద్యాలయాలు గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో లేవు. దీన్ని పరిగణలోకి తీసుకొని 'ఇంటింటి కంటి వైద్యం' పేరుతో ప్రత్యేక శిబిరాల ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో మంచి ఫలితాలు వస్తున్నాయని... తమకు కూడా చాలా సంతృప్తినిచ్చిందన్తుని ఆసుపత్రి వైద్యులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్యానికి సర్కార్ పెద్ద పీట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. ఆధునిక వైద్య సదుపాయాలతో పాటు ఆసుప్రతుల పనితీరును కూడా మెరుగుపరుస్తోంది. ఆరోగ్య తెలంగాణగా రాష్ట్రాన్ని మార్చేందుకు సర్కార్ చేస్తున్న ప్రయత్నాలకు ప్రజల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోంది. ఇందులో భాగంగానే కెసిఆర్ కిట్లు మంచి ఫలితాలిస్తున్నాయి. ఇటీవల బోధకాలు వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి వీరికి ఉచితంగా మందులు, చికిత్సతో పాటు పెన్షన్‌ను కూడా అందజేయాలని సీఎం కేసీఆర్ ప్రకటించారు. సీఎం నిర్ణయంతో కంటివైద్యం కూడా మెరుగుపడే అవకాశముందనే అభిప్రాయాన్ని సరోజినిదేవి డాక్టర్లు వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాలు మెరుగు పరిస్తే చాలు: కంటి సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యానికి అనుగుణంగా తాము విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వమే పూర్తిగా భరించేలా కంటి వైద్యం చేపట్టాలని నిర్ణయించడంతో ఇతర అధికారులు, సిబ్బందికి సౌకర్యాలను మెరుగుపరిస్తే చాలన్నారు. ఇందుకు ఇతర రాష్ట్రాల సహకారం అవసరం లేదన్నారు. కంటి సమస్యలు లేని రాష్టంగా తెలంగాణను తామే అభివృద్ధి చేస్తామనే ధీమాను వ్యక్తం చేశారు. కంటి పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం నుంచి తమకు అధికారికంగా ఆదేశాలు వచ్చిన వెంటనే ఇంటింటికి కంటి వైద్యం కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని సూపరింటెండెంట్ వివరించారు.



ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుదాం

- **రాష్ట్రంలో అక్షరాస్యతను పెంచడంలో ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా పని చేయాలి**
- **ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కడియం**

మనతెలంగాణ/హైదరాబాద్ : అనేక రంగాల్లో మన రాష్ట్రం నెంబర్‌వన్‌గా ఉన్నా అక్షరాస్యతలో మాత్రం వెనుకబడి ఉందని, జాతీయ సగటు అక్షరాస్యత 77% ఉంటే రాష్ట్ర సగటు 66% మాత్రమేనని, ఈ ఏడాది 80% నమోదయ్యేలా ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా పనిచేయాలని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. శనివారం సచివాలయంలో విద్యాశాఖ స్పెషల్ సిఎస్ రంజీవ్ ఆచార్య, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్‌లతో కలిసి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఉపాధ్యాయుల హాజరు శాతం సరిగ్గా ఉండటం లేదని, మెరుగుపరిచేందుకు తగిన సూచనలివ్వాలని సంఘాల ప్రతినిధులను కోరారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకుంటూ ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. కొంతమంది ఉపాధ్యాయులు సరిగ్గా పనిచేయకపోవడం వల్ల అందరికీ చెడ్డపేరు వస్తోందని, ఈ పరిస్థితిని మార్చాల్సిన బాధ్యత సంఘాలపైనే ఉందని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ,



పేపర్లు దిద్దడంలో సంఘాల సహకరించాలని, పదవ తరగతి పరీక్షల తర్వాత ఏప్రిల్ నెలలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సమస్యలపై పూర్తి స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఏకీకృత సర్వీసుల విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల గౌరవానికి భంగం కలిగించే పలు ఉత్తర్వులు ఇటీవల రావడం, వాటిని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఉపసంహరించుకున్నందుకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. మే నెలలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయ సంఘాల జెఎసి నేతలు సర్వోత్తమ్ రెడ్డి, భుజంగరావు, రవి, సోమేశ్వరరావు, ఆడమ్స్ పాల్గొన్నారు.


షెడ్యూల్ ప్రకారమే ఇంటర్, డిగ్రీ పరీక్షలు

మనతెలంగాణ/హైదరాబాద్ : షెడ్యూల్ ప్రకారమే ఇంటర్, డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తామని, ఎట్టిపరిస్థితుల్లో పరీక్షలను వాయిదా వేయబోమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఇవ్వాల్సిన మొత్తాన్ని వెంటనే ఇవ్వకపోతే పరీక్షలను బహిష్కరిస్తామని కెజి టు పిజి విద్యా సంస్థల జెఎసి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో శనివారం పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖ స్పెషల్ సిఎస్ రంజీవ్ ఆర్ ఆచార్య, కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఎ.అశోక్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. అనుకున్న సమయానికే పరీక్షలు నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం హైస్కూళ్లు, జిల్లా పరిషత్ పాఠశాలలు, కెజిబివిలు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో ఫర్నీచర్ బాగుందని, వీలైనంత వరకు అక్కడే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాల మూల్యాంకనం కూడా పూర్తి స్థాయిలో ప్రభుత్వ విద్యాసంస్థలు, మైనార్టీ సంస్థలతోపాటు సహకరించే ఇతర విద్యాలయాల్లో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్విజిలేటర్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలు వినియోగించుకోవాలన్నారు. వీటిని సంబంధించిన ప్రణాళిక రూపొందించుకుని రావాలని అధికారులకు తెలిపారు. ప్రైవేట్ యాజమాన్యాలు పరీక్షా కేంద్రాలు ఇచ్చేందుకు అంగీకరించకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

విద్యుత్ వాహనాలకు చార్జింగ్ పాయింట్లు

- **నెలకొల్పడంపై డిస్కంలు దృష్టి సారించాలి**
- **తెలంగాణ జెన్‌కో సిఎండి ప్రభాకర్‌రావు**

మన తెలంగాణ/ హైదరాబాద్ : సమీప భవిష్యత్తులో దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం పెరగనున్న నేపథ్యంలో వాటికి అవసరమయ్యే ఛార్జింగ్ పాయింట్లను నెలకొల్పడంపై అన్ని డిస్కంలు దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడిందని, వ్యవస్థాపరంగా సంసిద్ధం కావాలని తెలంగాణ జెన్‌కో సిఎండి ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. పుదుచ్చేరిలో జరుగుతున్న దక్షిణాది విద్యుత్ సంస్థల సంఘం 33వ సదస్సుకు హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న పదిహేనేండ్లలో దేశవ్యాప్తంగా ప్రజా రవాణా వాహనాలన్నీ విద్యుత్‌తోనే నడుస్తాయని, వ్యక్తిగత వాహనాల్లో సైతం దాదాపు 40% విద్యుత్‌ను ఇంధనంగా వినియోగిస్తాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ డిస్కంలు విద్యుత్ ఛార్జింగ్ పాయింట్లను అందుబాటులోకి తేవడంపై దృష్టి సారించాలని సూచించారు. వాహనాల విద్యుత్ ఛార్జింగ్‌ను ఒక విభాగంగానే గుర్తించాల్సి ఉంటుందని, ఇందుకు ప్రత్యేక టారిఫ్‌ను రూపొందించాల్సి ఉంటుందని అన్నారు. ఈ మేరకు రాష్ట్రాల్లోని డిస్కంలు రాష్ట్రస్థాయి విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్లతో సంప్రదింపులు జరిపి విధాన నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు.



తెలంగాణ వ్యవసాయ విద్యుత్‌కు ప్రశంసలు : తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నుంచి వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయడంపై పుదుచ్చేరి సమావేశంలో ప్రశంసలు కురిశాయి. నైవేలి లిగ్నయిట్ కార్పొరేషన్ డైరెక్టర్ తంగపాండ్యన్ తన ప్రారంభ ఉపన్యాసంలో తెలంగాణ చొరవను ప్రవంసించడంతో పాటు రైతులకు చాలా ప్రయోజనం కలుగుతుందని వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొనింది. యావత్తు దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన ప్రతినిధులు వ్యక్తం చేసిన సందేహాలను ప్రభాకర్‌రావు నివృత్తి చేశారని పేర్కొనింది. ప్రస్తుతం తెలంగాణలో 9622 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉందని, సమీప భవిష్యత్తులో ఎత్తిపోతల పథకాలకు మరో 11 వేల మెగావాట్ల విద్యుత్ అవసరమవుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని రానున్న ఆర్థిక సంవత్సరంలో అదనంగా 1800 మెగావాట్లను ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధమైనట్లు వివరించారు.

ర్యాంకులతో సంబంధం లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్

- **జెఎసి చైర్మన్ కోదండరామ్**

మన తెలంగాణ/హైదరాబాద్: పోలీస్ కానిస్టేబుల్ నుంచి ఓలా డ్రైవర్ ఉద్యోగాల వరకు ఇంజనీరింగ్ విద్యార్థులే ఉంటున్నారని, ఈ దుర్భర పరిస్థితులు మారాలని తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఇంజనీరింగ్‌లో పరీక్ష, బోధన, ఎంపిక విధానాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. ర్యాంకులతో సంబంధం లేకుండా ఇంజనీరింగ్ విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శనివారం తెలంగాణ ఇంజనీరింగ్ విద్యార్థుల జెఎసి ప్రారంభోత్సవ సమావేశంలో కోదండరామ్‌తో పాటు జెఎసి కో ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, అధికార ప్రతినిధి జి.వెంకట్‌రెడ్డి, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక అధ్యక్షులు నిజ్జన రమేష్, ఒయు విద్యార్థి జెఎసి నాయకులు ప్రతాప్, ఇంజనీరింగ్ విద్యార్థుల జెఎసి నాయకులు చరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలల్లో సౌకర్యాలను, మెరుగైన విద్య అమలును పరిశీలించేందుకు రాష్ట్రంలో ఎఐసిటిఇ తరహాలో ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ డబ్బుల విడుదలకు ప్రస్తుతం అమలులో ఉన్న ర్యాంకును ముడిపెట్టడాన్ని వెంటనే ఉపసంహరించాలన్నారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వమే ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని లేదా పేద విద్యార్థులకు ప్రభుత్వం పూర్తిగా ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు, మెరుగైన విద్య కోసం ఇంజనీరింగ్ జెఎసి ప్రత్యేకంగా చర్చాగోష్టిలను నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించాలని సూచించారు. ఇటిక్యాల పురుషోత్తం యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యావిధానాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్నారు. జి.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఫీజురీయంబర్స్‌మెంట్ నుంచి తప్పించుకునేందుకు కొన్ని కళాశాలలను మూసివేసిందని ఆరోపించారు.




వన్య ప్రాణులకు నీటి వసతి

- **దృష్టి సారించిన అటవీశాఖ**

మన తెలంగాణ / హైదరాబాద్ : వన్యప్రాణులకు నీటి వసతిని కల్పించే అంశంపై అటవీశాఖ దృష్టి సారించింది. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో వన్యప్రాణులు నీటి కోసం ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు అవసరమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో ప్రధానంగా రెండు రోజుల పాటు ఆడవుల్లో పర్యటించి క్షేత్రస్థాయిలోని పరిస్థితులను పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు. సహజంగా ఉన్న నీటి వనరులను ఒకవైపు కాలుష్యం నుంచి కాపాడుతూనే మరోవైపు అటవీ జంతువులకు వీలైనంత సమీపంలో నీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఇందు లో భాగంగానే ఈ నెల 24, 25వ తేదీల్లో అడవుల్లో నీటి వసతిపై అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే జంతు గణనకు సంబంధించిన సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అటవీశాఖ తాజాగా నీటి వసతిపై మరోసారి అడవుల్లో అధ్యయనానికి శ్రీకారం చుడుతోంది. అటవీశాఖ అధికారులు, సిబ్బందితో పాటు ఇటీవల పులల గణనలో పాల్గొన్న వాలంటీర్లను కూడా ఇందులో భాగస్వామ్యం చేయనున్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులతో పాటు రిజర్వు ఆడవులు, ఏటూరు నాగారం, కిన్నెరసాని, పోచారం అభయారణ్యాల్లో ఈ సర్వే జరుగుతుందని అధికారులు వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో ఎక్కడెక్కడ సహజ నీటి వనరులున్నాయి, అవి ఏ దశలో ఉన్నాయానే అంశాలతో పాటు నీరు స్వచ్ఛంధంగా ఉందా, కలుషితమైందా, సమీపంలోని ఏమైనా మానవ ఆవాసాలున్నా యా, ఇటీవల జంతువులు, మనుష్యులకు మధ్య ఏమైనా ఘర్షణలు చోటుచేసుకున్నాయా, జంతువులు సంచరించే ప్రాంతానికి ఎంత దూరంలో నీటి వసతులున్నాయి, ప్రత్యామ్నాయంగా కృతిమ నీటి వసతి ఎక్కడెక్కడ అవసరముందానే అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేసి సర్వే చేయనున్నట్లు అధికారులు వివరించారు. సర్వే ఆధారంగా కార్యాచరణ రూపొందించి నీటి వసతికి సంబంధించి తక్షణ చర్యలు చేపడతామని చెప్పారు. నీటి ఎద్దడి కారణంగా జంతువులు అడవిని వదిలి బయటకు వెళ్లే ప్రమాదముందని, దీనివల్ల ప్రమాదాల బారిన పడడంతో పాటు వేటగాళ్ల బారిన పడే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో జంతువులకు నీటి కొరత లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అడవిలో కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆటవీ సిబ్బందితో పాటు వాలంటీర్లను ఉపయోగించుకొని అటవీశాఖ పరిధిలోని అన్ని ప్రాంతాలను బీట్ల వారిగా సర్వే చేస్తామన్నారు. వేసవి రీత్యా జంతువుల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను విరివిగా ఉపయోగిస్తున్న కాలుష్యం వల్ల వాటి వ్యర్థాలు పేరుపోయి నీటితో పాటు పర్యావరణం కలుషితమవుతుంతదని దీనివల్ల నీటితో పాటు పర్యావరణం తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. దీన్ని నివారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై స్థానికులకు ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కూడా ఈ సర్వే దోహదపడుతుందనే ఆశాభావాన్ని అటవీశాఖ అధికారులు వ్యక్తం చేశారు.





ఆర్‌టిసిలో 280 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్‌ఆర్‌టిసి) లోని భద్రత విభాగానికి అవసరమైన 280 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఈ నియామకాలను చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ పరిపాలన అనుమతులనిస్తూ జివో నెం11ను శనివారం జారీ చేసింది. లోకల్ క్యాడర్, ఖాళీలా పరిస్థితులు, రోస్టర్ పాయింట్లు, అర్హతలు తదితర సమాచారాన్ని ఆర్‌టిసి నుంచి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తీసుకోని ఈ పోస్టులను భర్తీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో ఆర్థిక శాఖ పేర్కొన్నది.



'డబుల్' కోసం తలసాని అహర్నిశలు కృషి : హరీశ్‌రావు

మన తెలంగాణ/అమీర్‌పేట: పేదలకు రెండు పడకల గదులు నిర్మించి ఇచ్చేందుకు మంత్రి తలసాని యాదవ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కొనియాడారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని సనత్‌నగర్ డివిజన్ శ్యామలకుంటలో పర్యటించారు. ఈ సందర్భంగా గుడిసె వాసుల సమస్యలపై మంత్రి తలసానిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా సికింద్రాబాద్ ఐడిపిఎల్ ప్రాంతంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు మొట్టమొదటగా సిఎం కెసిఆర్ చేతులమీదుగా ప్రారంభించే కార్యక్రమాన్ని తలసాని చేపట్టారన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో అప్పటి సిఎం కిరణ్‌కుమార్ రెడ్డి సోదరుడు ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసినా గుడిసెవాసులు తరిమికొట్టడం జరిగిందని గుర్తుచేశారు. ఈ స్థలం శిఖం భూమి అయినప్పటికీ ఇక్కడ ఇళ్ళు నిర్మించడం సాధ్యంకాని పని అని అధికారులు తెలిపారన్నారు. అయితే ఈ స్థలం తనదేనంటూ ఓ ప్రవేటు వ్యక్తి కోర్టులో పిటీషన్ వేశారన్నారు. ఈ స్థల వివాదాన్ని పరిష్కరించే విధంగా అడ్వొకేట్ జనరల్‌తో త్వరలోనే చర్చిస్తానన్నారు. వీరి వెంట కార్పొరేటర్లు కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి, నామన శేషుకుమారి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా సిఎం కెసిఆర్ జన్మదినం

- ప్రగతి భవన్ మైసమ్మ ఆలయంలో ముఖ్యమంత్రి దంపతుల ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన అభిమానులు, నేతలు

మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 64వ జన్మదినం బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా వేడుక వాతావరణంలో జరిగింది. నాయకులు, అభిమానులు కేక్ కటింగ్, అన్నదానాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, రక్తదానాలు, సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మంత్రులు తమతమ నియోజకవర్గాల్లో సిఎం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రగతి భవన్‌లో సిఎం జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం మైసమ్మ ఆలయంలో ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉప ముఖ్య మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, పలువురు సినీ ప్రముఖులు ముఖ్యమంత్రిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భవన్‌లో భారీ కేక్‌ను పార్టీ కార్యకర్తల సందడి నడుమ ఎంపి కల్వకుంట్ల కవిత కట్ చేశారు. టిఆర్ఎస్ విద్యార్థి,యువజన విభాగాలు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రక్తదాన శిబిరాన్ని కూడా ప్రారంభించారు. టిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు, ఎంఎల్‌సి శంభీపూర్ రాజు స్వయంగా రక్తదానం చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకల్లో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, ఎంఎల్‌సిలు కర్నె ప్రభాకర్, ప్రొ. శ్రీనివాసరెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, టిఆర్ఎస్‌వి అధ్యక్షుడు శ్రీనివాస్, తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్‌సాగర్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అంతకుముందు ఉదయం సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయంలో నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత, మంత్రులు తలసాని శ్రీనివాస యాదవ్, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సిఎం పేరు మీద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బన్సీలాల్ పేట డివిజన్‌లోని చాచా నెహ్రూనగర్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్లకు శంకుస్థాపన చేశారు. నెక్లెస్ రోడ్ జలవిహార్‌లో మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కవిత పాల్గొన్నారు. మహిళలకు చీరలు, వికలాంగులకు ట్రై సైకిళ్లను, మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. బర్త్ డే కేక్ కట్ చేశారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.





ప్రతి బిడ్డ కెసిఆర్‌ను ఆశీర్వదిస్తున్నారు: కవిత

ముఖ్యమంత్రి కెసిఆర్‌ను తెలంగాణ ప్రతి బిడ్డా ఆశీర్వదిస్తున్నదని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపి కవిత అన్నారు. 'మీ అనుచరురాలైనందుకు గర్వపడుతున్నా. మీ కూతురవ్వడం నా అదృష్టం. హ్యాపీ బర్త్‌డే డాడ్' అని కవిత తన ట్విటర్ ఖాతాలో ట్వీట్ చేశారు.

ప్రతి పేద గుండెల్లో కెసిఆర్: హరీశ్‌రావు

హైదరాబాద్‌లోని చిత్రపురి కాలనీలో సిఎం కెసిఆర్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రతి పేదవాడి గుండెల్లో సిఎం కెసిఆర్ ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపిన ఘనత కెసిఆర్‌దేనన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణ పేట్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ తెలంగాణ కోసం ఎన్నో సార్లు పదవులు త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని అభివర్ణించారు.



వెయ్యి ఇళ్లకు మంత్రి జగదీశ్ శంకుస్థాపన

సూర్యాపేటలో సిఎం కెసిఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంత్రి జి.జగదీశ్‌రెడ్డి వెయ్యి డబుల్ బెడ్ రూం ఇళ్లకు శంకుస్థాపన చేశారు. కాసారం గ్రామంలో 14 ఎకరాల్లో ఈ ఇళ్లను నిర్మించనున్నారు.

రాష్ట్రపతి, ప్రధాని,చంద్రబాబు, జానారెడ్డి శుభాకాంక్షలు

సిఎం కెసిఆర్ జన్మదినం సంధ్భంగా పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రకాశ్ నడ్డా, తెలంగాణ గవర్నర్ నరసింహన్, మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు, బీహార్ గవర్నర్ సత్యపాల్ మాలిక్, ఎపి సిఎం చంద్రబాబునాయుడు, చత్తీస్‌గఢ్ సిఎం రమణ్ సింగ్, తెలంగాణ అసెంబ్లీ ప్రతిపక్ష నేత కె.జానారెడ్డి, ఎంపి జ్యోతిరాతిద్య సింధియా తదితరులు శుభా కాంక్షలు చెప్పిన వారిలో ఉన్నారు.

చిన్నారికి ప్రత్యేక ఆహ్వానం



అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను చూడాలని కోరుకున్న వరంగల్‌కు చెందిన 11ఏళ్ల విగ్నేష్ కోరిక నెరవేరింది. కెసిఆర్ తన పుట్టిన రోజున స్వయంగా విగ్నేష్‌ను ప్రగతి భవన్‌కు ఆహ్వానించారు. సిఎం ఆహ్వానం మేరకు తల్లి దండ్రుల తోడుతో ప్రగతి భవన్ చేరుకున్న విగ్నేష్‌ను ము ఖ్యమంత్రి పలుకరించారు. షేక్ హ్యాండ్ ఇచ్చి బాలుడిలో హుషారు నింపారు. అనంతరం యోగక్షేమాలు తెలుసుకొని, బాలుడి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు.



సిఎం కెసిఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, మరో మంత్రి డా.లక్ష్మారెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని చిత్రపురి కాలనీలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం.



డిజిపి మహేందర్ రెడ్డి శనివారం ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



సిఎం కెసిఆర్‌కు చిత్రపటాన్ని బహూకరించిన పార్టీ నేతలు



సిఎం కెసిఆర్ 64వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ప్రగతి భవన్‌లో ఎంపిలు బాల్క సుమన్, మల్లారెడ్డి, ఎంఎల్‌ఎ వివేకానంద్, ఎంఎల్‌సిలు శంభీపూర్ రాజు, కర్నె పభాకర్, బాలమల్లు, మైనంపల్లి హన్మంతరావు శుభాకాంక్షలు తెలియజేశారు.



సిఎం కెసిఆర్ జన్మదిన వేడుకలు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. గుంటూరు జిల్లా తెనాలిలో కెసిఆర్ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు పెట్టి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. పేదలకు వ స్త్రాలు పంపిణీ చేశారు. కెసిఆర్ సేవా ఫౌండేషన్ ప్రతినిధి షేక్ ఖాదీర్ అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు.



కెసిఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ముంబై లోని ప్రఖ్యాత మహాలక్ష్మి అమ్మవారి దే వాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ జాగృతి మహారాష్ట్ర అధ్యక్షుడు సుల్గే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



ఆదిలాబాద్ జిల్లా ముఖరా(కె) గ్రామంలో సిఎం కెసిఆర్ జన్మదినాన్ని దళితులు వినూత్న రీతిలో నిర్వహించారు. ప్రభుత్వం తమకు పంచిన 90 ఎకరాల భూమిలో 32మంది దళితులు తాము పండించిన పంటలతో సిఎంకు పాలాభిషేకం చేశారు. సిఎం కెసిఆర్ దత్తత గ్రామం ఎర్రవల్లిలో ఆయన 64వ జన్మదినాన్ని పురస్కరించుకొని 64 జంటలు హోమం నిర్వహించాయి.



టిఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో సిఎం కెసిఆర్ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రక్తదాన శిబిరం ఏర్పా టు చేయగా, టిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు, ఎంఎల్‌సి శంభీపూర్ రాజు రక్తదానం చేశారు.

ఎర్రజొన్నల కొనుగోళ్లకు టోకెన్ పద్ధతి

- మొదటి దశలో ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కేంద్రాలు
- వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్: ఎర్రజొన్నల కొనుగోళ్లకు వ్యవసాయ మార్కెట్ కమిటీలలో మొదటి దశలో ఐదు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, అవసరాల మేరకు కొనుగోలు కేంద్రాలను పెంచుతామని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎర్రజొన్నల కొనుగోలు విధివిధానాలపై హైదరాబాద్‌లోని నివాసంలో మంత్రి పోచారం శనివారం సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్, ఆర్మూర్, వేల్పూర్, కమ్మర్‌పల్లి, బాల్కొండ వ్యవసాయ మార్కెట్లలో కొనుగోలు కేంద్రాలను ఈ నెల 19 నుంచి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు మార్కెట్‌కు ఎర్రజొన్నలను తీసుకురావడానికి టోకెన్ పద్ధతిని అమలు చేస్తామన్నారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు (ఎఇఒ)లు గ్రామాల్లో పర్యటించి రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించి విస్తీర్ణం, దిగుబడి ఆధారంగా టోకెన్లను జారీ చేస్తారన్నారు. టోకేన్ తేది ఆధారంగా రైతులు తమ సరుకును కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. అమ్మిన పంట తాలుకు నగదును ఆర్‌టిజిఎస్ ద్వారా నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. ఎర్రజొన్నల కొనుగోలు, సరఫరా, తరలింపు, నిల్వ చేయడంపై వ్యవసాయ, రెవెన్యూ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారథి, కమిషనర్ డా. ఎం. జగన్‌మోహన్, అదనపు సంచాలకులు విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా క్వింటాల్ రూ. 2300 ఇవ్వడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విత్తన పంటకు ప్రభుత్వం తక్కువ ధర ఇవ్వడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



19నుంచి కొనుగోళ్లు

మన తెలంగాణ/ఇందూరు: ఎఎంసి కేంద్రాల ద్వారా ఈ నెల 19 నుంచి ఎర్రజొన్నలు కొనుగోళ్లు చేస్తామని నిజామాబాద్ వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్మోహన్ తెలిపారు. శనివారం ప్రగతిభవన్ సమావేశం మందిరంలో కలెక్టర్ రాంమోహన్‌రావు, అధికారులతో ఆయన సమీక్షించారు. మొత్తం 5 ఎర్రజొన్న కేంద్రాలను ప్రారంభిస్తున్నామని, ఈ కేంద్రాలు 45 రోజులు అందుబాటులో ఉంటాయని తెలి పారు.

వరద కాలువకు చెరువుల అనుసంధానం

- తూముల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి

మన తెలంగాణ/హైదరాబాద్: శ్రీరాంసాగర్ వరద కాలువ నుంచి విడుదలయ్యే నీరు చెరువుల్లోకి చేరుకునేలా తూముల నిర్మాణానికి ప్రభుత్వం అ నుమతి మంజూరు చేసింది. కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లోని పలు గ్రామాల్లో ఉన్న చెరువులకు వరద కాలువను అనుసంధానం చేస్తూ 11 తూముల నిర్మాణానికి డిజైన్‌ను కూడా సిద్ధం చేసినట్లు సాగునీటి పారుదల శాఖ ఒక ప్రకటనలో వివరించింది. కొండాపూర్, అంతర్గాం, తాటిపల్లి, బూరుగుపల్లి, నంగిరి, గట్టుబుత్కూరు, నర్సింగాపూర్ తదితర ప్రాంతాల్లో తూములను నిర్మించను న్నట్లు మంత్రి హరీశ్‌రావు ఆ ప్రకటనలో పేర్కొ న్నారు. శ్రీరాంసాగర్ వరదకాల్వ నుంచి ఇప్పటివరకు రెండుసార్లు మాత్రమే నీరు విడుదలైందని, ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండకపోవడమే ఇందుకు కారణమని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై అనేక ప్రాజెక్టులను నిర్మించడంతో శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లో తగ్గిపోయిందని గుర్తుచేశారు. వరదకాలువ నుంచి ప్రవహించే నీటిని తూముల ద్వారా డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు, అక్కడి నుంచి చె రువులకు చేరేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

కడెం ప్రాజెక్టుపై క్రాస్ రెగ్యులేటర్ నిర్మాణం:

కడెం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువపై క్రాస్ రె గ్యులరేటర్ నిర్మాణ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కడెం డిస్ట్రిబ్యూటరీ (నెం. 30) కింద పదివేల ఎకరాలకు సాగునీరు అందుతోందని, అయితే డెలివరీ ఛాంబర్ వద్ద క్రాస్ రెగ్యులేటర్ లేనందున నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని మంచిర్యాల ఎంఎల్‌ఎ దివాకర్‌రావు విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రూ. 84.15 లక్షల మేర నిధుల విడుదలకు ఆమోదం తెలిపిందని మంత్రి వివరించారు.

పురుషోత్తంరెడ్డి కస్టడీకి కోరుతూ ఎసిబి పిటిషన్

మన తెలంగాణ/హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న హెచ్‌ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డిని మరింత లోతుగా విచారించాల్సి ఉందని, ఐదు రోజులు కస్టడీ కోరుతూ ఎసిబి అధికారులు నాంపల్లిలోని ప్రత్యేక ఎసిబి న్యాయస్థానంలో శనివారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరుగుతుందని ఎసిబి అధికారులు తెలిపారు. మరో పక్క పురుషోత్తంరెడ్డి బినామీలు నిశాంత్‌రెడ్డి, యాదవరెడ్డిలను ఎసిబి కార్యాలయం లో శనివారం విచారించారు.

ఉద్యమకారులు, జర్నలిస్టులకు కాచం సత్యనారాయణ సన్మానం

మన తెలంగాణ/మన్సూరాబాద్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, ఎల్బీనగర్ నియోజకవర్గం జర్నలిస్టులను సన్మానించిన ఘనత కాచంకే దక్కుతుందని టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సామల వెంకట్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజవర్గ పరిధిలోని కర్మన్ ఘాట్ లక్ష్మి కన్వెన్షన్ హాల్‌లో శనివారం సిఎం కెసిఆర్, ఎల్బీనగర్ టిఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జి కాచం సత్యనారయణ గుప్త 50వ జన్మదినం పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం ఉద్యమకారులు, జర్నలిస్టులను ఘనంగా సత్కరించి షీల్డ్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సామల వెంకట్‌రెడ్డి, కాచం సత్యనారయణ గుప్త మాట్లాడుతూ ఉద్యమ సమయంలో జర్నలిస్టులు, ఉద్యమకారులు ఎంతో సహకరించారన్నారు.




బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే అవినీతి

- ఖమ్మం బహిరంగ సభలో సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి

మన తెలంగాణ/ఖమ్మం: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పారదర్శకత అంటూనే బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయలను సంపన్న వర్గాలకు దోచి పెడుతున్నారని, ఇటీవల వెలుగు చూస్తున్న వరుస ఆర్థిక అవకతవకలే అందుకు నిదర్శనమని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. సామాన్యుడు, ఆటో కార్మికుడు, చిరు వ్యాపారి, రైతు చిన్న మొత్తంలో రుణం తీసుకుని చెల్లించలేకపోతే అనేక ఇబ్బందులకు గురిచేసే బ్యాంకులు, ప్రభుత్వం నీరవ్ మోడీ, లలిత్ మోడీ, విజయ్ మాల్యా వంటి వారు బ్యాంక్‌లను మోసం చేసి విదేశాలకు పారిపోతే ఏమి చేస్తున్నాయని ప్రశ్నించారు. 2016లోనే హరిప్రసాద్ అనే వ్యక్తి నీలం మోడీ అవినీతి గురించి ప్రధానికి లేఖ రాస్తే కనీసం స్పందించకపోగా, దావోస్ సదస్సులో ఈ మోడీతో ఆ మోడీ కలిసి ఫోటోలు దిగడం సిగ్గుచేటని విమర్శించారు. సిపిఐ ఖమ్మం జిల్లా 21వ మహాసభల సందర్భంగా శనివారం ఖమ్మం రూరల్ మండలం ఎదులాపురం పంచాయతీ రజబ్‌అలీ కూడలి వద్ద భారీ బహిరంగ సభ జరిగింది. సభలో సురవరం మాట్లాడుతూ అవినీతికి దూరమంటూ మాటలు చెబుతున్న మోడీ గొప్పలు చెబుతుండగా బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లో బిజెపి నేతల అవినీతి గుట్టు రట్టయిందని స్వయంగా పత్రికలు మోదీ అవినీతిని సైతం వెల్లడించాయన్నారు. సుప్రీంకోర్టు ఈ సాక్ష్యాలు సరిపోవని చెప్పిన నేపథ్యంలో నిజాన్ని ఎందుకు నిగ్గు తెల్చలేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలపై నిర్బంధం పెరిగిందన్నారు. సభలో సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి సాంబశివ రావు, ఎఐటియుసి జాతీయ కార్యదర్శి డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, సిపిఐ జిల్లా కార్యదర్శి బాగం హేమంతరావు ప్రసంగించారు.



"తనకు ఇష్టమైన పనిని మూర్ఖుడు కూడా చేయగలడు, కానీ బుద్ధిమంతుడు మాత్రం తాను చేస్తున్న ప్రతి పనిని తనకు ఇష్టమైన పనిగామార్చుకుంటాడు.
– గౌతమబుద్ధ"



సంపాదకీయం

త్రిపురలో బిజెపి ఆశ నెరవేరేనా?

25 సంవత్సరాలుగా సిపిఐ(ఎం) అధికారంలో ఉన్న త్రిపురను చేజిక్కించుకునేందుకు బిజెపి విశ్వప్రయత్నం నెరవేరుతుందా? మీడియా ప్రచారం చూస్తుంటే అది కమ్యూనిస్టు ప్రభుత్వానికి గట్టిసవాలు విసురుతోందన్న అభిప్రాయం కలగకమానదు. కమ్యూనిస్టులను ఓడించటమే లక్ష్యంగా పెట్టుకున్న బిజెపి, రాష్ట్ర విభజనవాద గిరిజన పార్టీ ఐపిఎఫ్‌టి(ఇండీజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర)తో పొత్తు పెట్టుకుంది. బిజెపి 51 సీట్లకు పోటీచేస్తూ 9 సీట్లను ఐపిఎఫ్‌టికి కేటాయించింది. కాగా సిపిఐ(ఎం)57సీట్లకు పోటీచేస్తూ లెఫ్ట్‌ఫ్రంట్‌లోని సిపిఐ, ఆర్‌ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్‌లకు ఒక్కొక్కసీటు కేటాయించింది. త్రిపుర ఓటర్లు ఈ రోజు తమ తీర్పును ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నిక్షిప్తం చేయనున్నారు. కాగా నాగాలాండ్, మేఘాలయల్లో ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగుతుంది. ఈ రెండూ క్రైస్తవులు అత్యధిక మెజారిటీగా ఉన్న రాష్ట్రాలు. నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పిఎఫ్) అధికారంలో ఉండగా మేఘాలయ కాంగ్రెస్ ఏలుబడిలో ఉంది. ఈ రెండు రాష్ట్రాల్లో కూడా బిజెపి అధికారంలో వాటా కొరకు అర్రులు చాస్తోంది. అసోంలో ఎన్నికల్లో మెజారిటీద్వారా, మణిపూర్‌లో ఎమ్మెల్యేలను ఆకర్షించటం ద్వారా, అరుణాచల్‌ప్రదేశ్‌లో ఫిరాయింపులతో పాలకపార్టీ పేరును కాంగ్రెస్ నుండి బిజెపిగా మార్చటం ద్వారా అది ఇప్పటికే అధికారంలో ఉంది.

త్రిపురలో తొలిసారి వామపక్షం–మితవాదుల మధ్య ముఖాముఖీ పోటీ జరుగుతోంది. వామపక్షానికి ప్రధాన పోటీదారుగా ఉంటూ వచ్చిన కాంగ్రెస్ శక్తి ఉడగటంతో బిజెపి ముందుకు వచ్చింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 5.70 శాతం, 2013 అసెంబ్లీ ఎన్నికల్లో 1.5 శాతం ఓట్లు మాత్రమే పొందిన బిజెపి అధికారం కొరకు పోటీపడే స్థితికి ఎదగటం వాపు తప్ప బలం కాదు. కాంగ్రెస్ శాసనసభ్యులు 10మందిలో ఓ అరడజను ముందుగా తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అటుతర్వాత ఆ తృణమూల్ శాసనసభాపక్షం మొత్తంగా బిజెపి తీర్థం పుచ్చుకుంది. దాంతో సిపిఐ(ఎం) వ్యతిరేక శక్తులకు బిజెపి కేంద్రంగా మారింది. నీతి, నిజాయితీ, నిరాడంబరజీవితం, సుపరిపాలన ద్వారా కల్లోల రాష్ట్రంలో శాంతి నెలకొల్పిన, ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరిచిన మాణిక్ సర్కార్ ప్రభుత్వాన్ని నేరుగా ఎదుర్కోలేని బిజెపి గిరిజనులకు ప్రత్యేక రాష్ట్రం కొరకు ఆందోళన చేస్తున్న ఐపిఎఫ్‌టితో అవకాశ వాద పొత్తు పెట్టుకుంది. ఈ చిన్న రాష్ట్ర ఓటర్లను అభివృద్ధిమంత్రంతో ఆకట్టుకునే ప్రయత్నంలో ప్రధాని మోడీ, అమిత్‌షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ తదితరులు రాష్ట్రంపై వాలిపోయారు. అయినా తమ ప్రయత్నాలు ఫలించవేమోనన్న భయంతో కావచ్చు– సిపిఐ(ఎం) వ్యతిరేక ఓట్లు చీల్చటానికి కాంగ్రెస్ పోటీ చేస్తున్నట్లు షా ఆరోపించారు. త్రిపుర మహారాజా ప్రద్యోత్ కిశోర్ మాణిక్య సారధ్యంలో కాంగ్రెస్ పార్టీ గిరిజన ఓట్లు కొన్ని పొందవచ్చు. పాలక సిపిఐ(ఎం) కొన్ని సీట్లు తగ్గినా అధికారం నిలుపుకోగలనన్న ఆత్మవిశ్వాసంతో ఉంది. ఏమైనా యువత పాత్ర ఈ ఎన్నికల్లో కీలకం కానుంది.


నాగాలాండ్‌లో ఎన్నికల బహిష్కరణ పిలుపులు సమసిపోయి ప్రధాన పార్టీలన్నీ బరిలో దిగాయి. గ్రేటర్ నాగాలాండ్ సమస్యను ఇప్పటికిప్పుడు పరిష్కరించకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని పాలక నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) భీష్మించటం తెలిసిందే. అయితే ప్రభుత్వంలో జూనియర్ పార్టనర్‌గా ఉండిన బిజెపి, కాంగ్రెస్ ఎన్నికల్లో పాల్గొంటాయని తెలిసి అదీ రంగంలో దిగింది. బిజెపి ఈలోపు, ఎన్‌పిఎఫ్‌తో 15 ఏళ్ళ బంధం తెంచుకుని మాజీ ముఖ్యమంత్రి, లోక్‌సభ సభ్యుడు నీఫియు రియో కొత్తగా ఏర్పాటు చేసిన ఎన్‌డిపిపితో పొత్తు పెట్టుకుంది. ఎన్‌డిపిపి 40,బిజెపి 20 సీట్లకు పోటీ చేస్తున్నాయి. కాగా మేఘాలయలో పదేళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా ప్రతిపక్షాల మధ్య ఓట్లు చీలిక తమకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. మణిపూర్‌లో, ఢిల్లీలో ఎన్‌డిఎలో భాగస్వాములుగా ఉన్న బిజెపి, ఎన్‌పిపి మేఘాలయలో పొత్తుపెట్టుకోలేదు. బిజెపితో పొత్తు ఉంటే క్రైస్తవ ఓటర్లు ఎన్‌పిపిని తిరస్కరిస్తారన్న భయం ఇందుకు కారణం. ముస్లింలకు హజ్‌యాత్ర సబ్సిడీని రద్దు చేసిన మోడీ ప్రభుత్వం క్రైస్తవులకు ఉచితంగా జెరూసలెం యాత్ర వాగ్దానం చేయటం అవకాశవాదానికి పరాకాష్ట.

తప్పుడు వాణిజ్య సౌలభ్య ర్యాంకు!

చూపు

'డూయింగ్ బిజినెస్ ఇన్‌డెక్స్' వివాదాన్ని పరిశీలిస్తూ గత కొన్ని వారాలుగా నేను నా సహచరుడు దివ్యాన్షి వాధ్వాతో కలిసి రెండు వ్యాసాలను ప్రచురించాను. ఆ ఇండెక్స్ ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న వ్యాపారాన్ని నియంత్రించే చర్యలను అంచనా వేస్తుంది. మా మొదటి వ్యాసం చిలీ విషయాన్ని పరిశీలించింది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వ్యాపారం స్థాయిని లెక్కించడంలో ప్రపంచబ్యాంక్ అనుసరిస్తున్న పద్ధతుల మూలంగా చిలీ బ్యాంక్ మైఖేల్ బ్యాచిలెట్ సారథ్యంలోని సోషలిస్టు ప్రభుత్వ హయాంలో వ్యాపారం స్థాయి పడిపోయినట్లు బ్యాంకు ప్రధాన ఆర్థికవేత్త పాల్ రోమర్స్ గత జనవరిలో ప్రకటించారు. ఆ తరువాత ఆమె స్థానంలో స్థానంలో వచ్చిన మరో నేత హయాంలో కొంచెం పుంజుకున్న వ్యాపారం స్థాయి తిరిగి బ్యాచిలెట్ అధికారంలోకి వచ్చాక పడిపోయినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణ చేసిన తర్వాత రోమర్ రాజీనామా చేశారు. కుట్ర సూత్రాలను పక్కనబెడుతూ మా విశ్లేషణ సాగింది. ఆ సమాచారాన్ని, సంకేతాన్ని మేము విడుదలచేశాము కూడా. మా విశ్లేషణలో ఖరారైన విషయం ఏమిటంటే ఇలా తేడాపాడాలు వ్యాపారస్థాయిలో సాధారణ పద్ధతిలో అంచనా వేసినప్పటికంటే వేరే పద్ధతిలో చూసినప్పుడు ఎక్కువగా ఉంటున్నాయని, మా రెండవ వ్యాసం భారతదేశంపై ప్రకటించిన ర్యాంకింగ్‌లను ప్రశ్నించింది. ప్రపంచ వ్యాపార ర్యాంకింగ్‌లలో భారతదేశం స్థానం 190 దేశాలకూ 2017లోని 130వ స్థానంనుంచి 2018లో 100కు ఎగబాకడమనే సందర్భాన్ని నరేంద్రమోడీ ప్రభుత్వం పండగ చేసుకుంది. ర్యాంకింగ్‌లను లెక్కించే పద్ధతిని సాధ్యమైనంత వరకు మార్చకుండా కొనసాగిస్తే ప్రపంచబ్యాంక్ తాజా రేటింగ్(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో హఠాత్తుగా కనపడిన మెరుగుదల సాధారణమని అనిపిస్తుంది.

గత వారం 'గ్లోబల్ డెవలప్‌మెంట్ సెంటర్' మా విశ్లేషణకు సమాధానంగా ఒక వ్యాసాన్ని ప్రచురించింది. ప్రపంచబ్యాంకులోని అభివృద్ధి, ఆర్థిక వ్యవహారాల సీనియర్ డైరెక్టర్ శాంతా దేవరాజన్ ఆ వ్యాసాన్ని రాశారు. మా విశ్లేషణ ఉపయోగకరం కాదని ఆయన తేల్చారు.1. ర్యాంకింగ్స్ సాపేక్షం కనుక ఇతరుల చర్యలవల్ల అవి మారుతాయి. 2. పద్ధతి ప్రకారం వచ్చే మార్పులు మెరుగైనవి. పొరపాట్లు కావు.3. భారతదేశం నిఖార్సుగా సంస్కరణలు అమలు పరిచింది. ఈ మూడు పాయింట్లను నేను అంగీకరిస్తాను. కాబట్టి 'వ్యాపారం చేయడంపై తప్పుడు విమర్శ' శీర్షికతో దేవరాజన్ ప్రచురించిన స్పందన మా వాదన తప్పు అని నిరూపించటం లేదు. మేము ఇంతకుముందు చేసిన 'డూయింగ్ బిజినెస్'లో చెప్పుకోదగ్గ తప్పుల అంశాన్ని దేవరాజన్ స్పందన దాటవేసింది. ప్రపంచబ్యాంక్ సీనియర్ సిబ్బంది 'డూయింగ్ బిజినెస్' ను సమర్థించాలనే ఒత్తిడిని భారత్‌నుంచి ఎదుర్కొంది. ప్రపంచబ్యాంకులోని భారతదేశ వ్యవహారాల డైరెక్టర్ జునాయిద్ అహ్మద్ ప్రధాన ఖాతాదారైన ప్రభుత్వంతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని ఆత్రపడ్డారు. కానీ ఆయన తన ప్రకటనలో చేసిన అనేక సూచనలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయి. ప్రభుత్వ విధాన మార్పుల వల్ల క్షేత్రస్థాయిలో సత్ఫలితాలు కనపడినట్లు చేసిన ప్రకటనకు ఆయా కంపెనీలు అందించిన సమాచారమే పునాది. వాటి వ్యాపారం స్థాయిపై వచ్చిన పరిశీలక నివేదికలను కాకుండా ఆయా చిన్న, పెద్ద కంపెనీలు అందించిన సమాచారం ఆధారంగానే ర్యాంకింగ్ పెరిగినట్లు అంచనా వేయడం తప్పు. సాధారణంగా నిపుణులు, న్యాయవాదులు, యాజమాన్య వ్యవహారాల కన్సల్టెంట్‌లు అటువంటి అధ్యయనాలు జరిపి నివేదికలు ఇస్తారు. ఆ బృందంలో ప్రభుత్వాధికారులు కూడా ఉంటారు. ఆయా పరిశీలక బృందాలకు వాస్తవాలు



రిపోర్టు చేయకుండా, వ్యాపారంలో అడ్డువస్తున్న కఠిన నియమాల గురించి నివేదికలో రాయాలని సాధారణంగా కంపెనీలు అడగడం జరుగుతుంది. 2017 నాటి 'ఈజ్ ఇన్ డూయింగ్ బిజినెస్' ర్యాంకింగ్ నివేదిక అందుకు సంబంధించిన వెబ్‌సైట్ సమాచారాన్ని ఆధారం చేసుకోలేదు. ఆ సమాచారం ఇప్పటికీ ఆ వెబ్‌సైట్‌లో ఉంది. అందులో 213వ పేజీ చూస్తే భారతదేశం ర్యాంకు 55.27 స్కోరుతో 130వ స్థానంలో ఉన్నట్లు తేలుతుంది. అందుచేత బ్యాంకు పద్ధతులను మార్చి తాజా ర్యాంకులను నిర్ణయించినట్లు చెప్పదలచుకున్నాం. అందుచేత భారతదేశం సులభంగా వ్యాపారం చేయడంలో తన ర్యాంకును 30మెట్లు హఠాత్తుగా పెంచుకుందన్న ప్రపంచబ్యాంకు వాదన సరికాదని తేలుతోంది. ఎందుకంటే అందుకు ఆధారం చేసుకున్న సమాచారం ఆ కంపెనీలు అందించినవే కనుక.

ప్రపంచబ్యాంక్ వెబ్‌సైట్‌లో సవరించిన సమాచారం ప్రకారం ర్యాంకింగ్స్‌లో తిరిగిమార్పులు చోటుచేసుకున్నాయి. ర్యాంకులను లెక్కించే పద్ధతిలో ఇటీవల అనుసరించిన మార్పులే భారతదేశం తాజా ర్యాంకుకు కారణం. భారతదేశం 2018లో ఎగబాకిన 30 పాయింట్లలో ఏడు పాయింట్లు లెక్కింపు పద్ధతిలో తప్పులవల్ల వచ్చినవే అని ఇప్పుడు వెబ్‌సైట్ తాజా సమాచారం ప్రకారం తెలుస్తోంది. 2017 మధ్యలో భారతదేశానికి సంబంధించిన సమాచారాన్ని ప్రపంచ బ్యాంకు సవరించింది. 2017 డిసెంబర్ పత్రికా ప్రకటనలో తప్పుడు అంకెలుగా భావించిన వాటినే తిరిగి వాడడం జరిగింది. అయితే ఆ వ్యత్యాసం ఉందన్న సంగతిని ఇప్పుడు ప్రపంచబ్యాంకు నిరాకరిస్తోంది. క్షేత్రస్థాయి వాస్తవానికి ఈ ర్యాంకింగ్ చాలా దూరమన్న సంగతిని మనలో చాలామంది మరిచిపోయారు. 'డూయింగ్ బిజినెస్' ర్యాంకింగ్స్‌లో భారత్ మెరుగుదల' అనే శీర్షికతో దేశంలోని ప్రపంచబ్యాంక్ శాఖ అక్టోబరు 31న విడుదల చేసిన ప్రకటనకు ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు ఆధారం. ఆ ప్రకటన మొదటిపేరాలోనే భారత్ 30మెట్లు ఎగబాకి 130వ స్థానంనుంచి 100వ స్థానానికి చేరుకుందని ప్రకటించారు. అయితే ఈ ర్యాంకింగ్‌కు మూలమైన స్కోరుకు ప్రకటనలో తగినంత ప్రాధాన్యం ఇవ్వలేదు.క్షేత్రస్థాయి వాస్తవానికి ప్రపంచబ్యాంకు ప్రకటన ఎంతదూరమో ఈ స్కోరును బట్టే తెలుస్తుంది.

మార్కెటింగ్ విజయాలకు ర్యాంకింగ్‌లు కీలకం. భారత్, చిలీ దేశాల విషయంలో ప్రపంచభ్యాంక్ మార్కెటింగ్‌కే ప్రాముఖ్యమిస్తూ, అసలు లక్ష్యాలను విస్మరించిట్లు అర్థమౌతుంది. ర్యాంకింగ్ నిర్ణయానికి ఆధారమైన సమాచారంలో తప్పిదాలున్నట్లు, దురుద్దేశంతో ఆ సమాచారం అందించినట్లు సాధారణ ప్రజలు నమ్మరు. అది నిరూపించడానికి ఆధారాలు నేరుగా సమర్పించలేము. ఈ విషయంలో వస్తున్న ఆరోపణలను ఏ మాత్రం లక్ష్యపెట్టకుండా బుట్టదాఖలా చేస్తుందని మా పోస్టులకు ప్రపంచబ్యాంకు ప్రతిస్పందన వల్ల స్పష్టమౌతోంది. తాము ఎంతో నాణ్యమైన సమాచారం అందిస్తామని గొప్పలకు పోయే ప్రపంచసంస్థకు ఆ తీరు ఏ మాత్రం మంచిదికాదు. ఎందుకంటే ఆ సమాచారం ప్రపంచ దేశాలు అనుసరిస్తున్న అభివృద్ధి విధానాలకు సంబంధించినది కాబట్టి. ప్రపంచ బ్యాంకు ర్యాంకింగ్‌లను లెక్కకట్టడానికి సొంతంగా పరిశీలన జరిపించి, ఆ సమాచారాన్ని ఆధారం చేసుకోవాలి. అలా కాకుండా కంపెనీలందించే సమాచారం ఆధారంగానే దేశానికి ర్యాంకింగ్‌ను నిర్ణయించడం సవ్యం కాదని నిపుణులు విమర్శిస్తున్నారు.

*** శామ్ పన్‌తకి**

జవాబులు లేని ప్రశ్నలు



లంకా పాపిరెడ్డి
8465053792

కాంగ్రెస్ పార్టీ పైన ఏర్పడిన తీవ్ర వ్యతిరేకత కారణంగా 2014లో బి.జె.పి. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. అప్పటి నుండి భారత రాజకీయ రంగంలో వాదనల తీరే మారిపోయింది. అడిగిన ప్రశ్నలకు బి.జె.పి. ఎప్పుడూ సూటిగా సమాధానం చెప్పదు. ప్రశ్నలనే వక్రీకరించడంలో బి.జె.పి. ది అందె వేసిన చేయి. ప్రశ్న ఒకటి అయితే జవాబు ఒకటి చెప్తుతారు దాని నాయకులు. అసలు జవాబులు ఎప్పుడూ చెప్పరు. బి.జె.పి. ప్రభుత్వం 2014 తరువాత ఏమి చేసిందో చెప్పరు. కాని 2014 ముందటి గత పాలకుల పాపాలను రోజూ జపిస్తూ ఉంటారు. తమ పాలనను సమర్థించుకుంటు పొంతన లేని వాదనలు చేస్తారు. తాటి చెట్టు ఎందుకు ఎక్కావు అంటే దూడ మేతకు అన్నట్లు చెప్తుతారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా బి.జె.పి. నాయకుల వాదనలు, ఉపన్యాసాలు ఈ క్రమంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకున్నాయి.

మూడున్నరేళ్ళకుపైగా పాలించిన తర్వాత ఇప్పుడు సాధారణ ప్రజల ప్రశ్నలకు, అనుమానాలకు జవాబులు చెప్పలేక బి.జె.పి. చిక్కులను ఎదుర్కొంటున్నది. ప్రత్యేకంగా చేసింది ఏమీలేకపోవడంతో, ఏమీ చెప్పలేక పొంతనలేని వాదనలు చేస్తున్నది. గౌతమ్ అదానికి లాభం చేకూర్చడం, అమిత్ షా కుమారుని పెరిగిన సంపద లాంటి ఆరోపణలే కాదు నిన్న మొన్నటి రాఫెల్ యుద్ధ విమానాల కుంభకోణం వరకు ఎన్నో అవినీతి ఆరోపణలున్నాయి. నిజానికి అవినీతి ఆరోపణలు, అవినీతి లేకపోతే అభివృద్ధి సాఫీగా జరుగుతుంది. అటువంటప్పుడు చేసిన అభివృద్ధి గురించి చెప్పాలి. అవినీతి ఆరోపణలు లేవని చెప్పుకోవడం ఎందుకు. అవినీతి ఆరోపణలు లేకపోతే, అభివృద్ధి చేయరా ? చేసిన అభివృద్ధి గురించి చెప్పరా? అసలు విషయం ఏమిటంటే అవినీతి ఆరోపణలు లేవు అనే పరదా వెనక తమ అసమర్థతను దాచి పెట్టాలని బి.జె.పి. నాయకులు ప్రయత్నిస్తున్నారు.

పెద్దనోట్లు రద్దు చేసిన కాలంలో కూడా బి.జె.పి. నాయకులు, కార్యకర్తలు ఇలాంటి పొంతనలేని వాదనలే చేశారు. ప్రజలు ఎ.టి.ఎమ్.ల వద్ద , బ్యాంకుల వద్ద ఇబ్బందులు పడుతున్నారని, చనిపోతున్నారని ఎవరైనా అంటే, సరిహద్దుల వద్ద సైనికులు ఇంతకంటే ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారని వాదించే వారు. సైనికులకు పెద్దనోట్ల రద్దుకు సంబంధం ఏమిటి ? పెద్దనోట్ల రద్దు వలన సమస్యలే తప్ప సాధించేది ఏమి ఉండదని ఎవరైనా వాదిస్తే, వారిని దేశద్రోహులుగా, ఉగ్రవాదులుగా, నల్లధనం సమర్ధకులుగా కూడా ముద్ర వేయడానికి వెనుకాడ లేదు బి.జె.పి. నాయకులు. కాని ఎంత నల్లధనం వెలికి తీశారు ఉగ్రవాదాన్ని ఎంత కట్టడి చేశారో, దొంగనోట్లను ఏ మేరకు అరికట్టారు అనే విషయాల ఊసే ఎత్తడం లేదు ఇప్పుడు. ఇంకా ఆశ్చర్యంగా, అరుణ్ జైట్లీ గారు మొన్న బడ్జెట్ చర్చల సందర్భంగా రాజ్యసభలో మాట్లాడుతూ, పెద్ద నోట్ల రద్దు వలన పన్నులు కట్టేవారి సంఖ్య పెరిగింది, పన్నులు పెరిగాయి అంటూ గొప్పలు చెప్పాడు. అంటే పన్నులు కట్టే వారి సంఖ్య, లేదా పన్నులు పెంచడానికే పెద్ద నోట్లను రద్దు చేశారా? అప్పుడు అలాగే చెప్పారా? పన్నులు కట్టే వారి సంఖ్య, పన్నులు పెంచడం కొరకు పెద్దనోట్లు రద్దు చేయాలా? ఒక్క వాదన కూడా తర్క బద్ధంగా ఉండదు.

రైతుల విషయంలో కూడా బి.జె.పి. వంకర టింకర వాదనలే చేస్తున్నది. రైతులకు చేసింది ఏమి లేకున్నా రైతుల బడ్జెట్ అని ప్రచారం చేస్తున్నారు. భూమికి హెల్త్ కార్డులు, పంటలకు భీమా అని ఎన్నో చెప్పారు. ఏది సరిగా అమలు కాలేదు. ఇక రైతులకు ఇస్తున్నామని, ఇస్తామని చెపుతున్న మద్దతు ధర ఒక పెద్ద భ్రమ. 2022 వరకు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పారు. రైతులకు ఇచ్చిన అన్నింటి కంటే పెద్ద హామీ ఇది. ఇప్పటి వరకు రైతుల ఆదాయం ఎంత వరకు పెంచారు? అనే విషయం మాత్రం ఎవరు చెప్పడం లేదు. అసలైన ఈ విషయాన్ని దాటవేసి, దేశంలో 275మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు, 300 మిలియన్ టన్నుల పండ్లు, కూరగాయలు పండించారనీ ఇది మా గొప్పదనమే అనీ చెప్పుకుంటున్నారు. ఎన్ని మిలియన్ టన్నుల పంటలు పండించారు అనేది అసలు విషయం కాదు. రైతులకు ఎంత ఆదాయం దక్కింది అనేది అసలు విషయం. ఇప్పటి వరకు రైతుల ఆదాయం ఎంతవరకు పెంచారనేది అసలు విషయం. 2022లో ఒకేసారి అబ్రకదబ్రక అంటూ మంత్రం చదివేసి రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేస్తారా? దేశంలో పంటలు పండక పోవడం కాదు సమస్య, పండిచే రైతులకు ఆదాయాలు పెరగకపోగా తరిగిపోతున్నాయి. ఇది సమస్య ఇది అసలు సంక్షోభం.

అంకెల గారడితో, మాటల మంత్రాలతో ఈ సంక్షోభం పరిష్కారం కాదు. కాని బి.జె.పి. అదే పని చేస్తున్నది. నిరుద్యోగం విషయంలోనూ బి.జె.పి.ది కుతర్కమే. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామని బి.జె.పి. నాయకులు ఎన్నికల సభలలో ఉపన్యాసాలు దంచారు. నాలుగు సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా జవాబు చెప్పాల్సి వచ్చేసరికి, బి.జె.పి. నాయకులు పొంతనలేని వాదనలకు దిగుతున్నారు. ముద్రా యోజన కింద పదికోట్ల మందికి అప్పులు ఇచ్చాము. వారందరికి ఉద్యోగాలు కల్పించినట్లు కాదా అని వారే ప్రశ్నిస్తున్నారు. ఇందులోనూ మొదటిసారి అప్పులు తీసుకున్నది 3కోట్ల మందే. అయితే ఎన్నికల సభలలో బి.జె.పి. నాయకులు ఈ ఉద్యోగాల గురించే చెప్పారా ? భారతదేశం యువభారతం, 65 శాతం యువకులు ఉన్నారు, వారికి గౌరవప్రదమైన ఉద్యోగాలు కల్పించాలి అన్నారు. అంతే కాదు, రోజ్గార్ యోజన లాంటి ఉద్యోగాలు కాదు అని వాటిని వెక్కిరించారు. ఇప్పుడు పకోడీలు అమ్ముకోవడం కూడా ఉద్యోగమే అంటున్నారు. పకోడీలు అమ్ముకోవడం తప్పుకుండా ఒక గౌరవ ప్రదమైన ఉపాధినే, కాని ఉద్యోగం కాదు. ఉద్యోగం నిర్వచనం వేరు. ముద్రాయోజనాలో ఇవ్వబడిన అప్పులలో 90 శాతం శిశులోన్ కింద ఇవ్వబడిన అప్పులే. ఈ శిశులోన్ కింద ఇవ్వబడే అప్పు 50 వేలు మాత్రమే. చింతాకు విస్తరిలో ఇద్దరికి ఒక మెతుకు చొప్పున కడుపునిండా భోజనం పెట్టించాను మారాజా అన్నట్లు ఉంది. 50వేల రూపాయలతో చిన్న కిరాణ దుకాణం కూడా పెట్టలేరు. అందరు అమిత్షా కొడుకులు కాదు అతి తక్కువ పెట్టుబడితో అతి వేగంగా సంపద పోగేయడానికి. 50 వేల రూపాయలతో పకోడా లాంటి అనిశ్చితమైన స్వయం ఉపాధి తప్ప ఏమీ చేయలేరు. ముద్రాయోజన కింద ఇచ్చిన అప్పులతో ఏమి పరిశ్రమలు పెట్టగలరు అని ఎవరు ప్రశ్నించక ముందే, పరోక్షంగా సూచిస్తూ పకోడి దుకాణాలను ప్రచారంలోకి తెచ్చారు. అన్ని అర్హతలు ఎన్నో సమర్ధతలు ఉన్నా, అనేక రంగాలలో దేశానికి అవసరం ఉన్నా, పాలకుల అసమర్థత వలన గత్యంతరం లేక అప్పో సప్పో చేసి స్వయం ఉపాధి కల్పించుకుంటే బి.జె.పి. వీళ్లను ఉద్యోగులు అంటున్నది. వీళ్లు ఉద్యోగులు కాదు, రుణగ్రస్థులు.10–12 శాతం వడ్డీతో 50 వేల అప్పు తీర్చేసరికి ఉన్న ముంతా బొంతా కూడా కోల్పవలసి రావచ్చు. తాము చెప్పింది చేయలేక, ఉన్నదానినే, మేమే చేశాము, మేము చెప్పిందీ, అనుకున్నదీ ఇదే అనే విధంగా వితండ వాదన చేస్తున్నారు, బి.జె.పి. నాయకులు.

జి.ఎస్.టి. గురించి కూడా బి.జె.పి. నాయకులు చెప్పింది ఒకటి, చేసింది ఒకటి. ఇప్పుడు వాదిస్తున్నది ఇంకొకటి. వారు తీసుకునే ప్రతి నిర్ణయం అసలు ఉద్దేశము ఒకటి ఉంటుంది, కాని ప్రచారం ఒకటి చేస్తారు. బి.జె.పి. ప్రత్యేకత ఏమిటంటే, తమ ప్రతి నిర్ణయానికి దేశభక్తి, జాతీయవాదం రంగు పులుముతారు. ఆ నిర్ణయాలను ప్రశ్నించేవారిపై దేశద్రోహులుగా ముద్ర వేస్తారు. జి.ఎస్.టి. గురించి ఒకే దేశం ఒకే పన్ను అని ప్రచారం చేసారు. ఒకే పన్ను అనేది లేకపోతే అది ఒకే దేశం కాకుండా అయి పోయినట్లు ఒక భావనను వ్యాపింప చేసారు. కాని పెట్రోల్, డీజిల్, మద్యాలను, జి.ఎస్.టి.లో చేర్చరు. ఒకే దేశం ఒకే పన్ను అనేది నిజానికి దేశ ఫెడరల్ సూత్రానికి వ్యతిరేకమైనది. కేవలం బడా పెట్టుబడి దారులకు మత్రమే జి.ఎస్.టి. ఉపయోగ పడుతుంది. దానికి జాతీయవాదం రంగు వేసి ప్రచారం చేసారు.

జి.ఎస్.టి.తో ధరలు తగ్గుతాయని చెప్పారు. కాని ఆచరణలో ధరలు పెరిగాయి. ప్రజల్లో వ్యతిరేకత రావడంతో జి.ఎస్.టి. స్లాబులలో సవరణలు మొదలు పెట్టారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా కొన్ని సవరణలు జరిగాయి. సాధారణ ఎన్నికలు జరిగే వరకు ఇంకా కొన్ని సవరణలు జరగవచ్చు. నిజానికి జి.ఎస్.టి. అనేది పరోక్ష పన్నుల కిందికి వస్తుంది. పరోక్షపన్నులు సాధారణ ప్రజలందరూ వివిధ సరుకులు కొంటున్నప్పుడు, సేవలు పొందుతున్నప్పుడు చెల్లించే పన్నులు. ఒకే దేశం పేరు మీద ప్రజలపైన పరోక్ష పన్నుల భారం పెంచి కార్పోరేటు శక్తులకు వెసులుబాటు కల్పించడమే బి.జె.పి. అసలు ఉద్దేశము. సంపన్నులు కట్టవలసిన ప్రత్యక్ష పన్నులను వదిలివేసి, సామాన్యులు కట్టే పరోక్ష పన్నులు పెంచుతున్నారు. కార్పోరేట్ శక్తులకు పన్నులలో రాయితీలు ఇస్తారు. వేల కోట్ల రూపాయల అప్పులను రద్దు చేస్తారు. మరో వైపు జి.ఎస్.టి. పేరుతో పరోక్ష పన్నుల భారాన్ని ప్రజలపైన పంచుతున్నారు. ఇక జి.డి.పి. ద్రవ్యోల్బణం లెక్కలను ఎలా అంటే అలా ఆడిస్తున్నారు. అంకెలగారడి చేసి జి.డి.పి.ని పెంచనూ వచ్చు, ద్రవ్యోల్బణాన్ని తగ్గించనూ వచ్చు. జి.డి.పి.ని లెక్కించే పద్ధతినే మార్చివేసారు. అన్నింటి ధరలు పెరుగుతూ ఉన్నా ప్రభుత్వ లెక్కల్లో ద్రవ్యోల్బణం తగ్గుతూ ఉంటుంది. ఆడం స్మిత్ తాతకు కూడా అర్థం కాదు బి.జె.పి. అర్థశాస్త్రం.

దేశం ముందున్న ప్రధాన సమస్యలను పక్కన పెట్టి, అప్రధాన సమస్యలను, ప్రధాన సమస్యలుగా చూపించడానికి బి.జె.పి. ప్రయత్నిస్తున్నది. ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్., మూడి లాంటి అంతర్జాతీయ సంస్థలు ఇచ్చిన బూటకపు సర్టిఫికెట్లు పట్టుకుని అంతా సక్రమంగానే ఉందనే భ్రమలు కల్పిస్తున్నారు. వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉన్నది. నిజానికి ఈ సంక్షోభం కేవలం వ్యవసాయానికి చెందిన సంక్షోభం మాత్రమే కాదు, మొత్తం దేశం యొక్క అభివృద్ధి నమూనాకు చెందిన సంక్షోభం. నిరుద్యోగం మరో ప్రధాన సమస్య. ప్రతి సం॥ము లక్షల మంది విద్యార్థులు పట్టాలు పుచ్చుకుని నిరుద్యోగుల సైన్యంలో చేరుతున్నారు. మరో వైపు దేశానికి అనేక రంగాలలో రకరకాల ఉద్యోగుల అవసరమూ ఉన్నది. కేంద్రప్రభుత్వం అసమర్థత వలన యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కాలేక పోతున్నారు. ప్రధానమైన ఈ సమస్యలను పరిష్కరించకుండా, ఎన్ని వితండ వాదాలు చేసినా, దేశ భక్తి'' పేరుతో ఇతరుల మీదనే నిందలు వేసి ఆరోపణలు చేసినా జరిగేది ఒరిగేది ఏమి ఉండదు. సమస్యలు పరిష్కారం కాకపోగా, దేశం మరింత సంక్షోభంలోకి జారిపోయే అవకాశమే ఉంటుంది. అటల్ బిహారి వాజ్‌పాయ్ కాలంలో కూడా సరిగ్గా ఇలాగే దేశ వాస్తవ పరిస్థితులను మరుగు పరిచి, దేశం వెలిగిపోతున్నదంటు అట్టహాస ప్రచారం చేశారు. ఫలితంగా పది సంవత్సరాలు(2004–2014) బి.జె.పి.ని ప్రజలు అధికారానికి దూరంగా ఉంచారు. బి.జె.పి. తన విధానాలను, పద్ధతులను మార్చుకోకపోతే ఈసారి ప్రజలు బి.జె.పి.ని 20సం॥ల వరకు తేరుకోకుండా చేసినా ఆశ్చర్యపోనక్కర లేదు. బి.జె.పి ఈ విషయాన్ని గుర్తు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఎంపిలు, ఎమ్మెల్యేలూ ఆస్తుల గుట్టు విప్పాల్సిందే



చెన్నూరి గణేశ్
8897300975

పదవులు చేపట్టిన నాటినుంచి అక్రమ సంపాదనే ధ్యేయంగా బతుకుతున్న ప్రజా ప్రతినిధులకు చెంపపెట్టులాంటి తీర్పును దేశ అత్యున్నత న్యాయస్థానం రెండు రోజుల క్రితం వెలువరించింది. ప్రజలు ఎన్నుకున్న ఎంపిలు, ఎమ్మెల్యేలు వారితో పాటు వారి కుటుంబ ఆస్తులు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియచేయాలని ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ స్పష్టం చేసింది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఎంపిలు, ఎమ్మెల్యేల అక్రమ సంపాదనపై లోక్ ప్రహరి అనే సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు తన తీర్పులో ఘాటుగా స్పందించింది. విశేషమేమిటంటే కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఈ కేసులో వాదిగా చేరి ప్రజాప్రతినిధుల అక్రమార్జనపై చర్యలు తీసుకునే హక్కు తమకు కల్పించాలని వాదన చేసింది. ప్రజల ఓటుతో గెలిచే ఎంపిలు, ఎమ్మెల్యేలు తమ కాలపరిమితి ముగిసే లోగా విపరీతంగా ఆస్తులు సమకూర్చుకోవడంతోపాటు తమ కుటుంబ సభ్యులను బినామీలుగా పెట్టి కోట్లు ఆర్జిస్తున్నారని, ఇంత డబ్బు ఎక్కడినుంచి వస్తుందో తెలుసుకోవాల్సిన అవసరముందని లోక్ ప్రహరి సంస్థ తన పిటిషన్‌లో అభ్యర్థించింది. దేశ ఎన్నికల విధానాన్ని సంస్కరించడంతో పాటు ప్రజా ప్రతినిధులు ప్రజలకు బాధ్యులుగా ఉండేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని కూడా కోరింది. పిటిషనర్ల వాదనలు పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజలు ఇచ్చిన అధికారంతో పదవులు చేపట్టే ప్రజా ప్రతినిధులు అక్రమమార్గాల్లో ఆస్తులు సమకూర్చుకోవడం సహించరాని విషయమని, దీన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరముందని సుప్రీంకోర్టు బెంచ్ అభిప్రాయపడింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 38, 39 ప్రకారం, సమాజంలో ఆస్తి అంతా ఒక వర్గం వద్ద కేంద్రీకృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉందని, ఇలా అంతరాలు పెరగకుండా ఒక విధానాన్ని ప్రకటించాల్సి ఉందని పేర్కొంది. సరైన విధానం లేకపోవడం వల్ల మన దేశంలో పేద, ధనిక మధ్య అంతరం పెరిగి పోవడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజల ఓటుతో పదవులు చేపడుతున్న ఎంపిలు, ఎమ్మెల్యేల ఆస్తులపై నియంత్రణ లేకపోతే ఎలా అని ప్రశ్నించింది.

ప్రజాప్రతినిధులు పదవులు చేపట్టిన నాటి నుంచి అక్రమార్జనే లక్ష్యంగా పనిచేస్తున్నారని, ఇది ఒక రకంగా మాఫియా పాలనను గుర్తుకు తెస్తోందని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తమ పదవులు అడ్డం పెట్టుకుని ఇలా అక్రమ మార్గాలు తొక్కడం అనైతికమని పేర్కొంటూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 102(1), 191(1) ప్రకారం వారిని అనర్హులుగా ప్రకటించవచ్చని స్పష్టం చేసింది. అవినీతి నిరోధకచట్టం పరిధిలోకి ప్రజాప్రతినిధులు కూడా వస్తారని గుర్తుకు తెస్తూ అయితే ప్రతి సందర్భంలోనూ ఈ చట్టం కింద వారిని శిక్షించడం జరిగే పనికాదని న్యాయమూర్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల అక్రమంగా కూడబెడుతున్న ఆస్తులపై నియంత్రణ లేకపోతే దాని ప్రభావం ప్రజాస్వామ్య వ్యవస్థపై పడే ప్రమాదముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఎంపిలు, ఎమ్మెల్యేలు ఏటా తన తమ కుటుంబ సభ్యుల ఆస్తులు స్పీకర్లకు వెల్లడించాల్సి ఉంది. అలాగే కేంద్రమంత్రులు ప్రధానికి, రాష్ట్రాల మంత్రులు ముఖ్యమంత్రులకు సమర్పించాల్సి ఉంది. అయితే ఇది కేవలం నైతిక బాధ్యతగా చేపట్టిన చర్య తప్పిస్తే దీనికి ఎటువంటి చట్టబద్ధతా లేదు. ఇటువంటి చర్యలను పరోక్షంగా ప్రస్తావించిన న్యాయమూర్తులు సరైన చట్టం లేనప్పుడు ఇటువంటి చర్యల వల్ల పెద్దగా ఫలితం ఉండబోదని స్పష్టం చేశారు. తాజా పరిస్థితులను అధ్యయనం చేసి అక్రమార్జనకు పాల్పడితే తక్షణం పదవులు కోల్పోయే విధంగా చట్టాన్ని సవరించాల్సి ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంలో ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని ప్రస్తావించిన సుప్రీంకోర్టు ఈ చట్టంలోని 169 సెక్షన్ ప్రకారం ఇప్పటికే అక్రమాలకు పాల్పడే వారిని అనర్హులుగా ప్రకటించే హక్కు పార్లమెంటుకు ఉందని స్పష్టం చేసింది. అలాగే రాజ్యాంగంలోని అనేక అధికరణలు పార్లమెంటుకు విశేష అధికారాలు ఇచ్చిన అంశాన్ని ప్రస్తావించింది. గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధుల ఆస్తులపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టడంతో పాటు వారు అక్రమాలకు పాల్పడిన వెంటనే పదవులకు అనర్హులను చేయడంతోపాటు మరోసారి పోటీ చేసే అవకాశం కూడా లేకుండా చూడాలని న్యాయమూర్తులు సూచించారు. ప్రజాప్రతినిధులతోపాటు వారి కుటుంబసభ్యుల ఆస్తులు కూడా ప్రజలకు ఎప్పటికప్పుడు తెలిసేలా ప్రజా ప్రాతినిధ్య చట్టంలో తగిన మార్పులు తేవాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని తన తీర్పులో ఆదేశించింది.

ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం
మన తెలంగాణ
మన
మనపేజీ
మనందరిపేజీ
www.manatelangana.news
హైదరాబాద్ | ఆదివారం | 18 ఫిబ్రవరి | 2018

ఈసురోమని మనుషులుంటే...

పోషక తిండి లేమితో బాధపడుతున్న ఆధునిక భారతం

రెండున్నర సంవత్సరాల వయసున్న పల్లవి కేవలం ఆరున్నర కిలోల బరువు మాత్రమే ఉంది. ఆమె వయసు పిల్లలు నిజానికి కనీసం ఎనిమిది కిలోల బరువు ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లు లెక్క. నల్గొండ జిల్లాలో ఒక మారుమూల గ్రామంలో ఒక పేద వ్యవసాయ కూలీ కుటుంబంలో పుట్టిన పల్లవి పుట్టుకతోనే ఇలా తక్కువ బరువుతో లేదు. చక్కగా, ఆరోగ్యంగా, దాదాపు రెండున్నర కిలోల కన్నా కొంచం ఎక్కువ బరువుతో పుట్టింది. అయితే పెరిగే కొద్దీ ఆ అమ్మాయి తగిన పోషణ లేక, వయసుకు తగిన బరువు లేక, చీటికీ మాటికీ అనారోగ్యాలతో బలహీనంగా తయారయ్యింది.

పల్లవిలాగా పోషకాహార లోపంతో, తక్కువ బరువుతో, వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు లేకుండా తరచు అనారోగ్యాలకు గురవుతూ ఉన్న పిల్లలుమన దేశంలో కొన్ని కోట్ల మంది ఉన్నారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలు భారతదేశంలో చైనా కన్నా ఐదు రెట్లు ఎక్కువగాను, సబ్ సహారాన్ ఆఫ్రికన్దేశాల కన్నా రెండు రెట్లు ఎక్కువగాను ఉన్నటు గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో ఐదు సంవత్సరాల కన్నా తక్కువ వయసు ఉన్న పిల్లలలో దాదాపు సగం మంది తక్కువ బరువు కలిగి ఉండగా, 45 % మంది వారి వయసుకు తగిన ఎత్తు లేకుండా, 25 % మంది ఎత్తుకు తగిన బరువు లేకుండా ఉన్నారు. 75 % పిల్లలు రక్తహీనతతో బాధపడుతుండగా, 57 % మంది విటమిన్ ఎ లోపం కలిగి ఉన్నారు. వివిధ వ్యాధులపై అంతర్జాతీయ స్థాయిలో 2016 లో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం ఆ ఒక్క సంవత్సరంలోనే మన దేశంలో ఐదు సంవత్సరాలలోపు వయసు గల పిల్లలలో దాదాపు 9 లక్షల మంది మరణించారంటే మనపిల్లలలో పోషకాహారలోపం, వ్యాధి నిరోధకశక్తి లోపం ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

పోషకాహార లోపం అనేది పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను దెబ్బతీస్తుంది. వారిలో వ్యాధి నిరోధక శక్తిని, కొత్తవిషయాలను నేర్చుకునే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. దీనితో పిల్లలు చదువుకునేందుకు ఆసక్తి చూపక ఎంతో మంది చదువును మధ్యలోనే ఆపి వేయడం జరుగుతుంది. దీనితో వారి భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారుతుంది. ఆరోగ్యంపై, చదువుపై, భవిష్యత్తు ఉపాధి అవకాశాలపై ఇంతగా ప్రభావం చూపే పోషకాహార లోపం అనే సమస్యని నిర్లక్ష్యంచేస్తే మానవాభివృద్ధి సూచికలపై, దేశ ఆర్థికపురోగతిపై అది తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుందనేది వాస్తవం.

శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం ఒక వ్యక్తిజీవితంలో మొదటి వెయ్యి రోజులు, అంటే తల్లి గర్భం దాల్చిన సమయం నుండి ఆ వ్యక్తికి రెండవ సంవత్సరం నిండేవరకు ఉండే సమయం ఆ వ్యక్తి మానసిక, శారీరక, వైయక్తిక ఎదుగుదలకు ఎంతో కీలకం. ఈ కీలక దశలో లభించే పోషకాల మీదనేవ్యక్తి వికాసం ఆధారపడి ఉంటుంది. అయితే అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం దేశంలో గర్భధారణకు అనుకూలమైన వయసులో ఉన్న స్త్రీలలో సగంకి పైగా రక్తహీనతతో బాధపడుతున్నట్లు, దాదాపు 33 శాతం మంది పోషకాహారలోపంతో బాధపడుతున్నట్లు తెలుస్తుంది.

2011లో నాంది ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ దేశంలోని 112 జిల్లాలలో నిర్వహించిన హంగామా (హంగర్ అండ్ మాల్ న్యూట్రిషన్) అనే సర్వే నివేదిక ప్రకారం దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో దాదాపు 80 శాతం మంది స్త్రీలు పోషకాహారలోపం అనే మాటే వినలేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఇంత అవగాహనాలేమి ఉన్న దేశంలో పిల్లలు, స్త్రీలు సరైన పోషకాహారం లేక, అనారోగ్యాలతో ఈసురోమంటూ జీవితాలు గడుపుతున్నారంటే ఆశ్చర్యంఏముంది. నాణానికి మరో వైపు చూస్తే 1991 నుండి ఇప్పటికి దేశ ఆర్థిక వ్యవస్థ రెండు రెట్లు బలపడింది. ప్రజల జీవన ప్రమాణాలు చాలా వరకు మెరుగుపడ్డాయి. పేదరిక శాతాలు బాగా తగ్గాయి. పోషకాహార లోపాన్నిఅరికట్టేందుకు ప్రపంచంలోనే అతిపెద్దదైన ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెట్ సర్వీసెస్ (ICDS) పథకం 1975 నుండిదేశంలో అమలులోఉంది. అయినా పోషకాహార విషయంలో అతిపేదవైన ఆఫ్రికన్ దేశాలకన్నా మన దేశం ఎందుకు వెనకపడి ఉంది అనేది మన లాజిక్కుకు అందని విషయం.

దేశంలోని పేదలకు తక్కువ ధరలకే ఆహార ధాన్యాలను అందించేందుకు మనకు అతిపెద్దదైన ప్రజాపంపిణీ వ్యవస్థ ఉంది. చౌకధరల దుకాణాల ద్వారా, అన్నపూర్ణ, అంత్యోదయ వంటి పథకాల ద్వారా పేదలకు ఆహారధాన్యాలు అందించడం జరుగుతుంది. 2012 లో 12 వపంచవర్ష ప్రణాళికాకాలంలో ICDS పథకాన్ని పునర్వ్యవస్థీకరించి దేశంలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారామూడు నుండి ఆరు సంవత్సరాల వయసు గల పిల్లలకు అదనపు పోషకాహారాన్ని, ప్రీస్కూల్ విద్యని , వాక్సినేషన్ వంటి సేవలను అందించే ఏర్పాటు చేయడం జరిగింది. 2013 లో అమలులోకి తీసుకురాబడిన జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రధాన లక్ష్యం ఆహార భద్రత కల్పించడం ద్వారా పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడమే.

అయితే ఈ చర్యలన్నీ పోషకాహారలోపం అనే అతిపెద్ద సమస్యను ఎదుర్కొనేందుకు సరిపోతాయా అంటే సమాధానం దొరకదు. చాలా వరకు పోషకాహారలోపం అంటే అది పేదరికానికి సంబంధించిన విషయంగా భావిస్తారు. పేదరికం వల్ల సరైన ఆహారం తీసుకోలేని వారే ఈసమస్యను ఎదుర్కుంటారు అనేది అందరికీ ఉండే అభిప్రాయం. అయితే మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాలలోని స్త్రీలు, పిల్లలలో కూడా ఈ పోషకాహారలోపం అధికంగా ఉందనేది గణాంకాలు చెబుతున్న సత్యం. నిజానికి పోషకాహార లోపానికి ఏ ఒక్కటీ ప్రధాన కారణంగా చెప్పలేము. బిడ్డపుట్టిన తొలి మూడు సంవత్సరాలలో సరైన పోషణ, సంరక్షణ లేకపోవడం ఇందుకు ఒక ప్రధాన కారణం. దీనికి తోడు సరైన పరిశుభ్రత పాటించకపోవడం, పారిశుద్ధ్యలోపం కూడా బిడ్డలలో అనేక ఇన్ఫెక్షన్లకు కారణమై వారిలో పోషకాలులోపించేలా చేస్తున్నాయి. మరుగుదొడ్లు అందుబాటులో లేక బహిరంగ మల



తొలిసారి గర్భం ధరించే స్త్రీలలో అధిక శాతంమంది అప్పుడేయుక్తవయసుకువచ్చిన అమ్మాయిలు. వారి శరీరం ఇంకా గర్భధారణకు అనువుగా ఉండదు. వీరిలో దాదాపు 75 శాతం మంది రక్త హీనతను క లిగి ఉంటారు. చిన్న వయసు నుండి ఆడపిల్లల పట్ల మన సమాజం చూపే వివక్ష వారు తినే ఆహారంపై, వారి ఎదుగుదలపై, వారి అవగాహనా సామర్థ్యంపై ఎంతో చెడు ప్రభావాన్ని చూపిస్తుంది. దీనితో వారు తమ శరీరాలపై, తాము తీసుకోవలసిన ఆహారంపై, బిడ్డల సంరక్షణపై ఏమాత్రం అవగాహన లేక తమ పోషణ, తమ బిడ్డల పోషణ కూడా సరిగా చేసుకోలేకపోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా గర్భం ధరించిన స్త్రీలు గర్భం ధరించిన సమయం నుండి ప్రసవ సమయానికి మధ్య దాదాపు పది కిలోల బరువు పెరుగుతుండగా మనదేశంలో స్త్రీలు సరాసరి ఐదుకిలోలు మాత్రమే పెరుగుతున్నారని సర్వేల ద్వారా తెలుస్తుంది. ఇలా పోషకారలోపంతో, అవగాహనలేమితో యుక్తవయసులోనే తల్లులవుతున్న స్త్రీలు తక్కువ బరువు ఉన్న బిడ్డలకు జన్మనివ్వడం ద్వారా పోషకాహారలోపం అనే ఒక విష విలయానికి తెరతీస్తున్నారు.

విసర్జన చేసే కుటుంబాలలో ఎదుగుదల లోపం అధికంగా ఉంటున్నట్లు అనేక సర్వేలు రుజువు చేస్తున్నాయి. ఇంతేకాక, బాల్య వివాహాలు అధికంగా ఉండడం కూడా పోషకాహార లోపం మరింత పెరిగేందుకు ఒక కారణం. తొలిసారి గర్భం ధరించే స్త్రీలలో అధిక శాతంమందిఅప్పుడేయుక్తవయసుకువచ్చినఅమ్మాయిలు. వారి శరీరం ఇంకాగర్భధారణకు అనువుగా ఉండదు. వీరిలోదాదాపు 75 శాతం మంది రక్త హీనతనుక లిగి ఉంటారు. చిన్న వయసు నుండి ఆడపిల్లల పట్ల మన సమాజం చూపే వివక్ష వారు తినే ఆహారంపై, వారి ఎదుగుదలపై, వారి అవగాహనా సామర్థ్యంపై ఎంతో చెడుప్రభావాన్ని చూపిస్తుంది. దీనితో వారు తమ శరీరాలపై, తాము తీసుకోవలసిన ఆహారంపై, బిడ్డల సంరక్షణపై ఏమాత్రం అవగాహన లేక తమ పోషణ, తమ బిడ్డల పోషణ కూడా సరిగా చేసుకోలేకపోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా గర్భం ధరించిన స్త్రీలు గర్భం ధరించిన సమయం నుండి ప్రసవ సమయానికి మధ్య దాదాపు పది కిలోల బరువు పెరుగుతుండగా మనదేశంలో స్త్రీలు సరాసరి ఐదు కిలోలు మాత్రమే పెరుగుతున్నారని సర్వేల ద్వారా తెలుస్తుంది. ఇలా పోషకారలోపంతో, అవగాహనలేమితో యుక్తవయసులోనే తల్లులవుతున్న స్త్రీలు తక్కువ బరువు ఉన్న బిడ్డలకు జన్మనివ్వడం ద్వారా పోషకాహారలోపం అనే ఒక విష విలయానికి తెరతీస్తున్నారు. బంగ్లాదేశ్‌లో ఇటీవలనిర్వహించిన అధ్యయనం ప్రకారం స్త్రీలు అక్షరాస్యత సాధించి, కుటుంబ నిర్ణయాలలో పాలుపంచుకుంటూ, సాధికారత పొందిన కుటుంబాలలో, ప్రాంతాలలో పోషకాహారాలేమి సమస్య తక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. దీనివల్ల సమాజంలో స్త్రీల స్థాయికి, పోషకాహారానికి, పిల్లల ఆరోగ్యాలకు ఉన్న సంబంధం తేటతెల్లమవుతుంది. సరైన ఆహారం లేకపోవడమే పోషకాహారలేమికి ఒక ప్రధాన కారణం అనే అవగాహనతో గతంలో రూపొందించిన ప్రజాపంపిణీ, ICDS వంటి పథకాలన్నీ పేదలకు ఆహారాన్ని అందించడంపైనే దృష్టిపెట్టాయి. అయితే పోషకాహార లోపం అనేది ఆహార సమస్య మాత్రమే కాదు. అది బహుముఖమైంది. నిరక్షరాస్యత, స్త్రీల స్థితిగతులు, పారిశుధ్యం, పోషణపై అవగాహన లేకపోవడం, తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన లేకపోవడం, శుభ్రమైన త్రాగునీరు లభించకపోవడం, నవ జాతశిశువుల ఆరోగ్య సంరక్షణకు సరైన వసతులు లేకపోవడం ఇలా ఎన్నో అంశాలు బిడ్డల పోషణను, ఆరోగ్యాన్ని తద్వారా వారి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి.

భారత రాజ్యాగం దేశంలోని ప్రతి ఒక్కరికీ జీవించే హక్కును కల్పించింది. జీవించడమంటే ఈసురోమంటూ ఎలాగోలా జీవితాన్ని నెట్టుకు రావడం కాదు. ఆరోగ్యంగా, సంతోషంగా, దృఢంగాప్రతిఒక్కరు జీవించాలంటే పోషకాహార సమస్యపై అత్యవసరంగా దృష్టిపెట్టక తప్పదు. ఇందుకు మొదటిమెట్టు ICDS వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయడం. దేశంలో అంగన్వాడీల పనితీరు గురించి మనకు తెలియంది కాదు. అంగన్వాడీవర్కర్లు, హెల్పర్లు తగిన సంఖ్యలో లేకపోవడం, ఉన్న వారికితగినంత అవగాహన, నైపుణ్యాలు లేకపోవడం, ఆహార పంపిణీలోఅవకతవకలు, చిత్తశుద్ధిలేమి ఇలాచెప్పుకుంటూ పోతే చాలా సమస్యలు. ఈలోపాలను సరిదిద్దుకోవడమేకాక యుక్తవయసు బాలికలు, స్త్రీల ఆరోగ్యం, పోషణపై దృష్టిపెట్టాల్సిఉంది. తాగునీరు, పారిశుధ్యం, అక్షరాస్యత ఇలా ఎన్నో సమస్యలను పరిష్కరించడం ద్వారామాత్రమే పోషకాహార సమస్యని సమర్థవంతంగా ఎదుర్కోగలం. అప్పుడే పల్లవి లాంటి ఎంతోమంది పిల్లలు ఆరోగ్యంగా, సంతోషంగా, ప్రయోజనకరమైన పౌరులుగా ఎదిగేందుకు అవకాశం కలుగుతుంది.



భారతి కోడె
9440103411

ప్యాడ్‌పై మాట్లాడుకుందాం

సృష్టి మూలంపై దృష్టిసారిద్దాం

నెలసరి ప్యాడ్స్‌పై కేంద్ర ప్రభుత్వం 12 శాతం పన్ను వేయడం దారుణం. ఇది స్త్రీల హక్కుకు, గౌరవానికి భంగం, "బేటీ బచావో, బేటీ పడావో" అనే ప్రభుత్వానికి బాలికల ఆరోగ్యం పట్టదా? నెలసరి ఇబ్బందులతో రజస్వలానంతర సౌకర్యాలు లేక చాల మంది బాలికలు చదువుకు స్వస్తి చెబుతున్నారు. ఆ సమయంలో ఆరోగ్య పరిరక్షణ చాలా ముఖ్యం. "వాడే నీరులేక, టాయిలెట్లులేక, మరకలు కనిపిస్తాయనే బిడియంతో, సంకోచంతో మానేస్తున్నారు. ఆ సమయంలో అది శరీరంలో జరిగే సర్వ సాధారణ ప్రక్రియ. దానిని అసాధారణంగా వినకూడనిది, చూడకూడనిదిగా పరిగణించి మూఢనమ్మకంతో సమాజం మహిళలపట్ల ప్రవర్తించే తీరు అమానుషంగా వుంది.

నెలసరి వచ్చిన వారిని అంటరాని వారుగా చూడకూడదనే జ్ఞానం ఇప్పటికీ కలగడం లేదు. చెప్పుకోకూడని, చర్చించకూడని రహస్యంగా భావిస్తారు. నెలసరి వచ్చిన వారు ఎవరినీ ముట్టుకోవద్దని, కొత్తబట్ట తాకరాదని, వేసుకోకూడదని, జాడీలో నుండి పచ్చళ్లు తీయరాదని, స్పృశించరాదని వారు చెట్లకు నీళ్లు పడితే అవి మాడిపోతాయని, గుడిలోకి వెళ్లొద్దని, కొందరైతే తండ్రిని, అన్నని చూడరాదని, బీరువా తాళాలు ముట్టరాదని ఆంక్షలు విధించారు. పాటించేలా చేస్తున్నారు. శరీరంలో జరిగే సాధారణ ప్రక్రియకు ఇన్ని ఆంక్షలా?

12 శాతం మహిళలు మాత్రమే మన దేశంలో సురక్షితమైన ప్యాడ్స్ వాడుతున్నారు. కొందరు మహిళలు అనాగరికత వల్ల, ఆర్థిక లేమి వల్ల, బూడిద, ఆకులు, చెక్కపొట్టు, ఇసుక, కాగితాలు "వాడేసిన గుడ్డ పీలికలు ఉపయోగిస్తూ ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారని కొన్ని సర్వేలలో తెలిసినప్పుడు ఒళ్లు గగుర్పాటుకు గురి అవుతుంది. ఇరాన్‌లో 48 శాతం మహిళలు రుతు క్రమాన్ని అనారోగ్యం అనుకుంటారు.

మన దేశంలో 85 శాతం మంది మహిళలు అల్పాదాయ వర్గాలవారే, వారికి మార్కెట్‌లో దొరికే ప్యాడ్లను కొనగలిగే స్థోమత లేదు. "ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్" వారు 2016లో చేసిన పరిశోధనలో 84 శాతం అమ్మాయిలు, 92.2 శాతం తల్లులు ఇప్పటికీ నెలసరి సమయంలో గుడ్డని వాడుతున్నారని తేలింది. వారిలో కొందరు మాత్రమే దానిని ఎండలో ఆరపెడుతున్నారు. 37.8 శాతం పెళ్లికాని అమ్మాయిలు చర్మ వ్యాధులతో బాధపడుతున్నారు. స్త్రీలు ఇన్‌ఫెక్షన్లకు, సర్వైకల్ కేన్సర్‌కు గురి అవుతున్నారు. కారణం శుభ్రమైన గుడ్డను వాడకపోవడమే. 2011లో మన దేశంలో ఎంహెచ్‌ఎస్‌ని ప్రారంభించారు. కాని నిష్ఫలం. ఒకేఒకసారి "రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య" కార్యక్రమం కింద (ఆర్‌కెఎస్‌కె) గ్రామాలలో ప్యాడ్‌లు పంచారు. ప్యాకెట్టు విలువ రూ. 6/– అందులో ఆశావర్కర్‌కి రూపాయి వచ్చేదట. బాలికలు, మహిళలు ఉత్సాహంగా తీసుకున్నారట. ఒక్కసారితో ఇదీ ఖతం.



నెలసరి ప్యాడ్ బాలికలకు, మహిళలకు పేద, ధనిక భేదము లేకుండా వచ్చే సాధారణ తప్పని శారీరక క్రమంలో ఉపయోగపడే సాధనం. దీనిపై 12 శాతం ట్యాక్స్ వేసి ధనిక మహిళకు మాత్రమే అందుబాటులోకి తీసుకురావడంలోని ఆంతర్యం ఏమిటి? బేటీని ఎలా బచాయిస్తాం? బేటీ పడావో ఎలా సాధ్యం? మొన్నటికి మొన్న తమిళనాడులో మరకలు అంటినందుకు టీచర్ మందలించిందని ఒక బాలిక ఆత్మహత్య చేసుకుంది. నీళ్లు టాయిలెట్లు లేక బాలికలు స్కూల్ బంద్ చేస్తున్నారు. మరకల భయానికి ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. దేశ భద్రత బడ్జెట్‌లో కూడా మహిళ ఆరోగ్య రక్షణకు 2 శాతం కేటాయించాలి. ఇది దేశ మహిళా ఆత్మగౌరవం హక్కు అంతేకాని విలాసవంతమైన వస్తువు కాదు.

మహిళ ఆరోగ్యమే మహాభాగ్యం మానవ సౌభాగ్యం

నెలసరి ప్యాడ్ బాలికలకు, మహిళలకు పేద, ధనిక భేదము లేకుండా వచ్చే సాధారణ తప్పని శారీరక క్రమంలో ఉపయోగపడే సాధనం. దీనిపై 12 శాతం ట్యాక్స్ వేసి ధనిక మహిళకు మాత్రమే అందుబాటులోకి తీసుకురావడంలోని ఆంతర్యం ఏమిటి? బేటీని ఎలా బచాయిస్తాం? బేటీ పడావో ఎలా సాధ్యం? మొన్నటికి మొన్న తమిళనాడులో మరకలు అంటినందుకు టీచర్ మందలించిందని ఒక బాలిక ఆత్మహత్య చేసుకుంది. నీళ్లు టాయిలెట్లు లేక బాలికలు స్కూల్ బంద్ చేస్తున్నారు. మరకల భయానికి ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. దేశ భద్రత బడ్జెట్‌లో కూడా మహిళ ఆరోగ్య రక్షణకు 2 శాతం కేటాయించాలి. ఇది దేశ మహిళా ఆత్మగౌరవం హక్కు అంతేకాని విలాస వంతమైన వస్తువు కాదు.



చాలా చిన్న దేశాలు, ఆర్థిక సౌలభ్యం నామమాత్రమే అయినా స్కాటిష్ ప్రభుత్వం, కెన్యా, ఉగాండా, జాంబియా ప్రభుత్వాలు అమ్మాయిలకు ఉచితంగా ప్యాడ్స్ ఇస్తున్నాయి. ద.కొరియా, జపాన్, ఇండోనేషియాలో నెలసరి సందర్భంగా సిక్ లీవ్ చట్టాలున్నాయి.

2011లో తమిళనాడులో జయలలిత నాపికిన్ విప్లవం తీసుకు వచ్చారు. 10–19 సం॥ వయసు 41 లక్షల మంది అమ్మాయిలకు, 7 లక్షల మంది తల్లులకు ఖైదీ మహిళల శానిటరీ నాప్‌కిన్స్‌ను ఉచితంగా ఇచ్చారు. ఇప్పుడు కేరళ ప్రభుత్వం బడికి వెళ్లే అమ్మాయిలకు ఉచితంగా ప్యాడ్స్ ఇస్తున్నది. మహారాష్ట్ర, కర్నాటకలలో రూ. 5/– లకే సరఫరా. 1992 బీహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్ మహిళలకు రెండు రోజుల సెలవు అడగగానే ఇచ్చారు.

బాలికా సురక్ష ఎందుకోసం? బాలికల ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం చాలా ఉంది. ముఖ్యంగా భారతదేశంలో ఆడపిల్ల పట్ల ఉన్న చిన్నచూపు వల్ల బాలికలు విద్యావకాశాలు కోల్పోతున్నారు. వారికి వీలు అయిన సౌకర్యాలు ఎక్కువగా కల్పించాలి. సురక్షిత పథకాలతోనే మహిళా ప్రగతి సాధించవచ్చు. వారికి చదువు పట్ల శ్రద్ధాసక్తులు కల్పించాల్సిన అవసరం ప్రభుత్వాలకు ఉంది. బాల్య వివాహాలు, వరకట్నాల బారి నుండి కాపాడాలంటే వారికి చదువు – ఉద్యోగం ముఖ్యం. విద్యార్థి తల్లిదండ్రులకు కౌన్సెలింగులిచ్చి వారి చదువు – ఆరోగ్యం పట్ల అవగాహన పెంచాలి.

మొదలే ఆడపిల్లల పట్ల వివక్ష, దానికి వ్యతిరేకంగా నిరంతర యుద్ధమే జరుగుతున్నది. ఇప్పటికే బాలికలు రజస్వల అయ్యాక అనారోగ్య పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బడికి వెళ్లే 9–19 సం॥రాల బాలికలకు ఉచితంగా ప్యాడ్స్ ఇవ్వాలి. అందువల్ల బాలికలు స్కూల్‌కు క్రమం తప్పకుండా వస్తారు. మరకలు అంటుతాయనే భయం ఉండదు. భయం లేకుండా కూర్చోవడం, నడవడం చేస్తారు. మహిళలకు ప్యాడ్‌ను పన్ను లేకుండా ఇవ్వాలి. ఉద్యోగినులకు నెలసరి సమయంలో సిక్ లీవ్ ఇవ్వాలి.



గుండ్రాతి శారద గౌడ్
వ్యవస్థాపక అధ్యక్షులు
బహుజన జాగృతి
9848812024

ఏప్రిల్ 7న బోఫోర్స్ కేసును విచారించనున్న ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ: బోఫోర్స్ కుంభకోణానికి సంబంధించి తదుపరి విచారణకు అనుమతించాలన్న సిబిఐ అభ్యర్థనపై ఏప్రిల్ 7న విచారించాలని శనివారం ఢిల్లీ కోర్టు నిర్ణయించింది. బోఫోర్స్‌కు సంబంధించి సరైన పత్రాలు అందుబాటులో లేకపోవడం, పైగా సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండటంతో ఢిల్లీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఆశు గార్గ్ అప్పట్లో కేసు విచారణను వాయిదా వేశారు. మే 31,2005న బోఫోర్స్ కుంభకోణ నిందితులపై ఉన్న అన్ని ఆరోపణలను ఢిల్లీ హైకోర్టు రద్దు చేసింది. దీనిపై బిజెపినేత అజయ్ అగర్వాల్, సిబిఐ చేసిన అప్పీళ్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. తమ దగ్గర తాజా సమాచారం ఉందని, కేసు తదుపరి విచారణకు అనుమతించాలని ఫిబ్రవరి1న ట్రయల్ కోర్టును సిబిఐ అభ్యర్థించింది. ఆ తర్వాత అగర్వాల్ కూడా కేసును పునర్విచారించాలని ట్రయల్ కోర్టును కోరారు. రాజకీయంగా సున్నితమైన రూ.64 కోట్ల బోఫోర్స్ కుంభకోణం 1987లో సంచలనం సృష్టించింది. దేశంలో రాజకీయం దుమారానికి ఈ కుంభకోణం ఆరోపణలు దారితీశాయి. నేటికీ కాంగ్రెస్, బిజెపి పరస్పర ఆరోపణలు గుప్పించుకుంటూనే ఉన్నాయి.



వెబ్‌పోర్టల్‌లో వివరాలు నమోదు

మన తెలంగాణ/హైదరాబాద్ : పంటల బీమాలో నమోదైన విస్తీర్ణం, ప్రీమియం చెల్లించిన మొత్తం సరిగ్గా ఉండాలని ఏమైనా తప్పులు ఉంటే ఇప్పుడే సరి చేసుకోవాలని కేంద్రం ప్రభుత్వం బీమా కంపెనీలు, బ్యాంకులతో పాటు రాష్ట్రాన్ని అప్రమత్తం చేసింది. వానాకాలం, యాసంగి సీజన్లలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా కింద ప్రీమియం కట్టిన విస్తీర్ణం, రైతుల వివరాలను పంటల బీమా వెబ్ పోర్టల్‌లో ఖచ్చితంగా నమోదు చేయాలని చెప్పింది. వాస్తవానికి రైతుల నుంచి ప్రీమియం తీసుకున్న తరువాత వారంలోనే ఎప్పటికప్పుడు పంటల బీమా వెబ్‌సైట్‌లో అన్ని వివరాలను బ్యాంకులు నమోదు చేయాలనే నిబంధనలు ఉన్నాయి. ఇప్పటికీ పలు బ్యాంకులు ఈ విషయంలో ఆలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. నమోదు చేసిన వివరాల్లో ఏమైనా తేడాలు ఉంటే సరిచేయాలని లేదంటే పంట నష్టం వాటిల్లిన సమయంలో పరిహారం అందదని స్పష్టం చేసింది. మన రాష్ట్రంలో 2017 వానాకాలంలో 8.60 లక్షల మంది రైతులు, యాసంగిలో 1.60 లక్షల మంది రైతులు పంటల బీమాలో నమోదైనట్లు అధికారుల ద్వారా తెలిసింది. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. పంటల బీమా వెబ్ పోర్టల్‌లో బ్యాంకు బ్రాంచ్‌ల వారీగా బీమా ప్రీమియం కట్టిన రైతుల వివరాలను బ్యాంకర్లు నమోదు చేస్తున్నారు. ఇందుల్లో కొందరి రైతుల వివరాల్లో ప్రీమియం అధికంగా ఉండి, విస్తీర్ణం తక్కువగా ఉండటం, విస్తీర్ణం అధికంగా ఉండి ప్రీమియం తక్కువగా వేసినట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. అలాగే ఒక రైతు వివరాలపై ఇంకొక రైతు వివరాలను నమోదు చేయడం వంటివి జరిగాయి. పోర్టల్‌లో ఉన్న సమాచారం ఆధారంగానే నష్ట పరిహారం చెల్లించనున్నందున వివరాలు తప్పుగా ఉండరాదని వానాకాలం, యాసంగి పంటల బీమా చేసుకున్న రైతుల విస్తీర్ణం పక్కాగా చేయాలని పేర్కొంది. ఒకవేళ రైతుల దగ్గర నుంచి ఎక్కువ ప్రీమియం వసూలు చేసినట్లయితే తిరిగి రైతుల ఖాతాలకు మళ్లించాలని ఆదేశించింది. అయితే ఇప్పటి వరకు ఏ రైతు నుంచి ఎంత ప్రీమియం తీసుకున్నారనే వివరాల జాబితాలను బీమా కంపెనీలకు బ్యాంకులు ఇవ్వలేదని తెలిసింది.

సమస్యల పరిష్కారానికి వైద్య ఉద్యోగుల అల్టిమేటం

మన తెలంగాణ / హైదరాబాద్ : ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, రెగ్యులర్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోతే సమ్మెకు దిగాల్సి వస్తుందని పబ్లిక్ హెల్త్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్చరించింది. ఈ నెల 27వ తేదీలోగా సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే నిరవధిక సమ్మెకు దిగి సేవలను స్తంభింపజేస్తామని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొందుగుల వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న పారా మెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, వైద్యశాఖలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నియన్లు, స్టాఫ్ నర్సులు, అప్తాల్మిక్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలనే డిమాండ్లతో గత కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడం లేదన్నారు. దశలవారీగా చేపడుతున్న ఉద్యమాల్లో భాగంగా శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లా వైద్యాధికారుల కార్యాలయల ముందు ఆందోళనలు చేపట్టినట్లు చెప్పారు. యూనియన్ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించామని, ఎలాంటి ఫలితం లేకపోవడంతో ఈ నెల 7వ తేదీ నుంచి దశలవారీగా ఉద్యమాలు చేస్తున్నామని, త్వరలోనే నిరవధిక సమ్మెపై స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

పంచాయతీరాజ్ సచివాలయ శాఖకు ట్రెజరీ ఆంక్షల సడలింపు

మనతెలంగాణ/హైదరాబాద్: పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ సచివాలయానికి సంబంధించి స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులకు ట్రెజరీ ఆంక్షలను ప్రభుత్వం సడలించింది. మంజూరైన రూ.1,27,42,000 పరిపాలన అనుమతులు ఇచ్చారు. రూ.75,33,000 సంబంధించి జిఓ ఆర్‌టి నెంబర్ రూ.126, 52,09,000కు సంబంధించి, జిఓ ఆర్‌టి నెంబర్ 127లను ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ శనివారం చేశారు.

కాన్సెప్టే నాది

(మొదటిపేజీ తరువాయి)

రామ్‌గోపాల్ వర్మ మొబైల్, ల్యాప్ టాప్‌ను సీజ్ చేశారు. విచారణకు తిరిగి శుక్రవారం రావాలంటూ పోలీసులు ఆదేశించారు. 'జిఎస్‌టి' సినిమాను తాను తీయలేదని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ చెప్పారని సైబర్ క్రైమ్ అదనపు డిసిపి రఘువీర్ తెలిపారు. వర్మను విచారించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..జిఎస్‌టి సినిమాతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కేవలం కాన్సెప్ట్ మాత్రమే తనదని వర్మ చెప్పారని తెలిపారు. కాన్సెప్ట్‌ను మాత్రమే తాను అమ్మానని వెల్లడించారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించి చాలా టెక్నికల్ ఎవిడెన్స్‌ను సేకరించాల్సి ఉందన్నారు. అన్ని వైపుల నుంచి ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తామని తెలిపారు. 'సత్యమేవ జయతే'ను 'సత్య మియా జయతే' అంటూ వర్మ ట్వీట్ చేసిన అంశాన్ని కూడా ఈ కేసులోనే చేరుస్తామని చెప్పారు. నగ్నంగా ఉన్న మాల్కోవాతో వర్మ ఉన్న ఫోటోలను ఆయన ఫోన్, ల్యాప్ టాప్ నుంచి డౌన్‌లోడ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతామన్నారు. దీనిపై నివేదిక వచ్చిన తర్వాత, ఈ ఫోటోలన్నీ ఎలా వచ్చాయి, ఎందుకు తీశారు, అనే విషయాలను తదుపరి విచారణలో ప్రశ్నిస్తామని రఘువీర్ తెలిపారు. సినిమాను ఎక్కడ తీసినా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. భారతీయ పౌరుడు విదేశాల్లో తప్పు చేసినా, ఇక్కడ శిక్షించవచ్చని తెలిపారు. సినిమా షూటింగ్‌లో వర్మ నిమగ్నమయ్యారా లేదా అనే విషయాన్ని తేల్చాల్సి ఉందని చెప్పారు. స్కైప్ ద్వారా తాను డైరెక్ట్ చేశానని ఆ సినిమా అశ్లీల చిత్రం కాదని, ఒక ఆర్ట్ ఫిల్మ్ అని వర్మ చెబుతున్నారని, అయితే ఆయన చెప్పే విషయాలను తాము పట్టించుకోబోమని ఆయన స్పష్టం చేశారు. ఇది సాధారణ కేసు కాదని, ఈ కేసును ఆషామాషీగా విచారించలేమని, టెక్నికల్‌గా చాలా ఆధారాలను సేకరించాల్సి ఉందన్నారు. ఒకవేళ వర్మ దోషిగా తేలితే రెండేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉదని తెలిపారు. విచారణకు వర్మ పూర్తిగా సహకరించారని తెలిపారు. ఆయనను అరెస్టు చేసే అంశానికి సంబంధించి ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. కోర్టులో ప్రవేశపెట్టేందుకు అవసరమైన ఆధారాలను సేకరించిన తర్వాతే అరెస్టుపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో వర్మ అనేక లింక్స్ పెట్టారని చెబుతున్నారని, ఈ లింక్స్‌ను పరిశీలిస్తామని, లింక్స్ అందుకున్న వారి నుంచి సమాచారం సేకరిస్తామని,ఆ లింక్స్ వర్మ పేజి నుంచి వెళ్లాయో లేదో పరిశీలిస్తామన్నారు. ఈ ఆధారాలు కేసు దర్యాప్తులో కీలకంగా మారుతాయని తెలిపారు.

సీరియస్‌గా తీసుకోవాలి: ఇది తాను మాత్రమే వేసిన కేసు కాదు. మహిళా సంఘాలు వేసిన కేసు. ఇది మహిళల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం, ఈ కేసును సీరియస్‌గా తీసుకోవాలని పోలీసులను కోరాము. నేరం జరిగిందని విచారణలో తేలితే ఆ నేరం ఏ స్థాయిలో జరిగితే అందుకు తగ్గ శిక్ష పడేలా చేస్తామని పోలీసులు తమకు హామీ ఇచ్చారు. డబ్బున్న వారు పవర్‌ఫుల్ లాయర్లను పెట్టుకుంటారని, చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుంటారు.శిక్ష పడుతుందా లేదా అనేది చెప్పలేము, అయితే పోలీసుల మీద తమకు నమ్మకం ఉంది.

డబుల్ కిక్కు

- అంచనాలకు మించి మద్యం అమ్మకాలు
- ఈ ఏడాది లక్ష్యానికి రెట్టింపు ఆదాయం

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది లక్ష్యాన్ని మించి ఎక్సయిజ్ విభాగం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుంది. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే సంవత్సరం లక్ష్యాన్ని సాధించింది. సంవత్సరం మొత్తానికి తొమ్మిదివేల కోట్ల రూపాయల మేర ఎక్సయిజ్ ఆదాయాన్ని సమకూర్చుకోవాలని బడ్జెట్‌లో అంచనా వేసుకోగా పదిన్నర నెలల కాలానికి రూ. 15,092 కోట్ల మేర ఆర్జించింది. మరో నెలన్నర రోజుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున సుమారు రూ. 2000 కోట్ల మేర ఆదాయం వస్తుందని ఎక్సయిజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది మొత్తం ఎక్సయిజ్ ఆదాయం రూ. 14,184 కోట్లు కాగా పదిన్నర నెలల కాలానికి రూ. 13,512 కోట్ల మేర సమకూరింది. గతేడాదితో పోలిస్తే మద్యం ధరల్లో పెద్దగా మార్పు లేకపోయినప్పటికీ ఈ సంవత్సరం మాత్రం ఆదాయం గణనీయంగా పెరిగింది. జిఎస్‌టి ద్వారా పన్ను ఆదాయం తగ్గిందన్న ఆందోళనను ఎక్సయిజ్ ఆదాయం ఒక మేరకు భర్తీ చేయగలిగినట్లయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు (ఫిబ్రవరి 15) రాష్ట్రవ్యాప్తంగా 2.66 కోట్ల కేసుల (23.05 కోట్ల లీటర్లు) మద్యం (ఐఎంఎఫ్ఎల్), 3.70 కోట్ల కార్టన్ల బీర్ (28.92 కోట్ల లీటర్లు) వినియోగం జరిగినట్లు ఎక్సయిజ్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాది మొత్తం పన్నెండు నెలల కాలానికి 2.71 కోట్ల కేసుల మద్యం, 3.36 కోట్ల కార్టన్ల బీర్ వినియోగం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా అక్టోబర్ నెలలో రూ. 1779.28 కోట్ల మేరకు, డిసెంబరు నెలలో రూ. 1644.62 కోట్ల మేరకు ఆదాయం సమకూరింది. గతేడాది సైతం ఇదే రెండు నెలల్లో గరిష్ట స్థాయిలో అమ్మకాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ప్రతి నెలా మద్యం, బీర్ విక్రయాలు పెరిగాయి. మద్యం దుకాణాలు గరిష్ట చిల్లర ధరకంటే ఎక్కువకు విక్రయించకుండా ఎక్సయిజ్ విభాగం ఈసారి ప్రత్యేక చర్యలు చేపట్టింది. మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చి ఆయా బ్రాండ్ల ధరలను వినియోగదారులకు తెలియజేయడంతో పాటు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లయితే మొబైల్ ద్వారానే ఫిర్యాదు చేసే నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రతి దుకాణంలో ధరల పట్టికను ప్రదర్శించేలా నిబంధనలు రూపొందించింది. దీంతో మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం అడ్డదార్లు తొక్కకుండా పూర్తిగా ప్రభుత్వానికే సమకూరేలా ఈ విభాగం వ్యవహరించింది.



రాష్ట్ర పథకాలను మెచ్చుకోవడం లేదు

- బహిరంగ చర్చకు సిద్ధమా? : బిజెపి

మన తెలంగాణ/హైదరాబాద్: ఇప్పటి వరకు టిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు బేషుగ్గా ఉన్నాయని కేంద్ర మంత్రులు స్వయంగా వెల్లడించలేదని, ఈ అంశంపై బహిరంగ చర్చ కోసం టిఆర్ఎస్‌కు రాష్ట్ర బిజెపి సవాలు విసిరింది. సిద్ధంగా ఉన్నామని టిఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. నిధుల వినియోగంపై కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే వారు రాష్ట్ర పథకాలను ప్రశంసిస్తున్నట్టుగా రాష్ట్ర మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బిజెపి అధికార ప్రతినిధులు డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి, ఎన్.వి. సుభాష్ ఆరోపించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూరేషన్‌కార్డుల అంశంలో కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ప్రధాని నరేంద్రమోడి బొమ్మను పెట్టాల్సి వస్తుందనే దురుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులను ముద్రించకుండా చిట్టీలతోనే రేషన్ ప్రక్రియను నిర్వహిస్తోందని విమర్శించారు. బిజెపిపై కాంగ్రెస్ నేత పొన్నాం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రి నిధుల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విషయాన్ని వారు గుర్తు చేశారు.

26 నుంచి కాంగ్రెస్ బస్సు యాత్ర

- చేవేళ్ళ నుంచి ప్రారంభం
- మే 15 నుండి భట్టి, రేవంత్, పొన్నంల పాదయాత్ర
- జూన్ 1న భారీ బహిరంగ సభ, రాహుల్ రాక

మన తెలంగాణ/ హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బస్సు యాత్ర ఈ నెల 26వ తేదీ నుంచి మొదటి విడత యాత్రను ప్రారంభించనున్నట్టు టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. గాంధీభవన్‌లో శనివారం నాడు ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రతిపక్ష నేతలు కుందూరు జానారెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ, పిఎసి చైర్మన్ డాక్టర్ జె.గీతారెడ్డి, పిసిసి మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్యతోపాటు పిసిసి ఉపాధ్యక్షులు, డిసిసి అధ్యక్షులు పాల్గొన్నారు. సమావేశంలో బస్సు యాత్ర, వివిధ రాజకీయ అంశాలను చర్చించారు. అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటన చేస్తూ ఈ నెల 26న రంగారెడ్డి చేవేళ్ళలో బస్సు యాత్రను ప్రారంభిస్తామని, మధ్యాహ్నం ఒంటి గంటకు యాత్ర ప్రారంభమవుతుందని, అక్కడ పూర్తి కాగానే అదే రోజు 4 గంటలకు వికారాబాద్‌లో, 27న తాండూరులో ఒంటి గంటకు, 27న 4 గంటలకు సంగారెడ్డిలో 28న 1 గంటకు జహీరాబాద్‌లో 28న 4 గంటలకు నారాయణ ఖేడ్‌లో ఈ బస్సు యాత్ర సభలు జరుగుతాయని ఆయన వివరించారు.కాగా మార్చి 1 నుంచి 3 వ తేదీ వరకు హోళీ పండుగ కారణంగా బస్సు యాత్ర ఉండదని తిరిగి 4 వ తేదీ నుంచి 11 వ తేదీ నుంచి యాత్ర కొనసాగుతుందని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వరకు ఈ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. బడ్జెట్ సమావేశాల తరువాత తిరిగి ఏప్రిల్ 1వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు రెండో విడత బస్సు యాత్ర కొనసాగుతుందని ఆయన వివరించారు. రాష్ట్రంలో 119 నియోజకవర్గాలలో బస్సు యాత్ర నిర్వహిస్తామని వివరించారు. బస్సు యాత్ర ముగిసిన వెంటనే మే 15 నుండి టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి ఉపాధ్యక్షులు పొన్నం ప్రభాకర్, ఎంఎల్‌ఎ ఎ.రేవంత్ రెడ్డిలు వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్రలు నిర్వహిస్తారని ఉత్తమ్ వెల్లడించారు. అలాగే ఎఐసిసి కార్యదర్శి వి.హనుమంతరావు రాష్ట్రంలో రథ యాత్ర చేపడుతారని చెప్పారు. కాగా ఈ యాత్రలు ముగింపును పురస్కరించుకొని జూన్ ఒకటవ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ లేదా హైదరాబాద్‌లలో ఏదో ఒక చోట భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఎఐసిసి అధ్యక్షులు రాహుల్ గాంధీ హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే బస్సు యాత్రతో జూన్ 1వ తేదీ జరిగే బహిరంగ సభతో ఈ కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. దాదాపు మూడు నెలల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన వివరించారు.



యాదాద్రి బ్రహ్మోత్సవాలు షురూ

(మొదటిపేజీ తరువాయి)

రోజులపాటు శ్రీవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా జరగనున్నాయి. తొలి రోజున శాస్త్రానుసారం బాలాలయ నిలయంలో ప్రత్యేక పూజలను అర్చకులు ఉదయం నిర్వహించి ఉత్సవ ప్రారంభ పూజలైన స్వస్తివచనం, రక్షబంధనం పూజలను నిర్వహించారు. లోకకల్యాణార్థం జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలో ఎటువంటి అంతరాయం కలగకుండా భక్తకోటిని శ్రీనారసింహుడు అనుగ్రహించేందుకు ఉత్సవ వేడుకలు వైభవంగా జరగాలని కోరుతూ స్వచ్ఛమైన మట్టి పాత్రలో గోమూత్ర మంత్రజలాలను తీసుకొని వేదమంత్రాలు ఉచ్ఛరిస్తూ ఆలయం, ఆవరణ ప్రాంతాలలో మంత్రజలాలను చల్లి శుద్ధి చేశారు. శ్రీవారి ఉత్సవాల దీక్షకు సూచికగా రక్షాబంధన పూజలను అర్చకులు నిర్వహించి బ్రహ్మోత్స విశిష్టతను తెలియచేశారు. సాయంకాలం ఆలయంలో నిత్య ఆరాధన, అర్చన గావించి ఉత్సవ సంబంధమైన వృతం సంగ్రహణము అకుంరారోపణం పూజలను నిర్వహించారు. ఆగమ శాస్త్రనుసారము శ్రీవారి బ్రహ్మోత్సవాలను వేదపండితులు, యాజ్ఞికులు, అర్చకులు నల్లదీగల్ లక్ష్మి నరసింహాచార్యులు, తాండూరి వెంకటచార్యులు, కారంపోడి లక్ష్మి నరసింహ్మాచార్యులు అర్చకుల బృందం మంత్రోచ్ఛన చేయగా పారాయణికులు పారాయణములు గావించారు. ఈ బ్రహ్మోత్సవ ప్రారంభ వేడుకల్లో కలెక్టర్ అనితారామచంద్రన్, రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్, ఆలయ చైర్మన్ నర్సింహ్మామూర్తి, ఇఒ గీత, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మహేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ బూడిది స్వామి, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణము : శ్రీవారి బ్రహ్మోత్సవాలలో రెండవ రోజు ఆలయంలో ధ్వజారోహణము,భైరిపూజ వేడుకలు జరగనున్నాయి. ఈ ఉత్సవ వేడుకలకు ముకోటి దేవతలను ఆహ్వానిస్తు సాగే ఈ మహోత్సవం ఏంతో విషిష్టతను కలిగి ఉన్నట్లు అర్చకులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు శూన్యం: తెలంగాణ మహాక్షేత్రముగా యాదాద్రి అభివృద్ధి కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్న ప్రభుత్వం శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు కనీస ఏర్పాటు చేయకపోవడం భక్తుల,స్థానిక ప్రజల మనోభాలు కొల్పోయే విధంగా ఉన్నయని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. గతంలో ఎన్నడు లేనివిదంగా శ్రీలక్ష్మి నరసింహుని ఉత్సవాలు దేవస్థానము నిర్వహించడం బాదకరంగా ఉందని, ఆలయాని, పరసరప్రాంతాలకు రంగులు వేయకుండా,విద్యుత్ అలకారణ చేయకుండా, చలవ పందిలు వేయక పోవడేకాక, భక్తులకు ఉత్సవాలను తెలుపే ఎటువంటి ప్రచార పోస్టన్లు, మైక్‌సౌండ్ లేకుండ తొలిసారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయని ఇప్పటికైన వెంటనే ప్రభుత్వం, దేవస్థానము అధికారులు స్పందిచి వెంటనే ఉత్సవ ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాల శోభ నిలపెటాలని నాయకులు బీర్ల అయిలయ్య,గుండ్లపల్లి భరత్, శ్రీదర్,బాలరాజు,మల్లెశం, గుజ్జ శ్రీను,శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్తి భద్రత : శ్రీ లక్ష్మి నరసింహుని స్వామి బ్రహ్మోత్సవాలకు భద్రత పరమైన పూర్తి ఏర్పాట్లు చేపడుతామని రాచకొండ కమీషనర్ మహేశ్‌భగవత్ అన్నారు. శనివారం రోజున స్వామి వారి బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవానికి పాల్గొన్న ఆయన స్వామి వారిని దర్శించుకొని ఉత్సవ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ముఖ్యమంత్రి కేసిఆర్ ఆదేశాల మేరకు యాదాద్రి అభివృద్ధిలో భాగంగా పూర్తి స్థాయి పోలిసు శాఖలోని అన్ని విభాగాలకు సంబంధించిన పోలిసు వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతదని ట్రాఫిక్, మహిళ క్రైమ్, అగ్నిమాపకం పలు శాఖల పోలిసు స్టేషన్‌లు ఏర్పడుతాయని తెలిపారు. పోలిసు శాఖ క్వార్టర్స్ కోసం యాదాద్రి పరిధిలో కేటాయించినటువంటి 50 ఎకరాల భూమిని స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. ఆయన వెంట జయింట్ కలెక్టర్ రవీంద్రనాయక్, డిసిపి, ఎసిపి, సిఐలు తదితరులు పాల్గొన్నారు.

నీరవ్‌పై నోరు విప్పాలి

(మొదటిపేజీ తరువాయి)

నేతలతో కలిసి రాహుల్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాహుల్ ప్రధానిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. భారీ స్థాయి కుంభకోణం జరగడం, నిందితుడు దేశం విడిచిపెట్టి పోవడం వంటివి జరుగుతున్నా ప్రధాని మోడీ ఏం చేస్తున్నారని, ఈ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు అని రాహుల్ ప్రశ్నించారు. అనేక స్థాయిల్లో దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే విధంగా ఘటనలు జరుగుతున్నాయని, అయితే కేంద్రం బాధ్యత తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని రాహుల్ విమర్శించారు. ప్రధాని మోడీ దేశ ఆర్థిక వ్యవస్థను తమ అనాలోచిత చేష్టలతో నాశనం చేస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. నీరవ్ మోడీ బ్యాంకులను ఏ విధంగా మోసగించగలిగారు? దేశం వదిలి ఏ విధంగా తప్పించుకు వెళ్లారు? వంటి విషయాలకు ప్రధాని మోడీ సమాధానం చెప్పాల్సిందేనని రాహుల్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అదేపనిగా అక్రమాలను కప్పిపుచ్చే యత్నాలకు దిగుతోందని, తప్పిదాలకు బాధ్యత తీసుకోవడం లేదని రాహుల్ చెప్పారు. నీరవ్ మోడీతో తనకు వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలను రాహుల్ ఖండించారు. పాత నోట్ల రద్దు, జిఎస్‌టి వంటివి ఉదాహరణలు అని తెలిపారు. పాత 500, వేయి రూపాయల నోట్లను రద్దు చేసిన మోడీ , ఈ విధంగా ప్రజాధనాన్ని బ్యాంకింగ్ వ్యవస్థలోకి చేర్చారని, అయితే ఈ ప్రజాధనం అంతా చివరికి బడా వ్యాపారవేత్తల చేతుల్లోకి వెళ్లిందని, ఇప్పుడు ఏకంగా రూ 20,000 కోట్ల ప్రజాధనాన్ని నీరవ్ మోడీ దోచుకు తిన్నారని, దీనికి ప్రధాని మోడీ వంతపాడారనే అనుమానాలు ఉన్నాయని రాహుల్ చెప్పారు. జరిగిన పిఎన్‌బి స్కామ్‌పై సంబంధం లేని మంత్రులు విలేకరుల సమావేశాలు పెట్టి వివరణలు ఇస్తున్నారని, అయితే బాధ్యులైన ప్రధాని కానీ, బాధ్యత వహించాల్సిన ఆర్థిక మంత్రి కానీ దీనిపై పెదవి విప్పడం లేదని రాహుల్ విమర్శించారు.

అందింది సగమే

(మొదటిపేజీ తరువాయి)

మార్క్‌ఫెడ్, హాకాల ద్వారా 75,300 టన్నులు కొనుగోలుచేసింది. మద్దతు ధర ప్రకారం రూ. 410.39 కోట్లు చెల్లించాల్సి ఉండగా నాఫెడ్ నుంచి ఇప్పటి వరకు రూ.226.53 కోట్లు మాత్ర మే చెల్లించింది. ఇంకా రూ. 183.86 కోట్లు అందాల్సి ఉంది. మిగతా లక్ష టన్నులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 545 కోట్లు రైతులకు చెల్లించా ల్సి ఉంది. మార్క్‌ఫెడ్, హాకాలకు ప్రభుత్వ గ్యా రంటీ ద్వారా మొత్తంగా రూ. 600 కోట్లు రుణం తీసుకోవాలని సూచించింది. అయితే ఇంతవరకు రుణం మంజూరు కాలేదు. అత్యంత వేగం గా పనిచేయాల్సిన అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తుండటంతోనే ఇలా జరుగుతుందనే విమర్శలు వస్తున్నాయి.

ప్రతిరూపం టిహబ్


(మొదటిపేజీ తరువాయి)

ఊతమిచ్చేలా తెలంగాణ ప్రభుత్వం టిహబ్, టివర్క్స్ కార్యక్రమాలను ప్రారంభించిందని పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి కె.తారకరామారావు వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధికి యువశక్తి కీలకమని అన్నారు. అత్యుత్తమ పరిపాలనా ప్రమాణాలు, వినూత్న విధానాలతో తెలంగాణలో పరిపాలన జరుగుతోందని, మరింత వేగంగా దేశాభివృద్ధి జరగాలంటే ప్రభుత్వాలు ప్రైవేటు సంస్థల్లాగా ఆలోచించి తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని అన్నారు. ప్రైవేటు సంస్థలు ప్రభుత్వాల తరహాలో సమాజం కోసం పనిచేయాలని సూచించారు. మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు చెన్నైలో శనివారం జరిగిన సంస్థ 2018 వార్షిక ముగింపు సమావేశానికి మంత్రి కెటిఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'లెర్నింగ్ టు గ్రో' అనే అంశంపై జరిగిన సదస్సులో మంత్రి కెటిఆర్ తెలంగాణ అనుభవాలను, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. గడిచిన మూడు సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్ర ఎదుగుదల, ప్రభుత్వ పాలసీలు, సాధించిన విజయాలు, ఇలా అనేక అంశాలను సదస్సులో తెలియజేస్తూ తెలంగాణను 'స్టార్ట్ అప్ స్టేట్'గా అభివర్ణించారు. తెలంగాణ ప్రభుత్వ విధానాలు, పథకాల పట్ల కేంద్ర ప్రభుత్వం, పలు రాష్ట్రాలు ఆసక్తి కనబరుస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ఫైబర్‌గ్రిడ్ ద్వారా ప్రతి ఇంటికీ ఇంటర్‌నెట్ అందిస్తామని, తద్వారా విద్యా, వైద్యం, గవర్నెన్స్ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు తెలంగాణ రాష్ట్రం వేదికగా కాబోతుందని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు సుమారు 6000లకు పైగా సంస్థలు టిఎస్‌ఐపాస్ ద్వారా అనుమతులు పొందాయన్నారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తెలంగాణ ఉన్నదని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని వివరించారు.

తెల్లని దగా!

(మొదటిపేజీ తరువాయి)

తీసుకునేందుకు అడుగులు వేస్తోంది. ఇటువంటి విత్తనాన్ని రైతులకు ఇవ్వడం నష్టమని, అలాగే అనధికారికంగా సాగులోకి తెస్తున్న బిజి-3 విత్తనంపై కూడా చర్యలు తీసకోవాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది.పత్తి విత్తన ధర ప్రతిపాదనల్లో డీలర్ మార్జిన్, కంపెనీ మార్జిన్ 23 శాతంగా ఉంది. ప్రతి పాదిత రూ. 950 ధరలో డీలర్ మార్జిన్ రూ. 100, కంపెనీ మార్జిన్ రూ.230గా ఉండటం గమనార్హం. బహిరంగ మార్కెట్‌లో ఏ కంపెనీ ఉత్పత్తికి కూడా ఈ స్థాయిలో మార్జిన్ లేదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇక రాయల్టీ ప్రభుత్వ వర్గాలే నిర్ణయించాలని పేర్కొన్నారు. వాస్తవానికి మోన్‌శాంటోకు చెందిన బిజి-1, బిజి- 2 పత్తి విత్తనాలకు వేటికీ పేటెంట్ లేదు. వీటిపై అక్రమంగా వందల కోట్ల రాయల్టీ వసూలు చేస్తున్నారు. ఒకవేళ పేటెంట్ హక్కులు ఉన్నాయనుకున్నా.. పదేళ్ల తర్వాత అవి రద్దవుతాయి. కానీ అవి వచ్చి 15 ఏళ్లు నిండాయి. ఇంకా ఎందుకు రాయల్టీ వసూలు చేస్తున్నారు? దీనికి ప్రభుత్వాలు ఎందుకు అంగీకరిస్తున్నాయన్నదే ప్రశ్నగా మారిందని రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి.



ఈసారి పత్తి వేయకపోవడమే మేలు: దొంతి నర్సింహా రెడ్డి, జాతీయ వ్యవసాయ నిపుణులు

బిజి-1, బిజి-2 గులాబీ రంగును తట్టుకునే శక్తిని కోల్పోయాయి. అయినా వాటినే మళ్లీ అంటగట్టాలని కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. బిజి-3పై స్పష్టత లేదు. రానున్న వానాకాలం సీజన్‌లో రైతులు పత్తి సాగు చేయకపోవడమే శ్రేయస్కారం. పసలేని విత్తనాలను అసలు అనుమతించొద్దు. అలాంటిది అధిక ధరలు ప్రతిపాదించారు. కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

చెంప చెళ్లు

(మొదటిపేజీ తరువాయి)

నలుగురు మహిళలను బొల్లారం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి శనివారం బొల్లారం పోలీసు స్టేషన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నిందితుల వివరాలను బేగంపేట ఎసిపి రంగారావు వెల్లడిస్తున్న క్రమంలో వారి వెనకాల ఉన్న ఓ మహిళా నిందితురాలు ఏదో మీడియాకు చెప్పబోయారు. దీంతో ఆగ్రహించిన ఎసిపి రంగారావు ఆమె చెంప చెల్లుమనిపించాడు. అక్కడే ఉన్న మీడియా ఈ దృశ్యాలను చిత్రీకరించడంతో సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్‌గా మారింది. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూ ఉన్నతాధికారులు ఒక పక్క బుకాయిస్తున్నా మహిళా నిందితురాలిపై అందరి సమక్షంలో ఎసిపి చేయి చేసుకోవడం పలు విమర్శలకు దారితీసింది. ఈ ఘటనపై కమిషనర్ విచారణకు ఆదేశించారు.

ఎసిపిపై బదిలీ వేటు :

మహిళా నిందితురాలి చెంప చెల్లుమనిపించిన బేగంపేటఎసిపి రంగారావుపై బదిలీ వేటు పడింది. రాంగారావును సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న కెసిఆర్: లక్ష్మణ్

మన తెలంగాణ/జనగామ ప్రతినిధి : ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా. కె.లక్ష్మణ్ విమర్శించారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో బిజెపి జిల్లా పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఎందరో అమరులయ్యారని, వారి త్యాగఫలమే తెలంగాణ అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని వ్యతిరేకించిన వారే ఇప్పుడు ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉంటూ తెలంగాణ ద్రోహులుగా మారారన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఈ ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉన్నారని, అభివృద్ధి ముసుగులో ప్రజలను మోసం చేస్తున్న ఘనత కెసిఆర్‌దేనని అన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, గిరిజనులకు ప్రత్యేక గ్రామపంచాయతీలు ఏర్పాటు చేయడం, 6 శాతం రిజర్వేషన్ల నుంచి, 10 శాతానికి పెంచుతామని చెప్పి దళితులను విస్మరించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రశ్నించే గొంతికను నొక్కి వేసే విధంగా ఉద్యమాలు చేపడితే 144 సెక్షన్ విధించి ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తున్నారని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బిజెపి జనగాం జిల్లా అధ్యక్షుడు కెవిఎల్‌ఎన్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి అంజన్‌కుమార్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సరికొండ విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 73 మందికి జైలు

మన తెలంగాణ/హైదరాబాద్: నగర పోలీసులు ఈ నెల 12తేదీ నుంచి16 తేదీ వరకు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన 591 మందిలో 73 మందికి జైలు శిక్ష పడిందని ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ డాక్టర్ రవిందర్ వెల్లడించారు. శిక్షపడిన వారిలో ఇద్దరికి ఏడు రోజులు, నలుగురికి ఐదు రోజులు, ఇద్దరికి నాలుగు, 17 మందికి మూడు, 48 మందికి రెండు రోజుల చొప్పున శిక్ష పడిందన్నారు. ఇక మరో పది మంది డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు. వీరిలో ఒకరికి రెండేళ్ల వరకు, ఏడుగురికి ఏడాది పాటు ఇద్దరికి ఆరు నెలల పాటు వారి డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేశారన్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్ పోలీసులు మందుబాబులకు వణుకు పుట్టించారు. శనివారం తెల్లవారుజామున నుంచి పలు చోట్ల వరుసగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, డైమండ్ హౌస్, రోడ్ నెంబర్ 45లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో చెక్‌పోస్టు వద్ద ఎనిమిది కార్లు, నాలుగు బైక్‌లను సీజ్ చేశారు. పరిమితికి మించి మద్యం సేవించిన ఇద్దరు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో మహిళ పోలీసుల కన్ను కప్పి పారిపోయేందుకు ప్రయత్నం చేయగా పోలీసులు చేజ్ చేసి మరీ పట్టుకున్నారు. మద్యం మత్తులో మరికొంత మంది పోలీసులపై చిందులేశారు. మరికొంత మంది గుట్టు చప్పుడు కాకుండా పారిపోవడానికి యత్నించారు.

అమెజాన్ గోడౌన్‌పై అధికారుల దాడి



మన తెలంగాణ/హైదరాబాద్/ కార్వాన్ : టోలిచౌకిలోని అమెజాన్ గోడౌన్‌పై తూనికలు, కొలతల శాఖ అధికారులు శనివారం దాడి నిర్వహించారు. అమెజాన్ గోడౌన్‌లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుతో తూనికలు, కొలతల శాఖ హైదరాబాద్ అసిస్టెంట్ కంట్రోలర్ భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు కె.విజయసారథి, అనిల్‌కుమార్, సంజయ్‌కృష్ణ, అనురాధ, శ్రీవల్లి సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ప్యాకింగ్‌లపై స్టిక్కర్లు అతికించి ఎంఆర్‌పి, ప్యాకింగ్ తేదీలు మార్చడం, ఎలక్ట్రికల్, గృహ, వంటింటి తదితర సామగ్రి దిగుమతిలో, జిఎస్‌టి చెల్లింపుల్లో గోల్‌మాల్‌కు పాల్పడినట్లు అధికారులు గుర్తించి 16 కేసులు నమోదు చేశారు. ప్యాకింగ్‌లపై స్టిక్కర్లు అతికించి ఎంఆర్‌పి రేట్లను, ప్యాకింగ్ తేదీలు మార్చిన వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

మన తెలంగాణ/జవహర్‌నగర్ : నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిజెఆర్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి జవహర్ నగర్ ఇన్‌స్పెక్టర్ వివి. చలపతి తెలిపిన వివరాల ప్రకారం జవహర్‌నగర్‌లోని బిజెఆర్‌నగర్‌లో నివసించే ఎర్లపల్లి భాస్కర్ తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇంటి సమీపంలో నివసిస్తూ పెయింటర్‌గా పని చేస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన క్రిష్ణయాదవ్ (18) శనివారం ఉదయం నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించాడు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ చలపతి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

మనతెలంగాణ/దండేపల్లి : న్యాయం చేయాలని కోరుతూ ప్రియురాలు ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన వైనం ఇది.ప్రియురాలు మౌనిక తల్లి దండ్రులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గుడిరేవు గ్రామానికి చెందిన తూరుపాటి మౌనిక అదే గ్రామానికి చెందిన జంగిలి శ్రావణ్‌లు సంవత్సర కాలం నుండి ప్రేమించుకున్నారు. పెండ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి మౌనికను గర్భవతిని చేశాడు. తాను గర్భం దాల్చానని మౌనిక ప్రియుడికి చెప్పడంతో తనకు సంబంధం లేదని దాట వేశాడు. అబార్షన్ చేయిస్తానని ఆమెపై ఒత్తిడి తెచ్చాడు. న్యాయం చేయాలని మౌనిక తల్లిదండ్రులతో ప్రియుడు శ్రావణ్ ఇంటి ఎదుట శనివారం బైఠాయించింది. దీనిని గమనించిన శ్రావణ్‌తో పాటు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి, పారిపోయారు.


ఆర్‌టిసి కార్మికులకు వేతన సవరణ చేయాలి : ఇయు



మన తెలంగాణ / హైదరాబాద్: ఆర్‌టిసి కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని, నూతన వేతన సవరణను చేపట్టాలని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్. బాబు, ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి సంస్థ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని వారు అన్నారు. యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన ఎంప్లాయీస్ యూనియన్ హైదరాబాద్ జోనల్ మహాసభలో వారు ప్రసంగించారు. కేంద్ర చేపడుతున్న మోటారు వాహనాల సవరణ బిల్లుతో ఆర్‌టిసిలు నిర్వీర్యమైపోతాయని, ముఖ్యంగా డ్రైవర్ల విధుల నిర్వహణ క్లిష్టమవుతుందని ఎస్.బాబు అన్నారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కె.రాజిరెడ్డి మాట్లాడుతూ సకల జనుల సమ్మె కాలానికి వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని కోరారు. ఎంప్లాయీస్ యూనియన్ హైదరాబాద్ జోనల్ అధ్యక్షులుగా వి.మురళీధర్, కార్యదర్శిగా ఎస్.సాయిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులు రవి మృతి

నిందితులను కఠినంగా శిక్షించాలని రోడ్డుపై బిజెపి ధర్నా



మన తెలంగాణ/ కుల్కచర్ల (వికారాబాద్ జిల్లా) : అనుమానస్పదంగా బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులు రవి మృతిచెందిన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. గుడాల రవికుమార్ ముదిరాజ్ (28) కామునిపల్లి దగ్గరలో తీవ్రరక్తగాయాలతో పడి రక్తపు మడుగులో ఉన్న విషయాన్ని స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. లారీ వాహనదారుల చేతిలో హత్యకు గురై ఉండవచ్చని పలువురు పేర్కొంటున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణను ప్రారంభించారు. ఎస్‌ఐ చంద్రకాంత్, పరిగి ఎస్‌ఐ కృష్ణల ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది. కాగా, నిందితులను కఠినంగా శిక్షించాలంటూ బిజెపి శ్రేణులు శనివారం ధర్నా నిర్వహించాయి.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం







ఉప్పల్ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హోం మంత్రి నాయిని

మన తెలంగాణ/ఉప్పల్ : ప్రతి విద్యార్థి ఇంటి పరిసరాలను, విద్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతి ఒక్కరూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొని దేశ భవిష్యత్తుకు పట్టుగొమ్మలుగా ఎదగాలని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. బల్దియా కమిషనర్ జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన స్వచ్ఛ సర్వేక్షణ్ 2018లో భాగంగా ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాయిని విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ ఇళ్లనుంచే పరిశుభ్రతకు శ్రీకారం చుట్టి అమ్మనాన్నలకు, చుట్టు పక్కన వాళ్లకు చెత్త చెదారాన్ని ఆరు బయిట వేయకుండా బల్దియా పెట్టిన తడి, పొడి చెత్త డబ్బాల్లో వేసే విధంగా చైతన్యపర్చాల్సిన అవసరం ఉందన్నారు. మన పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం, ఆరోగ్యంగా ఉంటేనే మన మేధస్సుకు పని చెప్పి దేశ అభివృద్ధికి నిచ్చెనలు వేయడానికి ఆస్కారముంటుందన్నారు. మంత్రి పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ఆలోచనకు జిహెచ్‌ఎంసి అధికారులు పదునుపెట్టి స్వచ్ఛ హైదరాబాద్‌గా తీర్చిదిద్దేందుకు నగరంలోని 150 డివిజన్లలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొనేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. నగర మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని చైతన్యం చేస్తే వారు ఒక్కొక్కరు నలుగురిని చైతన్యం చేస్తే భాగ్యనగరాన్ని చెత్త లేని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు కంకణబద్ధులౌతారన్నారు. ఎంపి చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందని విద్యార్థులు తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని రాష్ట్రంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా హైదరాబాద్ నగరాన్ని సుందరవనంగా తీర్చిదిద్దాలన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదినోత్సవం సందర్భంగా కేక్‌ను కట్ చేసి ఆయనకు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రముఖ సినీ రచయిత గాయకుడు సుద్దాల అశోక్ తేజ, దేశపతి శ్రీనువాసులుచ మ్యూజిక్ డైరక్టర్ ఆర్‌పి.పట్నాయక్‌లు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. మేడ్చల్ కలెక్టర్ ఎంవిఎస్ రెడ్డి, తాడూరి శ్రీనువాసు, ఎమ్మెల్సీ జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ నియోజకవర్గంపై సిఎం ప్రత్యేక శ్రద్ధ



మంత్రి హరీశ్‌రావు

మన తెలంగాణ/బొంరాస్‌పేట (వికారాబాద్ జిల్లా) : కొడంగల్ నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారని భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం మండలంలోని మెట్లకుంట పరిధిలో గల బుర్రితండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే మారుమూల ప్రాంతమైన కొడంగల్ అన్ని రంగాల్లో వెనుకబడివుందని, ఇటీవలే ముఖ్యమంత్రి వరాల జల్లు కురిపించి అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నియోజకవర్గానికి రూ.60 కోట్లతో రోడ్లు, రూ.30 కోట్లతో సిసి రోడ్లు, రూ.20 కోట్లతో వివిధ కులాల కమ్యూనిటీ హాల్‌లు, కోస్గిలో బస్‌డిపో, ఫైర్‌స్టేషన్, రైతులకు 24 గంటల కరెంట్ కోసం ప్రతి మండలానికి 3 నుంచి 4 సబ్‌స్టేషన్ల మంజూరు, ప్రతి ఇంటికి తాగునీరు, కొడంగల్ నియోజకవర్గానికి సాగు నీరు, మూడు మండలాలకు గాను ఒక్కో మండలానికి 30 పడకల ఆసుపత్రి, కొడంగల్‌కు 50 పడకల ఆస్పత్రి, బొంరాస్‌పేట, కొడంగల్, దౌల్తాబాద్ మండలాలకు జూనియర్ కళాశాలలు మంజూరు చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదినం సందర్భంగా హరీశ్‌రావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి మంత్రి హరీష్‌రావుని ఘనంగా సత్కరించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి, టిఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాసర క్షేత్రంలో అపచారం

ప్రధాన ద్వారం మూసివుండగానే వెనకనుంచి పూజలు



మన తెలంగాణ / బాసర : ప్రసిద్ధ పుణ్య క్షేత్రం చదువుల తల్లి శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారైన బాసర క్షేత్రంలో శనివారం మరోసారి అపచారం చోటు చేసుకుంది. వేకువ జామున అమ్మవారి అభిషేకం, అలంకరణ అనంతరం ప్రధాన ద్వారం మూసి ఉండగానే ఆలయానికి చెందిన ట్రస్ట్ సభ్యులు నూకం రామారావు, లక్ష్మీ భర్త మల్కన్నయాదవ్, బాసర వెలమ సంఘం అధ్యక్షులు గంగారాయుడు, గంగాశ్యాంలతో పాటు మరికొందరు అమ్మవారిని దర్శించుకున్నారు. గతంలో బాసర ఆలయంలో అలస్యంగా అమ్మవారికి నైవేద్యం, వరాహం తిరగడంతో పాటు ఆయా ప్రధాన గోపురం నుండి తాగిన మైకంలో వ్యక్తి దూకే ప్రయత్నంలో పట్టుబడగా అదే విధంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నల్గొండ జిల్లాకు తరలించి అక్షర శ్రీకారాలు చేపట్టడం లాంటి సంఘటనలు మరవక ముందే ప్రధానం ద్వారం మూసి ఉన్న సమయంలో వెనక నుంచి వెళ్లి గర్భగుడిలో పూజలు చేసిన సంఘటన చేసుకోవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ఈఓ సోమయ్యను వివారణ కోరగా ఆలయంలో జరిగిన ఈ ఘటన వాస్తవమేనని దీనిపై పూర్తి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

సిఎం కెసిఆర్ జన్మదిన వేడుకల్లో అపశ్రుతి

టెంట్‌కు నిప్పంటుకొని అగ్ని ప్రమాదం
మంత్రి రామన్నకు తప్పిన ముప్పు





మన తెలంగాణ/మంచిర్యాలప్రతినిధి : మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కెసిఆర్ జన్మదిన వేడుకల్లో శనివారంఅపశ్రుతి చోటు చేసుకుంది. వేడుకలు నిర్వహిస్తున్న షామియానాకు నిప్పంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దాదాపు ఘటనలో రూ. 2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాదం నుంచి అటవీశాఖ మంత్రి జోగు రామన్న, ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, మంచిర్యాల ఎంఎల్‌ఏ నడిపల్లి దివాకర్ రావు, బెల్లంపల్లి ఎంఎల్‌ఏ దుర్గం చిన్నయ్య, మంథని ఎంఎల్‌ఏ పుట్ట మధు సురక్షితంగా బయటపడ్డారు. మున్నూర్ కాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంతో పాటు ముందుగా కేక్ కట్ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి జోగు రామన్నఈ కార్యక్రమానికి హాజరు కాగా కార్యకర్తలు, అభిమానులు టపాసులు పేల్చారు.షామియానాపై మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన నాయకులు వేదికపై నుంచి కిందికి దిగారు. కాగా మంటలు పెద్ద ఎత్తున చెలరేగి మూడు షామియానాలు, కుర్చీలు కాలిపోయాయి. అగ్నిమాపక శకటాలతో మంటలను పూర్తిగా అర్పివేశారు.

రిమ్స్‌లో నాణ్యమైన వైద్య సేవలు



2018 పూర్తి కల్లా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి
కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అహీర్

మన తెలంగాణ/ఆదిలాబాద్ టౌన్ : రిమ్స్‌లో పేద రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహీర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను జిల్లా కలెక్టర్ డి.దివ్యతో కలిసి పరిశీలించారు. నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో పర్యటించి వివరాలను తెలుసుకున్నారు. మ్యాప్‌ను పరిశీలించి పనులు నాణ్యతతో పాటు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. అక్కడి నుంచి రిమ్స్‌కు చేరుకొని ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. రిమ్స్‌లోని డిజిటల్ ఎక్స్ రే, సిటి స్కాన్‌లను పరిశీలించారు. రేడియోలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ రెడ్డి సేవే లక్ష్యంగా రిమ్స్‌లో 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని బిజెపి జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ కేంద్ర హోం శాఖ సహాయక మంత్రికి వివరించడంతో డాక్టర్ కళ్యాణ్ రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగామంత్రి మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్ లాంటి ప్రాంతంలో వైద్య సేవలు మెరుగ్గా అందుతున్నాయన్నారు. ఏడాది చివరిలోపు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తై వినియోగంలోకి వస్తుందన్నారు. దీనికి 150 కోట్లు మంజూరయ్యాయని, ఇందులో కేంద్ర ప్రభుత్వం 80శాతం (120 కోట్లు) మంజూరు చేసినట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్లు ఇవ్వనుందన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. స్వచ్ఛభారత్‌పై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని దీనికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి విష్ణు ఎస్ వారియర్, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ అశోక్, బిజెపి నాయకులు మాడావి రాజు, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి జగదీశ్‌రెడ్డి

మన తెలంగాణ/సూర్యాపేట : జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నానని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఎస్వీ కళాశాల ఆడిటోరియంలో భారతీయ స్టేట్ బ్యాంకు, లీడ్ బ్యాంకు సూర్యాపేట జిల్లా వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా రుణమేళాకు మంత్రి, కలెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల ఆర్థిక బలోపేతానికి ఇలాంటి మేళాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ సురేంద్రమోహన్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు వేల కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. అనంతరం మంత్రి చేతుల మీదు గా రుణాలను పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక, యంపిపి వట్టె జానయ్యయాదవ్, డిఆర్‌డిఎ పిడి కిరణ్‌కుమార్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ప్రభాకర్, గిరిజన సంక్షేమ అధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల రక్షణకు పోరాటాలు

న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ముద్దా భిక్షం

మన తెలంగాణ/ములకలపల్లి : గిరిజనులు గత అనేక సంవత్సరాలుగా పోడు భూములను సేద్యం చేసుకొని జీవిస్తుంటే అటవీశాఖాధికారులు వాటిని తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, పోడుభూముల చుట్టు కందకాలు త్రొవ్వుతున్నారని, తక్షణమే వాటిని నిలిపివేయాలని, ఈ విషయంలో గిరిజనులంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ముద్దా బిక్షం పిలుపునిచ్చారు. శనివారం పూసుగూడెం పంచాయితీ చింతలపాడు గ్రామంలో తాటి తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన పార్టీ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్రాలకుంట, చింతలపాడు, అన్నారం, సీతారాంపురం, ఆనందపురం గ్రామాలలో నివసిస్తున్న గిరిజనులు దశాబ్ధలుగా పోడుభూములను సేద్యం చేసుకొని జీవిస్తున్నారన్నారు. ఈ గ్రామాల పరిధిలో అటవీ శాఖాధికారులు హరితహారం పేరుతో పోడుభూములను గిరిజనులనుండి తీసుకోవడానికి యత్నిస్తున్నారన్నారు. పోడుభూములచుట్టు జెసిబిలతో కందకాలు తవ్వే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారుమండల కార్యదర్శి కల్లూరి కిషోర్, పిడిఎస్‌యు నాయకులు ఈసం అశోక్, కుంజా సురేష్, కూనం బాబు పాల్గొన్నారు.

చేనేత పారిశ్రామికులకు చేనేత మిత్ర

మన తెలంగాణ/కలెక్టరేట్ : చేనేత పారిశ్రామికుల జీవన ప్రమాణాలను పెంచటానికి ప్రభుత్వం చేనేత మిత్ర పథకం (40 శాతం నూలు సబ్సిడీ పథకం) ప్రవేశపెట్టిందని డైరెక్టర్ ఆఫ్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్స్ శైలజా రామయ్యర్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి కరీంనగర్,ఆదిలాబాద్ జిల్లాలలోని చేనేత పారిశ్రామికులతో చేనేత మిత్ర పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చేనేత పారిశ్రామికులను కోరారు. ఈ పథకం విధి విధానాలు, చేనేత పారిశ్రామికుల నూతన త్రిఫ్ట ఫండ్ పథకం (నేతన్నకు చేయూత) గూర్చి పూర్తి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, టెస్కో జిఎం యాదగిరి, ప్రాంతీయ ఉప సంచాలకులు, చేనేత, జౌళిశాఖ, వరంగల్ ఎం. వెంకటేశం, సహాయ సంచాలకులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల కష్టాలు తీరుస్తా

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మన తెలంగాణ/ ఖమ్మం రూరల్ : నిరుపేదల కష్టాలను కడతేర్చి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలన్నదే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంకల్పమని రోడ్లు, భవనాలు, స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఖమ్మం రూరల్ మండలం రాజీవ్ గృహకల్ప, కరుణగిరి వద్ద మారెమ్మ తల్లి గుడి నుంచి కేంద్రీయ విద్యాలయం వరకు రూ.2.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రహదారి అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కష్టాలతో అలమటించే నిరుపేదల దుస్థితిని తొలగించి కనీస అవసరాలు కల్పించి వారిని ఆదుకోవాలన్నదే ముఖ్యమంత్రి ఆలోచన అని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ బుడాన్ బేగ్, ఆర్ అండ్ బి ఎస్‌ఇ పి.నర్సింహామూర్తి, ఐబిఇఇ నర్సింహారావు, ఖమ్మం ఆర్‌డిఓ పూర్ణచంద్ర పాల్గొన్నారు.

వైవిధ్యమైన కథతో చిత్రం

వరుస హిట్లతో దూసుకుపోతున్న నాని క్రేజ్ రోజురోజుకు పెరుగుతోంది. అతను ఇప్పుడు వరుసగా భారీ ప్రాజెక్టులు చేస్తున్నాడు. ప్రస్తుతం మేర్లపాక గాంధీ దర్శకత్వంలో 'కృష్ణార్జున యుద్ధం' సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాతో తన కెరీర్‌లో రెండోసారి ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. ఈ చిత్రం షూటింగ్‌లో ఉండగానే నాగార్జునతో కలిసి మల్టీస్టారర్‌లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. అనంతరం వైవిధ్యమైన చిత్రాలు తీసే దర్శకుడిగా పేరున్న విక్రమ్ కె.కుమార్‌తో సినిమా చేసేందుకు నాని సిద్ధమైపోయాడు. నాగార్జున కుటుంబంతో 'మనం' వంటి మరచిపోలేని సినిమాను చేసిన విక్రమ్ ఇటీవల అఖిల్‌తో 'హలో' చిత్రం చేశాడు. ఇప్పుడు నానితో ఓ సినిమా చేసేందుకు సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే విక్రమ్ కథను నానికి చెప్పాడట. వైవిధ్యమైన కథతో ఈ సినిమా తెరకెక్కనుంది. ప్రస్తుతం విక్రమ్ కథకు తుది మెరుగులు దిద్దే పనిలో ఉన్నాడు. ఈలోగా నాని తన సినిమాలను పూర్తిచేసి విక్రమ్ సినిమాకు సమయాన్ని కేటాయిస్తాడు.



తెలుగు చిత్రపరిశ్రమ గర్వపడే తొలి ప్రేమ



వరుణ్‌తేజ్, రాశీఖన్నా హీరోహీరోయిన్లుగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బివిఎస్‌ఎన్ ప్రసాద్ నిర్మించిన 'తొలిప్రేమ' చిత్రం ఇటీవల విడుదలై ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా మెగాస్టార్ చిరంజీవి... హీరో వరుణ్‌తేజ్, దర్శకుడు వెంకీ, నిర్మాత బివిఎస్‌ఎన్ ప్రసాద్, బాపినీడులను హైదరాబాద్‌లోని తన ఇంటికి ఆహ్వానించి సన్మానించారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ ''తొలిప్రేమ చిత్రం పెద్ద సక్సెస్ అయిన సందర్భంగా సినిమా టీమ్‌కి అభినందనలు. నా తమ్ముడు పవన్‌కళ్యాణ్ చిత్రం 'తొలిప్రేమ' టైటిల్‌తో వచ్చిన ఈ సినిమాపై ఎంతో ఆసక్తి కలిగి చూశాను. ఇదొక మంచి లవ్‌స్టోరీ. దర్శకుడు ఎంతో ఛాలెంజింగ్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. ఓ కొత్త కోణంలో సినిమాను చూపించాడు. తెలుగు చిత్ర పరిశ్రమ గర్వపడే సినిమా ఇది. నటీనటులంతా పాతవాళ్లే. కానీ అన్ని పాత్రలు చాలా కొత్తగా కనిపించాయి. వరుణ్‌తేజ్ అద్భుతంగా నటించాడు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే కమర్షియల్ సినిమా ఇది. తమన్ సంగీతం చాలా బాగుంది''అని అన్నారు. చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ ''చిరంజీవి మా సినిమా చూసి మమ్మల్ని ఇలా పిలిపించి మాట్లాడటం చాలా సంతోషంగా, గర్వంగా ఉంది. సినిమా టీమ్ అంతా పడిన కష్టానికి పడిన ఫలితంగా 'తొలిప్రేమ' ఘన విజయం సాధించింది'' అని తెలిపారు. హీరో వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ''నాకు హీరో కావాలన్న ఆలోచన చిరంజీవిని చూసే వచ్చింది. ఈరోజు ఆయన మా సినిమా గురించి మంచి మాటలు చెబుతుంటే చాలా సంతోషంగా ఉంది''అని పేర్కొన్నారు. నిర్మాత బివిఎస్‌ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ''33 ఏళ్ల క్రితం సినిమాలు చేద్దామని మద్రాస్ వెళ్లాను. ఆ సమయంలో చిరంజీవి ఇంటికి వెళ్లి ఆయనను కలిశాను. ఇన్నేళ్లకు రామ్‌చరణ్, పవన్‌కళ్యాణ్, బన్నీ, వరుణ్‌తో సినిమా చేసే అవకాశం లభించడంతో ఎంతో సంతోషంగా ఉంది''అని పేర్కొన్నారు. తమన్ మాట్లాడుతూ ''నేను చిరంజీవికి పెద్ద ఫ్యాన్‌ని. ఆయన మమ్మల్ని పిలిపించి ప్రశంసించడం చాలా ఆనందాన్నిచ్చింది. ఇంటర్ పాసై డిగ్రీకి వెళ్తున్న ఫీలింగ్ కలిగింది''అని అన్నారు.



నాగశౌర్య, ఉషా ముల్పూరి, శంకర్ ప్రసాద్, వెంకీ కుడుముల, గౌతమ్

ఇది నాకు మరచిపోలేని గిఫ్ట్ : వెంకీ

ఐరా క్రియేషన్స్ బ్యానర్‌లో శంకర్ ప్రసాద్, ఉషా నిర్మాతలుగా నాగశౌర్య, రష్మిక జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఛలో'. ఈ చిత్రం ఇటీవల విడుదలై ఘన విజయం సాధించింది. రెండు వారాల్లో 23.21 కోట్ల గ్రాస్ వసూలు చేయడమే కాకుండా శాటిలైట్, రీమేక్ రైట్స్‌తో మరో 6 కోట్ల బిజినెస్ ఆఫర్‌తో ఈ ఏడాది టాలీవుడ్‌లో బ్లాక్‌బస్టర్ హిట్ మూవీగా నిలిచింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ఉషా ముల్పూరి ఈ చిత్రానికి పనిచేసిన 24 క్రాఫ్ట్స్ వాళ్లను సత్కరించారు. అదేవిధంగా దర్శకుడు వెంకీ కుడుములకు కారు గిఫ్ట్‌గా ఇచ్చారు. అనంతరం ఉషా ముల్పూరి మాట్లాడుతూ ''గతంలో మేము మా కుటుంబంతో కలిసి సినిమాలు చూసేవాళ్లం. సినిమా తీయాలంటే హీరో, హీరోయిన్, దర్శకుడు ఉంటే చాలని అనుకునే వాళ్లం. కానీ మా ఐరా క్రియేషన్స్ బ్యానర్ స్థాపించాక తెలిసింది తెర మీద కనిపించే వారి వెనుక వందలాది శ్రామికుల కష్టం ఉంటుందని. అందుకే 'ఛలో' చిత్రం ఘన విజయం సాధించిన తర్వాత ఈ చిత్రానికి పనిచేసిన 24 క్రాఫ్ట్స్ వాళ్లను సన్మానించాం. ఇక మా దర్శకుడు వెంకీ కుడుముల మాకు కథ చెప్పడం... అది మాకు నచ్చడం... వెంటనే మేము సినిమాను నిర్మించడం జరిగింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా మా ఐరా క్రియేషన్స్ బ్యానర్‌ను మొదలు పెట్టడానికి దర్శకుడు వెంకీ కారణం కావటమే కాకుండా మా బ్యానర్‌లో ఇంత మంచి చిత్రానికి దర్శకత్వం వహించినందుకు కృతజ్ఞతగా ఆయనకు కారు గిఫ్ట్‌గా ఇచ్చాము. దర్శకుడిగా తన మొదటి చిత్రం 'ఛలో'తో విజయ యాత్ర మొదలుపెట్టిన వెంకీ కుడుముల మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము''అని అన్నారు. దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ ''నాగశౌర్య తల్లిదండ్రులు నన్ను నమ్మి ఈ చిత్రాన్ని నిర్మించారు. వారి రుణం ఏనాటికి మరచిపోలేను. ఈ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం ఇవ్వటమే నాకు గిఫ్ట్. ప్రేక్షకులు బ్లాక్‌బస్టర్ హిట్ చేయడం డబుల్ గిఫ్ట్. అయితే ఇప్పుడు నాకు కారు గిఫ్ట్‌గా ఇవ్వటం అనేది నేను జీవితంలో మరచిపోలేని గిఫ్ట్‌గా భావిస్తున్నాను. నాగశౌర్య అనే వ్యక్తి నాకు పరిచయం కాకపోతే నాకు ఈ సినీ జీవితమే లేదు. ఎప్పటికీ నేను గుర్తుపెట్టుకునే నా హీరోకు ధన్యవాదాలు''అని చెప్పారు.

'హ్యాపీడేస్'ను మరిపించే 'ఆనందం'



కాలేజీ నేపథ్యంలో కథలు అల్లుకొని యువత మనసులకు హత్తుకునేటట్టు తెరకెక్కించిన చిత్రానికి విజయం తథ్యం. మలయాళ చిత్రం 'ఆనందం' ఇదే తరహాలో ఘన విజయం సాధించింది. రూ 4 కోట్ల వ్యయంతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ. 20 కోట్లు వసూలు చేసింది. ఆహ్లాదకరమైన కథతో, భారీ విజయంతో యువ హృదయాలను కొల్లగొట్టిన మలయాళ 'ఆనందం' చిత్రం అదే పేరుతో ఇప్పుడు తెలుగులోకి విడుదలకానుంది. సుఖీభవ మూవీస్ పతాకంపై నిర్మాత ఎత్తరి గురురాజ్ ఈ చిత్రాన్ని తెలుగులోకి అనువదిస్తున్నారు. గణేష్‌రాజ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. 'ప్రేమమ్' ఫేమ్ నివిన్ పాల్ ఇందులో గెస్ట్ రోల్ చేశాడు. మిగిలిన నటీనటులందరూ కొత్తవారే కావడం గమనార్హం. వీర వెంకటేశ్వర రావు, విఆర్‌బి రాజు, రవి వర్మ చిలువూరి ఈ చిత్రానికి సహ నిర్మాతలు. సీనియర్ నిర్మాత ఆర్.సీతారామరాజు ఈ చిత్రానికి సమర్పకులు. ఈ సినిమా గురించి చిత్ర నిర్మాత ఎత్తరి గురురాజ్ మాట్లాడుతూ ''ఆనందం సినిమా కేరళలో చాలా పెద్ద విజయాన్ని సొంతం చేసుకుంది. పెట్టిన ఖర్చుకు నాలుగింతలు వసూళ్లు రాబట్టిందంటేనే ఈ సినిమా స్టామినాను అర్థం చేసుకోవచ్చు. తెలుగు నేటివిటీకి సరిపోయే అంశాలు ఇందులో పుష్కలంగా ఉండటంతో ఈ చిత్రాన్ని తెలుగులోకి అనువాదం చేయాలని నిర్ణయించుకున్నాం. మలయాళ టాప్ హీరో నివిన్ పాల్ తప్ప మిగిలిన వాళ్లందరూ కొత్తవారే నటించారు. తెరమీద వారిని చూస్తున్నంత సేపు చాలా నేచురల్‌గా ఉంటుంది. ఎక్కడా ఓవర్ డ్రామా, మెలో డ్రామా, సినిమాటిక్ డ్రామా కనిపించదు. తప్పకుండా యువతకు కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఇందులోని మూడు లవ్ స్టోరీలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. మలయాళంలోని టాప్ మ్యూజిక్ డైరెక్టర్ సచిన్ వారియర్ వినసొంపైన సంగీతాన్ని సమకూర్చారు. మార్చి మొదటి వారంలో సినిమా పాటలను విడుదల చేస్తాం. మార్చి 16న సినిమాను విడుదల చేస్తాం. మన 'హ్యాపీడేస్'ను మరిపించే సినిమా ఇదవుతుంది''అని చెప్పారు. అరుణ్ కురియన్, థామస్ మాథ్యూ, రోషన్ మాథ్యూ, విశాక్ నాయర్, సిద్ధి మహాజనకట్టి, అన్ను ఆంటోని, అనార్కళి మరికర్, నివిన్ పాల్, రెంజి ఫణిక్కర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలుః ఎం.రాజశేఖర రెడ్డి, పాటలుః వనమాలి, కెమెరాః ఆనంద్ ఇ.చంద్రన్.

అవార్డుల కోసం 'అ!' చేయలేదు

నేచురల్ స్టార్ నాని సమర్పణలో వాల్ పోస్టర్ సినిమా బ్యానర్ పై రూపొందిన చిత్రం 'అ!'. కాజల్ అగర్వాల్, రెజీనా కసండ్ర, ఈషా రెబ్బా, శ్రీనివాస్ అవసరాల, నిత్యామీనన్, మురళీశర్మ, ప్రియదర్శి తదితరులు ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ దర్శకుడు. ప్రశాంతి త్రిపిరినేని నిర్మించిన ఈ చిత్రం తాజాగా విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మతో ఇంటర్వ్యూ...

చిన్నప్పటి నుంచే ఆసక్తి...

ఇంజనీరింగ్ చదివిన నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఆసక్తి. ఈ ప్యాషన్‌తో చాలా డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిలింస్, మ్యూజిక్ వీడియోస్, యాడ్ ఫిలింస్ చేశాను. దర్శకుడిగా నా తొలి చిత్రం 'అ!'.

ఆలోచనతో కూడిన...

మా సినిమాకు మంచి స్పందన వస్తోంది. విభిన్నమైన జోనర్‌లో సినిమా చేయాలనుకొని 'అ!' చిత్రాన్ని చేశాను. ఆలోచనతో కూడిన సినిమా కాబట్టి కొంతమందికి మొదటిసారి చూస్తేనే అర్థమైంది. మరికొందరికి రెండు, మూడు సార్లు చూస్తే అర్థమవుతుంది. నా తదుపరి సినిమా కూడా ఇలాగే ఉంటుంది.

ఆయన ధైర్యంగా ముందుకొచ్చారు...

తక్కువ బడ్జెట్‌లో సినిమా చేయాలనుకొని ఈ కథ రాయడం జరిగింది. ఈ కథకు ఇన్‌స్పిరేషన్ అంటూ ఏమీ లేదు. నేటి సమస్యపై సినిమా ఉండాలనుకొని ఒక ఐడియాతో ఈ కథ రాయడం జరిగింది. నేను సొంతంగా ఈ సినిమా చేయాలనుకున్నాను. చేప వాయిస్ కోసం నానిని కలిశాను. కానీ ఆయన ధైర్యంగా ఈ సినిమాను నిర్మించడానికి ముందుకొచ్చారు.

ఎంతో నమ్మకంగా చేద్దామన్నారు...

కథ విన్న తర్వాత నానికి బాగా నచ్చింది. తర్వాత ఫుల్ స్క్రిప్ట్ ఇచ్చాను. నానికి నచ్చడంతో సెట్స్‌పైకి వెళ్లాం. ప్రేక్షకుల్లో ఆయనకున్న విశ్వసనీయతను పాడు చేయకూడదని అనుకున్నాను. ఈ విషయాన్ని ఆయనకు ముందే చెప్పాను. కానీ నాని ఎంతో నమ్మకంగా ఈ సినిమా చేద్దామని అన్నారు.

బెస్ట్ కాంప్లిమెంట్స్‌గా భావించా...

నాకంటే నాని, ప్రశాంతి, రాబోయే కొత్త దర్శకుల కోసం సినిమా హిట్ కావాలని కోరుకున్నాను. ఈ సినిమా చూసిన తర్వాత కొత్త కథలు వస్తాయని కొందరు అన్నారు. కొత్త అనుభూతినిచ్చే చిత్రమిదని మరికొంతమంది చెప్పారు. వీటిని నేను బెస్ట్ కాంప్లిమెంట్స్‌గా భావించాను.

అవగాహన తీసుకురావాలి...

నా నిజ జీవితంలో కూడా డిప్రెషన్‌కు లోనైన వ్యక్తులను కొందరిని చూశాను. వారిలో సక్సెస్ అయిన వాళ్లున్నారు. ఫెయిల్ అయిన వాళ్లున్నారు. డిప్రెషన్‌పై అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డబ్బుల కోసం చేయలేదు...

అవార్డుల కోసం ఈ సినిమా చేయలేదు. అయితే తప్పకుండా మా టీమ్‌లో ఒకరిద్దరికి అవార్డులు వస్తాయని అనుకుంటున్నాను. అయితే డబ్బుల కోసం ఈ సినిమా చేయలేదు. మంచి సినిమా చేయాలనే ఆలోచనతోనే 'అ!'ను తెరకెక్కించాను.

ఇది వర్కవుట్ అయింది...

నేను ఈ సినిమా కంటే ముందు చాలా సినిమాలు చేయాలని అనుకున్నాను. కానీ అవి చేయలేకపోయాను. ఈ సినిమా వర్కవుట్ అయింది. నా దగ్గర 30 కథలకు పైగానే ఉన్నాయి.


ప్రశాంత్ వర్మ

డి.రామానాయుడు దేవుడితో సమానం


'మా' నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న వెంకటేశ్. చిత్రంలో నరేష్, శ్రీకాంత్, తనికెళ్ల భరణి తదితరులు

మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా... డా.డి.రామానాయుడు మూడవ వర్ధంతి సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న నాటకోత్సవాలు హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీ కాంప్లెక్స్‌లో ప్రారంభమయ్యాయి. ముందుగా పరుచూరి వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలిరోజు 'జనశ్రేణి' విజయవాడవారి 'గుర్తుతెలియని శవం' నాటికను ప్రదర్శించారు. అనంతరం నటులు, రచయిత, దర్శకులు తనికెళ్లభరణిని 'మా' ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా హీరో వెంకటేష్ మాట్లాడుతూ ''మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా నాన్నగారి పేరు మీద నాటకాలు నిర్వహించడం సంతోషంగా ఉంది. 'గుర్తు తెలియని శవం' నాటకం చాలా బాగుంది. అందరూ బాగా నటించారు''అని అన్నారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ ''డి.రామానాయుడుకి నాటకానికి అవినాభావ సంబంధం ఉంది. ఆయన నాకెప్పుడు సూటుకేసుతో కనిపించేవారు. అది చూసి అందులో అంతా డబ్బే ఉందని అనుకునేవాడిని. అది గ్రహించిన ఆయన అందులో డబ్బు కాదు స్క్రిప్ట్ ఉంటుందని చెప్పారు. అప్పుడే అర్థమైంది ఆయన కథలకు ఎంత విలువిస్తారో. వాళ్ల బ్యానర్‌లో ఎన్నో సినిమాలు చేశాను. 'మా' నన్ను సన్మానించడం చాలా సంతోషంగా ఉంది''అని తెలిపారు. 'మా' అధ్యక్షుడు శివాజీ రా జా మాట్లాడుతూ ''కళాకారులు ఎక్కడ సంతోషంగా ఉంటారో ఆ రాష్ట్రం సుఖ సంతోషాలతో ఉంటుంది. మన రాష్ట్రం అలాగే ఉంది. రామానాయుడుకి కుల, మతాలతో సంబంధం లేదు. నాలాంటి కళాకారులకు ఆయన దేవుడితో సమానం. ఆయన పేరిట మూడు రోజుల పాటు నాటకాలను నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నాం''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో 'మా' ప్రధాన కార్యదర్శి నరేష్, డి.రామానాయుడు కుటుంబ సభ్యులు డి.సురేష్‌బాబు, అభిరామ్‌తో పాటు తేజ, రఘుబాబు, శ్రీకాంత్, ఏడి ద శ్రీరామ్, హేమ, సురేష్ కొండేటి, సురేష్, నాగినీడు, ఉత్తేజ్, మాణిక్ తదితరులు పాల్గొన్నారు.

25న దండుపాళ్యం-3 ప్రీ రిలీజ్ ఫంక్షన్

దండుపాళ్యం సిరీస్‌లో వచ్చిన రెండు పార్టులు భారీ ఓపెనింగ్స్‌తో సూపర్ సక్సెస్‌ను సాధించాయి. ఇప్పుడు ఈ సిరీస్‌లో చివరి పార్టుగా 'దండుపాళ్యం3' చిత్రం మార్చి 2న విడుదలకానుంది. శ్రీనివాసరాజు దర్శకత్వంలో రూపొందిన ఈ సంచలన చిత్రం తెలుగు ప్రేక్షకులను థ్రిల్ చేయనుంది. శ్రీ వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్‌వారు తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. శ్రీక్షీర రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో సాయికృష్ణ ఫిల్మ్స్ సమర్పణలో శ్రీనివాస్ మీసాల, రజని తాళ్లూరి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను ఈనెల 25న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ ''దర్శకుడు శ్రీనివాసరాజు అద్భుతమైన కథ, కథనంతో 'దండుపాళ్యం3' చిత్రాన్ని రూపొందించారు. ఇందులోని సన్నివేశాలు ప్రేక్షకులను మైమరపిస్తాయి. సహజమైన సన్నివేశాలు, భావోద్వేగమైన డైలాగులతో ఈ కథ సాగుతుంది. ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. దండుపాళ్యం సిరీస్‌కు ఇదే చివరి పార్టు కావడంతో అసలు క్లైమాక్స్ ఎలా ఉండబోతుందోననే ఆసక్తి అందరిలో ఉంది. ఫిబ్రవరి 25న ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను నిర్వహించి మార్చి 2న ప్రపంచవ్యాప్తంగా 'దండుపాళ్యం3' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నాం''అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః వెంకట్ ప్రసాద్, సంగీతంః అర్జున్ జన్యా, ఎడిటింగ్ః రవిచంద్రన్.


పూజా గాంధీ

క్రిమినల్స్‌గా మారిన నిరుద్యోగులు


జారా షా, నీరజ్

ఇంద్రనీల్ సేన్ గుప్తా, జారా షా, అభిషేక్, కర్తవ్య శర్మ, నీరజ్, మృణాల్, మృదాంజలి కీలక పాత్రధారులుగా రాజ్ మాదిరాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఐతే 2.ఓ'. ఫర్మ్ 9 పతాకంపై కె.విజయరామరాజు, హేమంత్ వల్లపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ చిత్రం మోషన్ పోస్టర్, టీజర్‌ను రాజ్‌కందుకూరి, నందినీరెడ్డి కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజ్ కందుకూరి మాట్లాడుతూ ''నేటి ట్రెండ్‌కు తగ్గ సినిమా ఇది. ఇలాంటి కథను ఎంచుకున్న దర్శకుడిని మెచ్చుకోవాలి. టీజర్ ఆసక్తికరంగా ఉంది''అని అన్నారు. నందినీ రెడ్డి మాట్లాడుతూ ''ఈమధ్య కాలంలో రెగ్యులర్ సినిమాలు తీస్తే ప్రేక్షకులు థియేటర్ వైపు కూడా చూడటం లేదు. తెలుగు ప్రేక్షకులు కొత్తదనాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజ్ మాదిరాజ్ అద్భుతమైన కథ రాశారు. ఆయన రచనాశైలి అంటే నాకు చాలా ఇష్టం. ఇది మంచి సినిమా అవుతుంది''అని అన్నారు. దర్శకుడు రాజ్ మాదిరాజ్ మాట్లాడుతూ ''ఇంజనీరింగ్ పూర్తిచేసి నిరుద్యోగులుగా ఉన్న నలుగురు యువకులు ఆకలి, ఆశకు లొంగక ఆక్రోశానికి బలై క్రిమినల్స్‌గా ఎలా మారారు అన్న పాయింట్‌కు నేటి టెక్నాలజీ, సోషల్ మీడియా, హ్యాకింగ్ వంటి అంశాలను జోడించి తెరకెక్కించిన చిత్రమిది. ప్రస్తుతం ఇంటర్‌నెట్ వలలో ఇరుక్కుపోయిన జనాలకు ఈ సినిమా ద్వారా చక్కని సందేశాన్నిస్తూ ఓ హెచ్చరిక కూడా చేస్తున్నాం. పూర్తిగా ప్రయోగాత్మక చిత్రమిది''అని చెప్పారు. నిర్మాతలు కె.విజయరామరాజు, హేమంత్ వల్లపురెడ్డి మాట్లాడుతూ ''యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం చక్కని వినోదాన్ని కూడా పంచుతుంది. త్వరలో ట్రైలర్, పాటలను విడుదల చేసి మార్చి 16న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం.''అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ నల్లమోతు, నీరజ్, జారా షా తదితరులు పాల్గొన్నారు.

కడుపుబ్బ నవ్వించే 'చెన్నై చిన్నోడు'

జి.వి.ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తూ సంగీతాన్ని సమకూర్చిన ఓ తమిళ చిత్రాన్ని 'చెన్నై చిన్నోడు' పేరుతో తెలుగులో విడుదల చేస్తున్నారు. శూలిని దుర్గా ప్రొడక్షన్స్ పతాకంపై వి.జయంత్‌కుమార్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. నిక్కీ గల్రానీ, రక్షిత హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి ఎం.రాజేష్ దర్శకుడు. ఈ చిత్రంలోని పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టిఎఫ్‌సిసి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ ''తమిళంలో మంచి సక్సెస్‌ను అందుకున్న ఈ చిత్రాన్ని తెలుగులో 'చెన్నై చిన్నోడు' టైటిల్‌తో అనువదిస్తున్నారు. నిర్మాత జయంత్‌కుమార్‌కు ఈ చిత్రం మంచి విజయాన్ని అందించాలని కోరుకుంటున్నాను. ఈ చిత్రంలో జివి ప్రకాష్ హీరోగా నటించి మంచి మ్యూజిక్‌ను అందించారు. పాటలు, ట్రైలర్ అద్భుతంగా ఉన్నాయి''అని అన్నారు. నిర్మాత వి.జయంత్ కుమార్ మాట్లాడుతూ ''తొలిసారిగా నిర్మాతగా ఓ తమిళ చిత్రాన్ని 'చెన్నై చిన్నోడు' పేరుతో తెలుగులోకి అనువదిస్తున్నాం. ఎక్కడా రాజీపడకుండా తెలుగు స్ట్రయిట్ సినిమాలా డబ్బింగ్ కార్యక్రమాలు చేయిస్తున్నాము. పూర్ణచారి పాటలన్నింటికీ అర్థవంతమైన సాహిత్యాన్ని సమకూర్చారు. ఆద్యంతం కడుపుబ్బా నవ్వించే చక్కని కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. ప్రకాష్‌రాజ్ పోలీస్ పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. జి.వి.ప్రకాష్ అద్భుతంగా నటించడంతో పాటు సినిమాకు మంచి సంగీతాన్ని కూడా అందించారు. అతి త్వరలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అని అన్నారు. పాటల రచయిత పూర్ణచారి మాట్లాడుతూ ''తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా ఇందులో నాలుగు పాటలు రాశాను. గాయకులు చాలా బాగా పాడారు. జివి సంగీతంతో పాటు నటన కూడా సినిమాకు ప్రధాన ఆకర్షణగా ఉంటుంది''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాంకీ, పసుపులేటి రామారావు, గాయకులు సంపత్, సాయి మాధవ్, మౌనికా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


'చెన్నై చిన్నోడు' ఆడియో వేడుకలో ప్రతాని రామకృష్ణగౌడ్, సాయి వెంకట్, పసుపులేటి రామారావు, వి.జయంత్‌కుమార్, పూర్ణచారి

విదేశీ గనుల కొనుగోళ్లకు ప్రభుత్వరంగ సంస్థల జాయింట్ వెంచర్



న్యూఢిల్లీ: విదేశాల్లో వ్యూహాత్మక ఖనిజాల సేకరణ లక్ష్యంగా గనుల కొనుగోలుకు ప్రభుత్వరంగ సంస్థలైన నాల్కో, హెచ్‌సిఎల్, ఎమ్ఇసిఎల్‌లతో కలసి జాయింట్ వెంచర్ సంస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈమేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. దేశంలో లభించని, ఒకవేళ ఉన్నా స్వల్ప స్థాయిలోనే లభిస్తున్న ఖనిజాల కోసం ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందిస్తోంది. తద్వారా ఆయా ఖనిజాల కోసం ఎవరిపైనా ఆధారపడకుండా స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నది ప్రధాన లక్ష్యం. కాగా పై మూడు సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేస్తూ అవగాహన కుదుర్చుకున్నాయి. అందు లో భాగంగానే విదేశాల్లో గనులను కొనుగోలు చేసి కీలక ఖనిజాలను వెలికితీసేందుకు ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు గనులశాఖ కార్యదర్శి అరుణ్‌కుమార్ విలేకరులకు తెలిపారు. న్యూఢిల్లీలో జియలాజికల్ బోర్డు సమావేశం జరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈమేరకు ప్రకటన చేశారు. ఈ జాయింట్ వెంచర్ సంస్థ ప్రాథమికంగా కీలక ఖనిజాల తవ్వకాలపై దృష్టిపెడుతుందని, భవిష్యత్‌లో మరిన్ని ఖనిజాలపై దృష్టిసారిస్తుందని ఆయన చెప్పారు. నిజానికి ఈ కీలక ఖనిజాల వ్యవహారంలో తక్షణ వాణిజ్యానికి అవకాశాలు చాలా తక్కువని, అయితే విదేశాల్లో గనుల కొనుగోలు ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.



జియో మరో క్యాష్‌బ్యాక్ ఆఫర్

న్యూఢిల్లీ: రిలయన్స్ జియో మరో క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను ప్రకటించింది. సామ్‌సంగ్, షామీ, నోకియా, ఇంటెక్స్, హువావే, బ్లాక్‌బెర్రీ, సెల్‌కాన్ సహా 22 కంపెనీల స్మార్ట్ ఫోన్లను కొనుగోలు చేసే జియో కొత్త, పాత కస్టమర్లకు 2,200 రూపాయల వరకు క్యాష్‌బ్యాక్ ఇవ్వనున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. జియో ఫుట్ బాల్ ఆఫర్ కింద తక్షణమే ఈ క్యాష్‌బ్యాక్‌ను పొందే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కొనుగోలు చేసిన కొత్త ఫోన్లను ఉపయోగించి ఫిబ్రవరి 15 నుంచి మార్చి 31 వరకు మొదటి రీచార్జ్ చేసే వారికి ఈ ఆఫర్ వర్తించనుంది. మార్చి 31 వరకు జియో కస్టమర్ 198 రూపాయలు లేదా 299 రూపాయలు రీచార్జ్ చేసుకుంటే.. 50 రూపాయల చొప్పున 44 వోచర్లు కస్టమర్ 'మై జియో' ఖాతాలో జమకానున్నాయి. తర్వాతి రీచార్జుల సమయాల్లో వీటిని వినియోగించుకోవచ్చు.

2017–18 జిడిపి, ఐఐపిల ఆధార సంవత్సరం మార్పు



న్యూఢిల్లీ: స్థూల దేశీయోత్పత్తి (జిడిపి), పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి), వినియోగాదారుల ధరల సూచీ(సిపిఐ) రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలకు ప్రభుత్వం బేస్ ఇయర్‌ను మార్చనుంది. జిడిపి, ఐఐపి గణాంకాలకు బేస్ ఇయర్ 2017–18గా మార్చుతున్నట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ మంత్రి డి.వి. సదానంద గౌడ ఇక్కడ జరిగిన ఒక సదస్సులో వెల్లడించారు. రిటైల్ ద్రవ్యోల్బణానికి బేస్ ఇయర్‌ను 2018గా మార్చుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ మూడు కీలక ఆర్థిక గణాంకాలకూ 2011–12 బేస్ ఇయర్‌గా ఉంది. ఆర్థిక వ్యవస్థ గణాంకాల్లో పారదర్శకత, స్పష్టత లక్ష్యంగా కేంద్రం బేస్ ఇయర్ మార్పు నిర్ణయం తీసుకుంటోందన్నారు. గణాంకాల వ్యవస్థ పటిష్టతకు మరిన్ని చర్యలు తీసుకుంటుందని కూడా పేర్కొన్నారు. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో గణాంకాల్లో స్పష్టత ఆవశ్యకత ఎంతో ఉంటుందని అన్నారు. 2018–19లో గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖకు(ఎంఒఎస్‌పిఐ) కేంద్రం రూ.4,859 కోట్లను కేటాయించింది.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.89
యూరో	75.33
బ్రిటిష్ పౌండ్	85.18
ఆస్ట్రేలియన్ డాలర్	49.84
కెనెడియన్ డాలర్	50.64
ఎమిరైట్ దిర్హామ్	17.67
స్విస్ ఫ్రాంక్	64.97
చైనీస్ యువాన్	9.76
మలేషియన్ రింగిట్	15.3
న్యూజిలాండ్ డాలర్	44.67
హాంగ్‌కాంగ్ డాలర్	8.31
జపనీస్ యెన్	0.57
కువైట్ దినార్	214.41
సౌతాఫ్రికన్ రాండ్	4.59

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	29490	31540.11	0.31%
ముంబై	30060	32149.73	0%
ఢిల్లీ	29600	31657.75	0.17%
కోల్‌కతా	30270.99	32375.39	0.17%
కేరళ	28350	30320.86	0.35%
బెంగళూరు	28850	30855.61	0.52%
హైదరాబాద్	29490	31540.11	0.72%
గల్ఫ్	1430.78	1530.25	–0.03%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	శనివారం	శుక్రవారం	మార్పు (%)
చెన్నై	40600.00	40900.00	–0.73
ముంబై	40600.00	40900.00	–0.73
ఢిల్లీ	40600.00	40900.00	–0.73
కోల్‌కతా	40600.00	40900.00	–0.73
హైదరాబాద్	40600.00	40900.00	–0.73



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	390	విశాఖపట్నం	400
వరంగల్	392	చిత్తూరు	393
విజయవాడ	396	చెన్నై	400
గోదావరి	396	బెంగళూరు	395

మరో బ్యాంక్‌కు కుచ్చు టోపీ

పిఎన్‌బి తరువాత సిటీ యూనియన్ బ్యాంక్ బాగోతం

- దాదాపు 20 లక్షల డాలర్ల మేరకు మోసపోయినట్టు సిటీ యూనియన్ బ్యాంక్ ప్రకటన
- లెడ్జర్‌లో ఎలాంటి ఎంట్రీలు లేకుండానే 'స్విఫ్ట్' ద్వారా నగదు బదిలీలు
- కోరనప్పటికీ కరెస్పాండెంట్ బ్యాంకుల ద్వారా బదిలీలు



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ. 11,400 కోట్ల మోసం కుదిపేసిన కొన్ని రోజులకే ప్రైవేట్ రంగ బ్యాంకైన సిటీ యూనియన్ బ్యాంక్ దాదాపు రూ. 12.8 కోట్లు (20 లక్షల డాలర్లు) మోసపోయి చెల్లించినట్లు శనివారం తెలిపింది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో మాదిరిగానే సిటీ యూనియన్ బ్యాంకులో కూడా లెడ్జర్‌లో ఎలాంటి ఎంట్రీలు లేకుండానే స్విఫ్ట్ ఫైనాన్షియల్ ప్లాట్ ఫామ్ ద్వారా బదిలీలు జరిగాయి. 'ఫిబ్రవరి 7న సయోధ్య ప్రక్రియలో మేము స్విఫ్ట్ సిస్టమ్ ద్వారా మా కరెస్పాండెంట్ బ్యాంకులకు మూడు మోసపూరిత చెల్లింపులు జరిగాయని కనుగొన్నాము. అయితే వాటి గురించి మా బ్యాంకుకు సమాచారం అందలేదు. నిధులను వెనక్కి తెప్పించమని మేము కరెస్పాండెంట్ బ్యాంకులను అప్రమత్తం చేశాం' అని సిటీ యూనియన్ బ్యాంకు స్టాక్ ఎక్స్ఛేంజికి దాఖలు చేసిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది.

మూడు మోసపోయిన చెల్లించిన వాటిలో ఒకటి న్యూయార్క్‌లోని స్టాండర్డ్ ఛార్టెడ్ బ్యాంక్ ద్వారా 5 లక్షల డాలర్లు దుబాయ్ బ్యాంకుకు బదిలీ అయింది. అయితే దానిని వెంటనే ఆపేయడంతో ఆ మొత్తం సిటీ యూనియన్ బ్యాంకుకు తిరిగొచ్చిందని కూడా తెలిపింది. కోరనప్పటికీ కరెస్పాండెంట్ బ్యాంకుల ద్వారా బదిలీలు జరిగాయని చెన్నైలోని సిటీ యూనియన్ బ్యాంక్ తెలిపింది. ఫ్రాంక్‌ఫర్ట్‌లోని స్టాండర్డ్ ఛార్టెడ్ బ్యాంక్ ద్వారా 3 లక్షల యూరోలు(372150 డాలర్లు) టర్కిష్ ఖాతాకు రెండో బదిలీ జరిగగా, న్యూయార్క్‌లోని బ్యాంక్ ఆఫ్ అమెరికా ద్వారా 10 లక్షల డాలర్లు చైనాలోని బ్యాంకుకు మూడో బదిలీ జరిగింది.' విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సాయంతో షాంఘై, ఇస్తాంబుల్‌లోని కాన్సులేట్ జనరల్ ద్వారా, నేషనల్ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్(పిఎంఒ) ద్వారా ఆ డబ్బును వెనక్కి తెప్పించేందుకు దౌత్యపరంగా, న్యాయ మార్గాల ద్వారా చర్యలు తీసుకున్నాం' అని కూడా సిటీ యూనియన్ బ్యాంక్ పేర్కొంది. ఈ తాజా ఉదంతం ద సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్‌బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్(స్విఫ్ట్) నెట్‌వర్క్ సామర్థ్యం, రక్షణలపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

దుస్తుల ఎగుమతి తగ్గు ముఖం: ఎఇపిసి



న్యూఢిల్లీ: గత ఏడాదితో పోల్చినప్పుడు ఈ ఏడాది జనవరిలో దుస్తుల ఎగుమతి రూపాయల్లో 14 శాతం(డాలర్లలో 8 శాతం) తగ్గింది. గత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జనవరి మధ్యకాలంలో ఎగుమతులు రూ. 93,745 కోట్లు, కాగా ఈ ఏడాది రూ. 88,709 కోట్లకు పడిపోయింది. అంటే దాదాపు 5 శాతం తగ్గిపోయింది. ' ఈ ఏడాది మొత్తం దుస్తుల ఎగుమతి 17 బిలియన్ డాలర్ల వద్ద ఉండగలదని మేము ఆశిస్తున్నాం' అని దుస్తుల ఎగుమతి ప్రోత్సాహక మండలి(ఎఇపిసి) ప్రతినిధి చెప్పారు. దుస్తుల పరిశ్రమపై ఎక్కువ మంది శ్రామికులు ఆధారపడి జీవిస్తున్నారు. కానీ అనేక సమస్యల కారణంగా దుస్తుల పరిశ్రమ బలహీన పడుతోందని తిరుపూర్ ఎగుమతుల సంఘం అధ్యక్షుడు రాజా షణ్ముగం చెప్పారు. 'కేంద్ర నుంచి రావలసిన రీఫండ్స్ పెండింగ్‌లో ఉన్నప్పటికీ నెలనెలా పరిశ్రమ మాత్రం తప్పక చెల్లింపులు చేయాల్సి వస్తోంది. దీనివల్ల పరిశ్రమ కొట్టుమిట్టాడుతున్నది' అని ఆయన అన్నారు. 'అంతర్జాతీయ మార్కెట్ ఏమంత ఘోరంగాలేదు. కాకిపోతే అంతర్గతంగానే పోటీతత్వం సమస్య ఉంది' అని భారతీయ జౌళి పరిశ్రమ సమాఖ్య చైర్మన్ సంజయ్ కె. జైన్ చెప్పారు. దుస్తుల ఎగుమతే కాకుండా ఇతర జౌళి ఉత్పత్తుల ఎగుమతులు కూడా తగ్గుముఖం పట్టాయన్నారు. 'ఓ పక్క ఎగుమతులు వృద్ధి చెందుతుంటే మరో పక్క దుస్తుల ఎగుమతి తగ్గుతోంది. ఇది ఎగుమతుల ఆదాయంలో ఈ రంగం వాటాను తగ్గించేయనుంది. గత ఏడాదితో పోల్చినప్పుడు ఈ ఏడాది దుస్తులు, జౌళి వార్షిక ఎగుమతి దాదాపు అంతే ఉంది. కానీ నూలు, దుస్తులే కాస్త తగ్గు ముఖం పట్టాయి' అని జైన్ చెప్పారు.

క్యాథలిక్ సిరియన్‌లో ఫెయిర్‌ఫ్యాక్స్‌కు 51%

ముంబయి: కేరళలోని క్యాథలిక్ సిరియన్ బ్యాంక్‌లో 51 శాతం వాటాలను రూ. 140 వాటి ఒక్కింటికి చొప్పున మొత్తం రూ. 578 కోట్ల విలువైన వాటాలను ప్రేమ్ వత్సాకు చెందిన ఫెయిర్ ఫాక్స్ హోల్డింగ్స్ కొనుగోలు చేయబోతున్నది. దీంతో తొలిసారిగా ఓ విదేశీ సంస్థ భారతీయ బ్యాంకును చేయబోతున్నది. అయితే ఈ ఒప్పందానికి వాటాదారులు, రెగ్యులేటర్ల ఆమోదం అవసరం. సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాల్లో క్యాథలిక్ సిరియన్ బ్యాంకు రూ. 13 కోట్లు నష్టాన్ని చూయించింది. అయితే గత ఏడాది ఇదే త్రైమాసిక ఫలితాల్లో రూ. 53 కోట్ల లాభాన్ని చూయించింది. దాని నికర మొండి బాకీలు 6.75 శాతం ఉంది. దాని మూలధన సంపద నిష్పత్తి(క్యాపిటల్ ఎడిక్వసీ) 11.09 శాతంగా ఉంది.

జూన్‌కల్లా 5జి సేవలు



న్యూఢిల్లీ: మొబైల్‌ఫోన్ల 5జి సేవలకు సంబంధించిన ప్రపంచ ప్రమాణాలు ఈ ఏడాదిలోనే తుది రూపు దిద్దుకోగలవని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్ కూడా వాటిని అందిపుచ్చుకునే చర్యలు పారంభించింది. జూన్ నాటికి 5జి సేవలకు సంబంధించిన మార్గసూచీ ఆవిష్కరించనున్నట్లు టెలికామ్ కార్యదర్శి అరుణా సుందరరాజన్ శనివారం అసోచామ్ కార్యక్రమంలో చెప్పారు. 5జి సేవల మార్గసూచీ కోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిన టెలికాంశాఖ.. ప్రపంచవ్యాప్తంగా 5జిసేవలు వాణిజ్యపరంగా అందుబాటులోకి వచ్చే నాటికి భారత్‌లోనూ దాన్ని అందిపుచ్చుకునేలా కసరత్తు చేస్తున్నట్లు తెలిపింది. 5జి సిమ్‌లకు కొత్త నెంబర్ల విధానాన్ని రూపకల్పన చేస్తున్నట్లు, అది మెషిన్ టు మెషిన్(ఎం2ఎం) కమ్యూనికేషన్స్‌కు ఉపయోగించనున్నట్లు టెలికాంశాఖ తెలిపింది. మరో సంవత్సర కాలంలో భారత్‌లో ఈ సామర్థ్యాలు పెరుగనున్నాయని అరుణా సుందరరాజన్ తెలిపారు. మరి కొన్ని నెలల్లో ఎం2ఎంను అమలు చేస్తామన్నారు.

వాంకోవర్‌లో ప్రయోగాత్మకంగా...

చైనా సాంకేతిక దిగ్గజం హువాయ్, కెనడా టెలికామ్ కంపెనీ టెలస్ వాంకోవర్‌లో 'వైర్‌లెస్ టు ద హోమ్' 5 జి సేవలు ప్రయోగాత్మకంగా ఆరంభిస్తున్నట్లు ఈ వారం ప్రకటించాయి. అవి 28 జిహెచ్‌జెడ్ స్పెక్ట్రంలోని 800 మెగాహెడ్జ్ బ్యాండ్‌విడ్త్‌తో పనిచేస్తున్నాయి. ఇంకా ఎఐఎఒ, ఎఫ్–ఒఎఫ్‌డి ఎం, పోలార్ కోడ్, ఇతర సాంకేతికతలను కూడా ఉపయోగిస్తున్నాయి. ఈ ప్రయోగాత్మక పరీక్షలన్నీ 5జి కోసం ప్రత్యేకంగా తయారు చేసిన పరికరాల ద్వారా చేస్తున్నారు. 'వైర్‌లెస్ టు హోమ్' అనేది ఉత్తర అమెరికాలో తొలి ప్రయోగాత్మక పరీక్ష అని ఈ కంపెనీలు చెబుతున్నాయి.

యునిటెక్ భూమి కొనాలంటే 90 కోట్లు డిపాజిట్ చేయండి!

- ఓంశక్తి ఏజెన్సీస్‌కు సుప్రీంకోర్టు ఆదేశం




న్యూఢిల్లీ: వచ్చే నెల 31కల్లా రూ.90 కోట్లు డిపాజిట్ చేయాలని యునిటెక్ భూమిని కొనుగోలు చేయాలనుకుంటున్న సంస్థను సుప్రీం కోర్టు ఆదేశించింది. ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయిన రియల్టీ సంస్థ యునిటెక్‌కు చెన్నైలో ఉన్న రూ.400 కోట్ల విలువైన భూమి కొనుగోలుకు ఓంశక్తి ఏజెన్సీస్ (మద్రాస్) ప్రైవేట్ లిమిటెడ్ అగ్రిమెంట్ కుదుర్చుకుంది. యునిటెక్‌తో అగ్రిమెంట్ ప్రకారం.. వచ్చే ఏడాది జూన్ కల్లా రూ.400 కోట్లు చెల్లించాల్సి ఉందని, అందులో రూ.90 కోట్లు ఈ మార్చి 31కల్లా కట్టాల్సి ఉందని ఓంశక్తి ఏజెన్సీ తరఫున ప్రతినిధి కోర్టుకు వెల్లడించారు. ఆ సొమ్మును కోర్టు వద్ద డిపాజిట్ చేయాలని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎ.ఎం.ఖాన్‌విల్కర్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది.

దేశీయ విమానాల రద్దీ 20 శాతం పెరుగుదల



న్యూఢిల్లీ: దేశీయ విమానయాన ప్రయాణికుల రాకపోకల రద్దీ ఈ ఏడాది జనవరిలో 20 శాతం పెరిగింది. గత నెల విమాన సంస్థలు 1.14 కోట్లకు పైగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చాయి. 2018 సంవత్సరానికి ఇది అందమైన ఆరంభం(లవ్లీ స్టార్ట్) అని పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రా జు అభివర్ణించారు. ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెం దుతున్న విమాన మార్కెట్ మనదేనని ఆయన ట్వీట్ చే శారు. గత ఏడాది జనవరిలో 95.79 లక్షల మంది వి మానాల ద్వారా ప్రయాణం చేయగా, ఈసారి అదే నెలలో సంఖ్య 19.69 శాతం పెరిగి కోటి పధ్నాలుగు లక్షలకు చేరుకుందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) డేటా విడుదల చేసింది. విమానయాన సేవల్లో ఇండిగో మార్కెట్ షేరు అత్యధికంగా 39.7 శాతంగా నమోదైంది. ప్రభుత్వ రంగ విమాన సం స్థ ఎయిర్ ఇండియా మార్కెట్ వాటా 13.3 శాతంగా నమోదైంది. ఇక జెట్‌ఎయిర్‌వేస్ 14.3 శాతం, స్పైస్‌జెట్ 12.6 శాతం, గోఎయిర్ 9.6 శాతంగా ఉంది. విమాన ప్రయాణాల్లో ఆలస్యం కారణంగా గతనెలలో 3.14 లక్షల మంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.17, 425 మందిపై రద్దు కారణంగా ప్రభావం పడింది.

విమానాశ్రయాలకు రూ. 15వేల కోట్ల పెట్టుబడి




పనాజి: ఉన్న విమానాశ్రయాల విస్తరణకు, కొత్తవి నిర్మించేందుకు 2018–19 ఆర్థిక సంవత్సరంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఎఐ) రూ. 15,000 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నది. దేశంలోని అన్ని విమానాశ్రయాల్లోని భవన సముదాయాల్లో అదనపు వసతులు కల్పించాలని విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (అథారిటీ) నిర్ణయించిందని ఎఎఐ ఛైర్మన్ గురుప్రసాద్ మహాపాత్ర చెప్పారు. డాబోలిమ్ విమానాశ్రయంలోని ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్స్ కంట్రోల్ సెంటర్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ ' మన అన్ని విమానాశ్రయ భవనాల్లో అదనపు వసతులు కల్పించనున్నాము. 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ. 15,000 కోట పెట్టుబడితో విమానాశ్రయ భవన ప్రాజెక్టులు చేపడతాం' అని అన్నారు. '2019లో ఎఎఐ కొత్తగా 15 విమానాశ్రయ భవనాలు నిర్మించనుంది' అని కూడా ఆయన తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో టేజూ విమానాశ్రయంతో పాటు రూ. 650 కోట్లతో నిర్మించిన సిక్కింలోని పాక్యాంగ్ కొత్త విమానాశ్రయం కూడా పూర్తయిందని, ఈ రెండు విమానాశ్రయాలు త్వరలో పనిచేయడం మొదలవుతుందని మహాపాత్ర తెలిపారు. పశ్చిమ ఒడిశాలోని ఝార్సుగూడ విమానాశ్రయాన్ని రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించామని, దానిని ఏప్రిల్‌లో ప్రారంభించనున్నామని మహాపాత్ర చెప్పారు. నవీ ముంబయి విమానాశ్రయానికి త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. గ్రేటర్ నోయిడాలో జెవార్ వద్ద విమానాశ్రయం నిర్మించే ఆలోన ఇంకా ప్రణాళిక దశలోనే ఉందని తెలిపారు. గోవాలో మోపా వద్ద గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం పనులు కొనసాగుతన్నాయన్నారు. అదే మాదిరి విమానాశ్రయంను ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో నిర్మించాలనుకుంటున్నామన్నారు. 'కోల్‌కతా, చైన్నైల్లో రెండో విమానాశ్రయాలు నిర్మించే విషయం గురించి మేము తీవ్రంగా యోచిస్తున్నాం' అని కూడా ఆయన తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్ వద్ద ఉన్న అతి చిన్న విమానాశ్రయాన్ని విస్తరించే పనులు చేపట్టారు. దాని మొదటి దశ పనులు 2019 ఫిబ్రవరి నాటికి ముగియనున్నాయి. 2019 ఫిబ్రవరిలో జరిగే అర్థ్ కుంభ మేళ సమయానికి దానిని పూర్తిచేయాలనుకుంటున్నారు. ఆ నిర్మాణం పనులను సవాలుగా తీసుకుని 11 నెలల్లో పూర్తి చేయాలనుకుంటునట్లు ఆయన చెప్పారు. అలహాబాద్ విమానాశ్రయాన్ని రూ. 100 కోట్లతో విస్తరిస్తున్నారు. దానిని రెండు దశల్లో విస్తరించనున్నారు.

ప్రధాని మోడీ సూచనతోనే పళని వర్గంలో విలీనం : పన్నీర్



థేని/చెన్నై : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సూచనతోనే తాను ముఖ్యమంత్రి పళనిస్వామి చీలికవర్గంలో విలీనమైనట్టు ఉప ముఖ్యమంత్రి ఓ.పన్నీరు సెల్వం తెలిపారు. గత ఏడాది ఆయన పళనిస్వామి వర్గంలో పన్నీరు సెల్వం విలీనమైన విషయం తెలిసిందే. శుక్రవారం థేనిలో జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో జరిగిన మర్యాదపూర్వక సమావేశం సందర్భంగా ఈ అంశం చర్చకు వచ్చిందని వెల్లడించారు. 'పార్టీని కాపాడాలంటే మీరు (పన్నీరు సెల్వం) చేరాలి (చీలికవర్గంలో విలీనం) అని ఆయన (మోడీ) చెప్పారు' అని పేర్కొన్నారు. అయితే ఈ సమావేశం ఎప్పుడు జరిగిందనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. పళనిస్వామి నేతృత్వంలోని మంత్రివర్గంలో తనను చేరాలని మోడీ సూచించినట్టు తెలిపారు. 'అందుకే నేను ఇప్పుడు మంత్రిగా ఉన్నాను. నాకు మంత్రి అవ్వాలనే ఆసక్తి లేదు. అమ్మ (జయలలిత) నన్ను నాలుగు సార్లు ఎంఎల్ఎగా, రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేసింది. నాకు దక్కిన ఈ గౌరవం చాలు' అని చెప్పారు. తనను వచ్చిన సమస్యలు, సంక్షోభం ఇంకెవరికైనా వచ్చుంటే వారు ఆత్మహత్య చేసుకోవడమో, పార్టీని వదిలిపోవడమో చేసేవారు. కాని, నేను అమ్మ కోసం అన్నింటినీ భరించా' అని పేర్కొన్నారు.




గ్యాస్ సిలిండర్ పేలి 9మంది మృతి

జైపూర్: రాజస్థాన్‌లో ఘోర విషాదం చోటు చేసుకుంది. పెళ్లింట్లో వంట గ్యాస్ సిలిండర్ పేలి తొమ్మిది మంది సజీవ దహనమయ్యారు. ఈ ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. శనివారంనాడు బీవర్ ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రులలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. వంట చేస్తున్న సమయంలో వంట సిబ్బంది నిర్లక్ష్యంగా కారణంగానే పేలుడు సంభవించినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని వివరించారు. వంట చేస్తుండగా ఒక సిలిండర్ పేలిందని, దాని పక్కనే సిద్ధంగా ఉంచుకున్న మరో నిండు సిలిండర్ కూడా దీని దాటికి పేలిపోవడం ప్రమాద తీవ్రత పెరిగిందన్నారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. క్షతగాత్రులను హుటాహుటిన ఆస్పత్రులకు తరలించారు.

విద్యుదాఘాతానికి నలుగురు మృతి

లూధియాన : పంజాబ్‌లోని లూధియానలో దారుణం జరిగింది. ధందారికి పొరుగున ఉన్న ఇశ్వార్ కాలనీలో నలుగురు వ్యక్తులు విద్యుదాఘాతానికి గురై దుర్మరణం చెందారు. శుక్రవారం రాత్రి రంజిత్ సింగ్ (27) కుమార్తె (8) పుట్టిన రోజు వేడుకలను కుటుంబ సభ్యులంతా జరుపుకుంటుండగా ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. పుట్టినరోజు కేక్‌ను కట్ చేసిన అనంతరం రంజిత్ సింగ్ సహా నలుగురు వ్యక్తులు మద్యం సేవించేందుకు డాబాపైకి వెళ్లారు. అనంతరం ఓ అంశంపై వారి మధ్య వాగ్వాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో ఉన్న రంజిత్‌సింగ్‌కు ఇంటి గోడ పక్క నుంచి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ వైర్ తగిలింది. వెంటనే కాపాడండీ అని ఏడుస్తూ కేకలు వేయడంతో మిగతా ముగ్గురు అతన్ని రక్షించేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

బిమల్ గురుంగ్‌కు రక్షణ కల్పిస్తా



జల్‌పైగురి : పరారీలో ఉన్న గూర్ఖాలాండ్ ఉద్యమనేత, గూర్ఖా జనముక్తి మోర్చా (జిజెఎం) చీఫ్ బిమల్ గురుంగ్‌కు తాను రక్షణ కల్పిస్తానని కేంద్రమంత్రి ఎస్ఎస్ అహ్లువాలియా ప్రకటించారు. అతన్ని పట్టుకునేందుకు ఏ సంస్థకు కూడా అనుమతివ్వబోనన్నారు. గురుంగ్‌కు తానెప్పుడూ అండగా ఉంటానని, భవిష్యత్తులోనూ అతనికి రక్షణ కల్పిస్తానన్నారు. డార్జిలింగ్ పార్లమెంట్ సభ్యుడైన అహ్లువాలియా మటిగరలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గురుంగ్‌ను పట్టుకునేందుకు ఏ ఏజెన్సీకి కూడా అనుమతి ఇవ్వనని, ఒక వేళ ఎవరికైనా అలాంటి ఆలోచన వస్తే గురుంగ్‌కు తానే స్వయంగా ఆశ్రయం కల్పిస్తానని పేర్కొన్నారు. డార్జిలింగ్‌లో ఎలాంటి అశాంతి చెలరేగినా దానికి కారణం బిజెపేనని విమర్శించడం ఆనవాయితీగా మారిందని, అందువల్లే ఇటీవల అశాంతి నెలకొన్న సమయంలో తాను అక్కడికి వెళ్లకపోవడానికి కారణమన్నారు. డార్జిలింగ్ సమస్య పరిష్కారానికి త్రైపాక్షిక చర్చలు జరిపేందుకు తాను సుముఖంగా ఉన్నానని కేంద్రమంత్రి వెల్లడించారు. ఇదిలా ఉండగా గత ఏడాది జూన్‌లో డార్జిలింగ్‌లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి.

సెల్ఫీ మోజులో యువకుడు మృతి

ముజఫర్‌పూర్ : సెల్ఫీ మోజులో పడి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. తాజాగా బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఓ 22 ఏళ్ల యువకుడు గూడ్స్ రైలు పైకి ఎక్కి సెల్ఫీ తీసుకుంటుండగా పై భాగంలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైరు తగిలింది. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే సజీవ దహనమయ్యాడు. ముజఫర్‌పూర్ పట్టణ సమీపంలో ఉన్న సికిందర్‌పూర్‌లో నివసించే రోహన్ కుమార్ శుక్రవారం సాయంత్రం నారాయణపూర్ అనంత్ రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలు పైకి ఎక్కగా ఈ విషాద ఘటన జరిగినట్లు పభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ హౌస్ అధికారి అచ్చేలాలసింగ్ యాదవ్ పేర్కొన్నారు. రైలుపై సెల్ఫీ తీసుకుంటున్న సమయంలో 30 వేల కిలో ఓల్ట్స్ గల హైటెన్షన్ వైరు తగిలిందన్నారు. విద్యుత్ ప్రవాహం ఎక్కువగా ఉండడంతో మంటలు చెలరేగాయని, దీంతో రోహన్ కుమార్ అక్కడికక్కడే దుర్మరణం పాలైనట్లు యాదవ్ చెప్పారు.

వెయ్యి మంది విద్యార్థుల బహిష్కరణ

పాట్నా: బీహార్‌లో 12వ తరగతి పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన దాదాపు వెయ్యి మంది విద్యార్థులను బహిష్కరించామని అధికారులు తెలిపారు. శనివారం పాట్నాలో బీహార్ స్కూల్ ఎగ్జామినేషన్ బోర్డు (బిఎస్ఇబి) ఛైర్మన్ ఆనంద్ కిశోర్ విలేకరులతో మాట్లాడుతూ పరీక్షల్లో మోసాలకు పాల్పడిన వారిని బహిష్కరించామని తెలిపారు. ఈసారి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది 12వ తరగతి పరీక్షలకు 1,12,07,986 మంది హాజరయ్యారు. బీహార్‌లో సామూహిక మాస్‌కాపీయింగ్‌కు పాల్పడటం గతానికి సంబంధించిందని, ప్రస్తుతం అది అసాధ్యమన్నారు. అనేక సంవత్సరాలుగా బీహార్‌లో మాస్ ఛీటింగ్ జరుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. గత ఏడాది తప్పుడు ధ్రువీకణ పత్రంతో 42 ఏళ్ల వ్యక్తి 12వ తరగతి పరీక్షలను రాశారు. మోసానికి పాల్పడినందుకు గానూ ఆయనను అరెస్ట్ చేశారు.

వీధి వ్యాపారులకు వెండింగ్ జోన్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : వీధి వ్యాపారులకు వెండింగ్ జోన్లను త్వరలోనే తెలియపరుస్తామని రాష్ట్ర ప్రభుత్వం శనివారం నాడు హైకోర్టుకు తెలిపింది. రాష్ట్రంలో వీధి వ్యాపారులకు సంబంధించిన సర్వే చివరి దశలో ఉందని, ఇది పూర్తయిన వెంటనే వీధి వ్యాపారాల ప్రణాళికను రూపొందిస్తామని పేర్కొంది. రాష్ట్ర రాజధాని సహా రాష్ట్రం మొత్తంలో ఇప్పటి వరకు 67,313 మంది వీధి వ్యాపారులున్నట్టు గుర్తించామని, సర్వే ఇంకా జరుగుతోందని ప్రభుత్వం కోర్టుకు తెలియజేసింది. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మూడు రకాలుగా జోన్లను గుర్తించనున్నట్టు వెల్లడించింది. వ్యాపార అనుకూల జోన్, పరిమిత వ్యాపార జోన్, నిషేధిత వ్యాపార జోన్‌లుగా వాటిని వర్గీకరించనున్నట్టు తెలిపింది. వీధి వ్యాపారులకు సంబంధించిన చట్టాన్ని అమలు చేయకుండా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై నిమ్స్ హాస్పిటల్ వద్ద వీధి వ్యాపారి జి.గణేష్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఆదేశాలకు మేరకు రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్‌ను సమర్పించింది. ఇందులో ఈ విషయాలను వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో 63,372 మంది వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేసిందని ప్రభుత్వం తరపు న్యాయవాది ఎ.సంజీవ్ కుమార్ ఈ సందర్భంగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనానికి తెలియజేశారు.

గోకుల్ రిటైర్మెంట్‌తో గుట్టురట్టు

ముంబై : గోకుల్‌నాథ్ శెట్టి రిటైర్మెంట్ కాస్తా నీరవ్ మోడీ మోసాల గుట్టురట్టుకు దారితీసింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)ని కోట్లాది రూపాయల మేర వజ్రాల వ్యాపారి, సంపన్నుడు నీరవ్ ముంచేసిన విషయం తెలిసిందే. పిఎన్‌బి ముంబై శాఖలో డిప్యూటీ మేనేజర్‌గా గోకుల్‌నాథ్ ఉన్న సమయంలోనే నీరవ్ కంపెనీ అక్రమ లావాదేవీలకు మార్గం ఏర్పడింది. ప్రస్తుతం వేల కోట్ల రూపాయల పిఎన్‌బి స్కాంలో గోకుల్‌నాథ్ నిందితుడుగా ఉన్నారు. ఆయన తన హోదాలో నీరవ్ కంపెనీ నుంచి దండిగా ముడుపులు తీసుకుని లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఒయు)లను జారీ చేశారు. ఈ ' లో' లెటర్‌లు నీరవ్‌కు రుణాలు పొందడానికి వజ్రాలుగా మారాయి. వీటిని యథేచ్ఛగా వాడుకుని రుణాలు అడ్డగోలుగా పొందడంలో నీరవ్ కంపెనీ చాలా వరకూ విజయం దక్కించుకుంది. అయితే ఎప్పుడైతే గోకుల్ రిటైర్ అయ్యాడో కంపెనీ వారికి పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్లు అయింది. ఈ ఏడాది జనవరి 16న నీరవ్ కంపెనీ వారు మరోమారు ఎల్‌ఒయుల గురించి బ్యాంకుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే డిప్యూటీ మేనేజర్‌గా వేరే వారు ఉండటంతో నిర్థిష్ట నిబంధనల విషయం ప్రస్తావనకు వచ్చింది. బ్యాంకు అధికారులు ఈసారి ఈ లెటర్స్ జారీకి నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని తెలిపారు. అయితే మునుపటి మాదిరిగానే బ్యాంకు అధికారిని ప్రసన్నం చేసుకోవడానికి నీరవ్ చేసిన యత్నాలు ఫలించలేదు. బ్యాంకులో డిపాజిట్‌గా వందశాతం డబ్బును చూపెట్టాల్సిందేనని లేకపోతే ఈ పత్రాలు ఇచ్చే అవకాశం లేనేలేదని కొత్త అధికారి నీరవ్‌కు స్పష్టం చేశారు.



చేసేది తప్పు పైగా దబాయింపు

గతంలో ఎల్‌ఒయుల కోసం డబ్బులు ఏవీ మదుపుగా పెట్టలేదని, అంతా సజావుగా సాగిందని నీరవ్ కంపెనీ వారు వాదించారు. దీనితో కొత్త మేనేజర్‌కు అనుమానం వచ్చి ఎల్‌ఒయుల జారీలో ఏదో గోల్‌మాల్ జరిగిందని పసికట్టారు. వెంటనే పాత ఫైళ్లు తిరగదోడి జరిగిన వ్యవహారం గురించి నిజాలు రాబట్టేందుకు యత్నించారు. గోకుల్ డిప్యూటీ మేనేజర్‌గా ఉన్నప్పుడు అందినంతగా తీసుకుని నీరవ్ కంపెనీ వారికి వీలైనన్ని ఎల్‌ఒయులు ఇస్తూ వచ్చారు. అక్రమంగా అయినా ఈ పత్రాలు సదరు కంపెనీ వారికి ఇవ్వడంలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు తరువాత అంటే ఆయన పదవీ విరమణ తరువాత వెల్లడైంది. ఆయన హయాంలో కంపెనీకి ఇచ్చిన పలు ఎల్‌ఒయులతోనే కంపెనీ వారు అలహాబాద్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ విదేశీ శాఖల ద్వారా అక్రమ పద్ధతులలో రూపాయలు 280 కోట్లకు పైగా రుణాలు దక్కించుకున్నారు. ఇదంతా కూడా గోకుల్ సారథ్యంలో గుట్టుచప్పుడు కాకుండా సాగింది. అయితే ఆయన పదవి కాలం ముగిసిన తరువాత బండారం బయటపడింది. ఇప్పుడు నీరవ్ కేసులో శెట్టిని నిందితుడిగా చేర్చారు. శెట్టిపై ఇతరులపై సిబిఐకి ఫిర్యాదు అందింది. ఇందులో పొందుపర్చిన సమాచారం మేరకు శెట్టి తన పదవిని వినియోగించుకుని నీరవ్ కంపెనీకి ఇతర బ్యాంకుల నుంచి సత్వర రుణాలు అందేలా స్విఫ్ట్ ఇన్‌స్ట్రక్షన్స్ కూడా పంపించారు. నిబంధనలతో పనిలేకుండా పిఎన్‌బిలోని నాస్ట్రో అకౌంట్స్‌కు వీలైనన్ని రుణాలు జారీ చేయాలని కూడా శెట్టి ఆదేశాలు వెలువరించినట్లు ఈ ఫిర్యాదులో తెలిపారు. దేశవ్యాప్తంగా నీరవ్ ఆస్తులపై సోదాలు జరుగుతున్నాయి.

సిబిఐ అదుపులో ఇద్దరు



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా నీరవ్ మోడీ స్కామ్ ప్రకంపనలు చెలరేగడంతో సిబిఐ దర్యాప్తు వేగవంతం అయింది. శనివారం సిబిఐ అధికారులు రంగంలోకి దిగి పిఎన్‌బికి చెందిన ఇద్దరు అధికారులను అరెస్టు చేశారు. ఇందులో రిటైర్డ్ డిప్యూటీ మేనేజర్ గోఖుల్‌నాథ్ శెట్టి కూడా ఉన్నారు. ఇక బిలియనీర్ నీరవ్ కంపెనీ ఆథారైజ్డ్ సిగ్నేటరీ కూడా అరెస్టు అయినట్లు అధికారులు తెలిపారు. రూ 11,400 కోట్ల అక్రమ లావాదేవీలకు సంబంధించి అరెస్టులు జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అరెస్టు అయిన వారిలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ సింగిల్ విండో ఆపరేటర్ మనోజ్ ఖారత్, నీరవ్ సంస్థ ప్రముఖుడు హేమంత్ భట్ ఉన్నట్లు వెల్లడైంది. శెట్టి, ఖారత్‌లు కంపెనీతో కుమ్మక్కు అయి ఏకంగా రూ 6,498 కోట్ల విలువైన ఎల్‌ఒయులను జారీ చేసినట్లు ఎఫ్‌ఐఆర్ ద్వారా వెల్లడైంది. వీరు 150 లెటర్స్‌ను కంపెనీ కి ఇచ్చినట్లు గుర్తించారు. తొలుత రూ 280 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్లు తేలింది. అయితే బ్యాంకు నుంచి తరువాతి స్థాయిలో అందిన ఫిర్యాదుతో ఈ మొత్తం మరింత ఎక్కువగా ఉంటుందని నిర్ధారించినట్లు సిబిఐ అధికారులు తెలిపారు. గీతాంజలి గ్రూప్ ఆఫ్ కంపెనీలకు మిగిలిన 150 ఎల్‌ఒయులను అక్రమంగా జారీ చేసినట్లు గుర్తించారు. వీటి విలువ రూ 4,886 కోట్ల మేరకు ఉంటుంది. ఒక్కరోజు క్రితం దాఖలు అయిన రెండో ఎఫ్‌ఐఆర్ ద్వారా ఈ విషయం స్పష్టం అయింది.

వాచ్‌మెన్ నిద్రపోతున్నారా?

నీరవ్ స్కామ్‌లో మోడీపై కాంగ్రెస్ ధ్వజం



న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, బిజెపిలు దేశంలో సంపన్న పెట్టుబడిదారులకు కాక పడుతున్నాయని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. భారీ స్థాయి క్రోనీ క్యాపిటలిజానికి బిజెపి బాధ్యత వహించాలని, మోడీ హయాంలోనే ఎక్కువగా సంపన్న వర్గాలకు మరింతగా మేలు జరుగుతోందని పార్టీ ఆరోపించింది. నీరవ్ మోడీ స్కామ్ నేపథ్యంలో శనివారం కాంగ్రెస్ నాయకులు కపిల్ సిబల్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఒక దాని వెంట ఒకటిగా జరుగుతున్న పరిణామాలతో అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోందని , ఇది తమ పార్టీకి ఆందోళన కల్గిస్తోందని తెలిపారు. తాను దేశానికి కాపలాదారుడిని, సెంట్రీని అంటూ చెప్పిన ప్రధాని దోపిడి దొంగలు దేశాన్ని దాటి పోతూ ఉంటే గురక పెట్టి నిద్రపోతున్నారా? అని ప్రశ్నించారు. వాచ్‌మెన్ సరిగ్గా లేకపోవడంతోనే అనర్థాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. నీరవ్ స్కామ్‌లో రెండో ఎఫ్‌ఐఆర్‌ను సిబిఐ దాఖలు చేసిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నేత ప్రస్తావించారు.బ్యాంకులను బడా వ్యాపారులు దోచుకునేలా చేయడమే మోడీ ప్రభుత్వం చెపుతోన్న వ్యాపార సరళీకృత విధానమా? అని కాంగ్రెస్ నేతలు నిలదీశారు.

యుపిఎ హయాంలోనే నీరవ్ పాపం

కాంగ్రెస్‌పై రక్షణ మంత్రి దాడి



న్యూఢిల్లీ : పిఎన్‌బి స్కామ్‌కు కాంగ్రెస్ కారణం అని, ఈ వ్యవహారం యుపిఎ హయాంలోనే జరిగిందని బిజెపి ఎదురుదాడికి దిగింది. ఈ అంశంపై శనివారం రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. మోడీ ప్రభుత్వ హయాంలోనే 2017లో నీరవ్ స్కామ్ జరిగినట్లు కాంగ్రెస్ ఆరోపించడం అసత్యం అని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. స్కామ్‌ను పసికట్టి వెంటనే దర్యాప్తు చేపట్టారని, నీరవ్ మోడీ దేశం విడిచి పెట్టి వెళ్లినా , ఆయనపై చట్టపరమైన అన్ని చర్యలకూ ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందని నిర్మలా సీతారామన్ తెలిపారు. నీరవ్ మోడీకి చెందిన గీతాంజలి జెమ్స్ కంపెనీ అక్రమాలు 2013లో వెలుగులోకి వచ్చాయని, అప్పట్లోనే అలహాబాద్ బ్యాంక్ డైరెక్టర్ గీతాంజలి జెమ్స్‌కు ఆర్థిక చేయూతను వ్యతిరేకించారని, అయితే ఆయనతో రాజీనామాకు ఒత్తిడి తెచ్చారని, దీనితో అంతర్గత వ్యవహారాలను తొక్కిపెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోనే అంతా జరిగిందని చెప్పడానికి పలు ఆధారాలు ఉన్నాయని నిర్మల తెలిపారు.

భారత్-ఇరాన్ నవబంధం

ఇరు దేశాల మధ్య 9ఒప్పందాలు

భారత్‌కు 'చాబహార్'పై కంట్రోల్





ఢిల్లీలో శనివారంనాడు ఇరాన్ అధ్యక్షుడు రౌహానికి స్వాగతం పలికిన రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోడీ, ఇరుదేశాల నేతల సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న విదేశాంగ మంత్రులు

ఫొటోలు : ఎస్.ఎన్. సిన్హా

న్యూఢిల్లీ : ఛాబహార్ పోర్టుకు సంబంధించి భారత్, ఇరాన్ మధ్య అత్యంత కీలకమైన ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న ఇరాన్ అధ్యక్షులు హస్సన్ రౌహానీ, ప్రధాని మోడీ చర్చల తరువాత కుదిరిన తొమ్మిది ఒప్పందాలలో చాబహార్ పోర్టుకు సంబంధించిన ఒప్పందం కీలకంగా మారింది. దీని మేరకు ఈ పోర్టులో కొంత భాగంపై భారత్‌కు 18 నెలల పాటు నిర్వాహక అధికారాలు ఉంటాయి. భద్రతాపరంగా అత్యంత ప్రధానమైన ఒమన్ గల్ఫ్ ప్రాంతంలో ఈ రేవు పట్టణం నెలకొని ఉంది. ఇరు దేశాల మధ్య తొమ్మిది ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ప్రాంతీయ అనుసంధానం, ద్వైపాక్షిక వ్యాపారం, పెట్టుబడుల అంశాలపై ఇరు దేశాల నేతల మధ్య శనివారం విస్తృతస్థాయి చర్చలు జరిగాయి. చమురు ఇంధన రంగాలకు సంబంధించి కూడా ఇరు దేశాల నేతలు సమాలోచనలు జరిపారు. ఉగ్రవాదం ఆటకట్టుకు సమిష్టి సమగ్ర ప్రపంచ స్థాయి కార్యాచరణకు దిగాల్సి ఉందని ఇరాన్, ఇండియాలు పిలుపు నిచ్చాయి. ప్రపంచానికి సవాలుగా మారిన అంశంపై ఎవరికి వారుగా వ్యవహరించడం వల్ల ప్రయోజనం లేదని రెండు దేశాలు స్పష్టం చేశాయి. రౌహానీ, ప్రధాని మోడీతో జరిపిన చర్చలలో ప్రధానంగా ఉగ్రవాదం అంశం ప్రస్తావనకు వచ్చింది. ఉగ్రవాదం, తీవ్రవాదం ఆటకట్టులో ఇరుదేశాలకూ ఉమ్మడి దృక్పథం ఉందని రౌహానీ తెలిపారు. ఉగ్రవాదులనే కాకుండా వారికి వత్తాసు పలికే , రెచ్చగొట్టే దేశాలను కూడా వెలివేయాల్సి ఉందని వారి చేష్టలను ఖండించాల్సి ఉందని రెండుదేశాల నేతలు తెలిపారు. ఉగ్రవాద రహిత ప్రపంచం కావాలని తాము కోరుకుంటున్నట్లు , ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తుల విస్తరణను అరికట్టేందుకు కట్టుబడి ఉంటామని వెల్లడించారు. ఇరువురు నేతల భేటీ తరువాత కీలకమైన సంయుక్త ప్రకటన వెలువడింది. ఉగ్రవాదులను ఏరివేయడం, తీవ్రవాదాన్ని రూపుమాపడంతో ఆగకుండా ఉగ్రవాదం ఎట్టి పరిస్థితుల్లోనూ తలెత్తకుండా సరైన వాతావరణం నెలకొనేలా చేయాల్సి ఉందని రెండు దేశాల నేతలు తెలిపారు. సంస్కృతి, సమాచార, స్వానుభవాల వినిమయం ద్వారా ఉగ్రవాదం ఆటకట్టుకు అన్ని చర్యలూ తీసుకుంటామని తెలిపారు. భద్రతా మండలిలో భారత్‌కు స్థానంపై తమదేశం మద్దతు ఉంటుందని రౌహానీ తెలిపారు. శనివారం ఇరాన్ నేతకు రాష్ట్రపతిభవన్ వద్ద ఘనస్వాగతం పలికారు. తరువాత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ఇరాన్ నేతతో చర్చలు జరిపారు.

బోగీలపై రిజర్వేషన్ జాబితాలు అంటించొద్దు

మార్చి 1నుంచి పైలట్ ప్రాజెక్టుగా అమలు




న్యూఢిల్లీ: ఇక నుంచి బోగీలపై రిజర్వేషన్ జాబితాను అతికించొద్దని రైల్వే శాఖ జోనల్ రైల్వేలను ఆదేశించింది. మార్చి1 నుంచి పైలట్ ప్రాజెక్టులో భాగంగా దీనిని ఆరు నెలల పాటు అమలు చేయనున్నారు. ఎ1, ఎ, బి శ్రేణి స్టేషన్లలో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.అయితే రైల్వేస్టేషన్లలోని చార్ట్ బోర్డులపై రిజర్వేషన్ జాబితాను అతికించడం యధావిధిగా కొనసాగుతుందని మంత్రిత్వశాఖ తెలిపింది. అన్ని సౌకర్యాలున్న స్టేషన్లలో ఎలెక్ట్రానిక్ ప్లాస్మాలో కూడా రిజర్వేజన్ జాబితాను ప్రదర్శిస్తారని తెలిపింది. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్, ముంబై సెంట్రల్, చెన్నై సెంట్రల్, హౌరా, సీల్దా స్టేషన్లలో బోగీలపై రిజర్వేషన్ జాబితాలు అతికించడం నిలిపివేశారు. దీనిని మూడు నెలల పాటు ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఫిబ్రవరి 13న తాజాగా బోగీలపై రిజర్వేషన్ జాబితాను అతికించొద్దని రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది. కాగా, అన్ని స్టేషన్లలో ఎలెక్ట్రానిక్ ట్యాబ్‌ను ప్రదర్శించాలని పేర్కొంది. ఒకవేళ అవి పనిచేయనట్లైతే వెంటనే రిజర్వేషన్ జాబితాను అతికించేందుకు సిద్ధంగా ఉంచాలని ఆదేశించింది.

వచ్చే నెలలో కాంగ్రెస్ ప్లీనరీ
కొత్త సిడబ్ల్యుసి ఏర్పాటుకు వీలు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సెషన్ వచ్చే నెల 16,17,18 తేదీలలో దేశ రాజధానిలో జరుగుతుంది. ఈ విషయాన్ని పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి రణదీప్ సింగ్ సూర్జేవాలా తెలిపారు. కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ శనివారం జరిపిన భేటీలో ఈ తేదీలను ఖరారు చేసిందని ఆయన వివరించారు. కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ భేటీ జరిగింది. వర్కింగ్ కమిటీని రద్దు చేసిన తరువాత ఏర్పాటు అయిన స్టీరింగ్ కమిటీ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. స్టీరింగ్ కమిటీ సమావేశంలో సోనియా, మన్మోహన్, మల్లిఖార్జున ఖర్గే, ఆంటోనీ, అహ్మద్ పటేల్, గులాం నబీ ఆజాద్ ఇతరులు పాల్గొన్నారని పార్టీ ప్రతినిధి విలేకరులకు తెలిపారు. వచ్చే నెలలో జరిగే ప్లీనరీకి ఎఐసిసి డెలిగేట్లు హాజరు అవుతారు. రద్దు అయిన వర్కింగ్ కమిటీలోని సభ్యులు అంతా నూతన స్టీరింగ్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు శాశ్వత ఆహ్వానితులుగా అమరీందర్ సింగ్, విలాస్ ముత్తేంవార్, ఆర్‌కె ధావన్, శివాజీరావు దేశ్‌ముఖ్, ఎంవి రాజశేఖరన్, మోహిసినా కిద్వాయ్ ఉంటారు. అయితే కొత్త కార్యవర్గంలో ప్రత్యేక ఆహ్వానితులకు చోటు కల్పించలేదు. పార్టీ సంవిధానం మేరకు సిడబ్ల్యుసిలో పాతిక మంది సభ్యులు ఉండేవారు. వీరిలో 12 మంది ఎన్నుకోబడ్డ సభ్యులు , 11 మంది నామినేటెడ్ సభ్యులు, వారితో పాటు కాంగ్రెస్ అధ్యక్షులు, పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సభ్యులుగా ఉన్నారు. నూతన సిడబ్ల్యుసి సభ్యులను పార్టీ ప్లీనరీలో కానీ తరువాత కానీ ఎన్నుకుంటారని పార్టీ ప్రతినిధి తెలిపారు. పార్టీ అధ్యక్షులు రాహుల్ వర్కింగ్ కమిటీని రద్దు చేసి, నూతన కమిటీ ఏర్పాటు అయ్యే వరకూ బాధ్యతలు నిర్వహించేందుకు 34 మంది సభ్యుల స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు.

నేడు త్రిపురలో పోలింగ్



అగర్తల : గత 25 సంవత్సరాలుగా రాష్ట్రాన్ని ఏలుతున్న అధికార వామపక్ష ఫ్రంట్‌కు బిజెపి ఛాలెంజ్‌గా మారిన నేపథ్యంలో త్రిపురలో ఆదివారం ఎన్నికలు జరుగబోతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 60 స్థానాలకు గాను 59 స్థానాల్లో ఎన్నికలు జరుగుతాయి. ఐదు రోజుల క్రితం సిపిఐ(ఎం) ఎంఎల్‌ఎ రమేంద్ర నారాయణ్ దేబ్ బర్మ చనిపోవడంతో చారిలం అసెంబ్లీ నియోజకవర్గానికి మార్చి 12న ఎన్నిక నిర్వహించనున్నారు. మొత్తం స్థానాల్లో 20 స్థానాలను ఎస్‌టిలకు రిజర్వు చేశారు. కాగా, ఇప్పటికే బిజెపి ఇక్కడ విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాలుగు ర్యాలీలు నిర్వహించి, బహిరంగ సభల్లో ప్రసంగించారు. ఇందులో ఆ పార్టీ అగ్రనేతలైన పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అరుణ్ జైట్లీ, నితిన్ గడ్కరీ, స్మృతి ఇరానీ, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లు కూడా పాల్గొన్నారు. ఐదో విడత ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మాణిక్ సర్కార్ సిపిఐ (ఎం) ఎన్నికల ప్రచారానికి నేతృత్వం వహించారు. 50 పైగా ర్యాలీల్లో ప్రసంగించారు. ఇతర వామపక్ష నేతలు సీతారాం ఏచూరి, బృందా కారత్‌లు కూడా ఈ ప్రచారానికి మద్దతుగా నిలిచారు. అగర్తలకు 180 కిలోమీటర్ల దూరంలోని ఉనకోటి జిల్లా కైలాస్‌హర్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చివరిరోజున నిర్వహించిన ర్యాలీతో ఎన్నికల ప్రచారం ముగిసింది. మొత్తం 307 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. సిపిఐ(ఎం) 57 స్థానాల్లో పోటీలో ఉండగా, ఇతర వామపక్ష నియోజకవర్గాల్లో ఆర్‌ఎస్‌పి, ఫార్వార్డ్ బ్లాక్, సిపిఐలు ఒక్కొక్క స్థానంలో బరిలో ఉన్నాయి. కాగా, ఇండిజనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి)తో బిజెపి ఎన్నికల పొత్తు కుదుర్చుకుంది. ఈ మేరకు బిజెపి 51 స్థానాల్లోనూ, మిగతా స్థానాల్లో ఐపిఎఫ్‌టి పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ 59 స్థానాల్లో ఒంటరిగానే పోటీకి దిగుతోంది.



కిమ్‌తో శిఖరాగ్ర చర్చల దశ రాలేదు : మూన్

పోంగ్ చాంగ్: ఉత్తర కొరియాతో శిఖరాగ్ర సమావేశానికి సమయం రాలేదని దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జె ఇన్ శనివారం నాడు అన్నారు. అయితే ఒలింపిక్ క్రీడోత్సవం తమ ఇరు దేశాల మధ్య సయోధ్యను నెలకొల్పిందని ఆయన అన్నారు. అయితే అణ్వాయుధ సంపద కోసం వెంపర్లాడుతున్న ఉత్తర కొరియాతో శిఖరాగ్ర చర్చలు జరిపే దశ ఇంకా రాలేదని పేర్కొన్నారు. గత వారం ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ యున్ నుంచి ఈ మేరకు మూన్‌కు ఆహ్వానం అందింది. అతడి చెల్లెలు కిమ్ యో జోంగ్ దక్షిణ కొరియా పర్యటించినప్పుడు ఈ ఆహ్వానాన్ని అందించారు. ప్రస్తుతం ఉత్తర కొరియాపై ఐక్యరాజ్య సమితి అనేక పర్యాయాలు విధించిన ఆంక్షలు అమలులో ఉన్నాయి. గత ఏడాది ఆ దేశం డజన్ల కొద్దీ అణ్వాయుధ పాటవ పరీక్షలను, ఖండాంతర క్షిపణి ప్రయోగాలను జరిపింది. ఈ నేపథ్యంలో భద్రతా మండలి ఆ ఆంక్షలు విధించింది. అయితే అమెరికా, ఉత్తర కొరియా మధ్య చర్చల అవసరాన్ని శీతాకాల ఒలింపిక్స్ చాటాయని మూన్ అన్నారు.

నైజీరియాలో ఆత్మాహుతి పేలుళ్లు



కానో : ఈశాన్య నైజీరియాలో ఒక చేపల మార్కెట్ వద్ద ముగ్గురు ఆత్మాహుతి బాంబర్లు తమను తాము పేల్చు కొని 19 మంది మృతికి కారణమయ్యారు. బోకోహరామ్ జీహాదిస్టులు ఈ ఘోరానికి కారణమని అధికార్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 8.30గంటలకు ఈ పేలుళ్లు సంభవించాయి. బోర్నో రాష్ట్ర రాజధాని మైదుగురికి 35కి.మీ. దూరంలోని కొండుగ వద్ద ఈ పేలుళ్లు సంభవించాయి. ఆ బాంబర్లు ముగ్గురూ పురుషులేనని, పేలుళ్లలో 70 మంది గాయపడ్డారని అధికార్లు చెప్పారు. తషాన్ కిఫీ చేపల మార్కెట్ వద్ద ముందు ఇద్దరు బాంబర్లు పేల్చుకున్నాక సమీపంలో నాలుగు నిమిషాల తర్వాత మూడవ బాంబర్ పేల్చుకొన్నట్లు తెలిసింది. మృతులలో 18 మంది పౌరులు కాగా ఒకసైనికుడు ఉన్నాడు.


నేడు జెఎసి స్టీరింగ్ కమిటీ సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్: రైతాంగ సమస్యలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు తెలంగాణ జెఎసి స్టీరింగ్ కమిటీ సమావేశం ఆదివారం జరగనుంది. రైతు సమస్యలపై వివిధ జిల్లాలో సదస్సులు, సమావేశాలను నిర్వహించిన జెఎసి, వాటి పరిష్కారానికి, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించి ఒక కార్యచరణను ప్రకటించాలని భావిస్తున్నది. అలాగే రాజకీయ ప్రక్రియపై ఈ సమావేశంలో చర్చించడంతో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, తదితర అంశాలపై ఒక అభిప్రాయానికి రానున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి స్టీరింగ్ సభ్యులతో పాటు జిల్లా కమిటీ ఛైర్మన్లు, కన్వీనర్లు, కో ఆర్డినేటర్లు కూడా హాజరుకావాలని జెఎసి తెలిపింది.


20న ఎస్‌సి సంఘాలతో భేటీ

మన తెలంగాణ / హైదరాబాద్: తెలంగాణలో పర్యటించనున్న జాతీయ ఎస్‌సి,ఎస్‌టి కమిషన్ ఈ నెల 20వ తేదీన పలు ఎస్‌సి సంఘాలతో సమావేశం కానుంది. జాతీయ ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ రామ్ శంకర్ కథేరియాతో పాటు కమిషన్ సభ్యుల బృందం రెండు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ నెల 20, 21వ తేదీలలో సమావేశం పర్యటించనున్న నేపథ్యంలో 20వ తేదీన ఎస్సీ సంఘాలతో సమావేశం కానుంది. బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ డైరెక్టర్ పి.కరుణాకర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్‌సి సంఘాల ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



మన తెలంగాణ/శంషాబాద్ (రంగారెడ్డి జిల్లా): అక్రమంగా విదేశాల నుండి బంగారాన్ని నగరానికి తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని బంగారం స్వాధీనం చేసుకున్న సంఘటన శనివారం మధ్యాహ్నం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటు చేసుకుంది. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎయిర్ ఇంటెలిజెన్స్ అధికారులు దుబాయ్ నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఎమిరేట్ ఫ్లైట్ ఇకె256లోని ఓ ప్యాసింజర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అతని ముందు భాగంలో ఉన్న లోదుస్తులో తొమ్మిది బంగారు కడాలు, ఐదు బంగారు చైన్‌లు గుర్తించామని, వాటి బరువు 920.500 గ్రాములని, విలువ రూ28,90,370 ఉందన్నారు. తదుపరి విచారణ కోసం అతడిని కస్టమ్స్ కార్యాలయానికి తరలించినట్లు వారు తెలిపారు.



ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర ఆర్థిక కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్



ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బిసి కమిషన్ సభ్యులు జూలూరి గౌరీ శంకర్





మాల్దీవ్స్‌లో నిరసనల జోరు : వేలాది మంది అరెస్టు

మాలే: అధ్యక్షుడు యమీన్ అబ్దుల్ గయూమ్ రాజీనామా కోరుతూ మాల్దీవ్స్ అంతటా శుక్రవారం నిరసన ప్రదర్శనల్లో జడన్ల కొద్దీ ప్రతిపక్ష నాయకులు అరెస్టు అయ్యారు. చాలా మంది మద్దతుదార్లు పోలీసు చర్యలలో గాయపడ్డారు. నిరసనలను అడ్డుకోడానికి పోలీసులు తెగబడ్డారు. వేలాది మంది ప్రజలు గయూమ్‌కు వ్యతిరేకంగా వీధులకెక్కారు. చాలా మంది గాయాలవల్ల ఆసుపత్రి పాలయ్యారు. ఎంత మంది అరెస్టు అయినదీ చెప్పడానికి పోలీసులు నిరాకరిస్తున్నారు. హెచ్చరికలను లక్ష్యపెట్టకుండా నిరసన ప్రదర్శనలకు ప్రజలు దిగడంవల్ల తాము కఠిన చర్యలు తీసుకోవలసి వచ్చిందని శనివారం నాడు పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 1 నుంచి మాల్దీవ్స్ రాజకీయ కల్లోలంలో ఇరుక్కొంది. మరోవైపు మాల్దీవల రాజకీయ సంక్షోభంలో కలుగజేసుకోవాలని మాజీ అధ్యక్షుడు భారత్‌ను కోరిన విషయం తెలిసిందే.

టెర్రరిస్టు ఇబ్రహీంకు జీవిత ఖైదు

అమెరికా న్యాయశాఖ ప్రకటన

వాషింగ్టన్: అల్‌ఖైదా ఉగ్రవాది ఇబ్రహీం సులేమాన్ అద్నాన్ ఆదమ్ హరుణ్‌కు యావజ్జీవిత శిక్ష పడినట్లు న్యాయ శాఖ శనివారం తెలిపింది. అనేక ఉగ్రవాద కార్యకలాపాల్లో ప్రమేయం రుజువవడంతో అతడికి ఈ శిక్షపడినట్లు అధికార్లు తెలిపారు. అఫ్ఘానిస్థాన్‌లో అమెరికా సైనిక సిబ్బం ది హత్యకు, నైజీరియాలోని అమెరికా రాయబారి కార్యాలయంలో బాంబు పేలుడుకు కుట్ర పన్నిన నేరం రుజువు కావడంతో ఈ శిక్ష పడింది. 2017 మార్చి 16న అతడి నేర నిర్ధారణ జరిగింది. అఫ్ఘానిస్థాన్‌లో అమెరికా సైనిక వాహనంపై దాడిలో ఇరువురు మరణించారు. చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయి. సెప్టెంబర్ 11 ప్రపంచ వాణిజ్య భవనం కూల్చివేత ఘటనకు కొద్దిగా ముందు హరుణ్ ఇతర జీహాదిస్టులతో కలిసి అల్‌ఖైదాలో చేరినట్లు సాక్ష్యాధారాలు ధ్రువపరుస్తున్నట్లు న్యాయ శాఖ కమిషనర్ ఒకరు తెలిపారు. తమ శాఖ న్యూయార్క్ నుంచి నైజీరియా దాకా టెర్రరిజం అణచివేతకు కంకణం కట్టుకుందని కూడా ఆయన తెలిపారు.

చిన్నారి హత్యాచారం కేసులో నాలుగు మరణ శిక్షలు

లాహోర్ : ఏడేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసి, దారుణ అత్యాచారానికి ఒడిగట్టి కిరాతకంగా హత్య చేసిన వ్యక్తికి న్యాయస్థానం నాలుగు మరణశిక్షలు విధించింది. ఏడేళ్ల చిన్నారి జైనాబ్ హత్య, హత్యాచారం అనంతరం చెత్తకుప్పలో లభ్యం కాగా, దేశ వ్యాప్తంగా నిరసనలు, ఖండనలు వెల్లువెత్తాయి. ఈ కేసు పాక్‌లో సంచలనం సృష్టించింది. కసూర్ నగరంలో ఖురాన్ చదువుకునేందుకు ఈ చిన్నారి వెళ్తుండగా 24 ఏళ్ల ఇమ్రాన్ అలీకి అపహరించారు. అనంతరం దారుణ అత్యాచారానికి ఒడిగట్టి, హత్య చేసి, మృతదేహాన్ని చెత్తకుప్పలోకి విసిరేశాడు. పాపపై అత్యాచారానికి ఒడిగట్టిన అలీకి నాలుగు మరణశిక్షలు విధిస్తున్నట్లు ప్రకటించింది. అపహరణ, హత్య, అత్యాచారం, ఉగ్రవాద చర్యల కింద నాలుగు మరణశిక్షలు విధించింది. వీటితో పాటు చిన్నపిల్లతో అత్యంత దారుణంగా ప్రవర్తించినందుకు గాను జీవిత



ఖైదును కూడా విధించింది. దీంతో పాటు చిన్నారి మృతదేహాన్ని చెత్తలో పడేసినందుకు అదనంగా మరో ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రూ.32 లక్షలు జరిమానా కూడా చెల్లించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. తీర్పును సవాలు చేస్తూ ఎగువ కోర్టుకు వెళ్లేందుకు దోషి అలీకి న్యాయస్థానం 15 రోజుల గడువు ఇచ్చింది.

అవినీతికి కళ్లెం, ఆర్థిక వ్యవస్థకు ఊతం

దక్షిణాఫ్రికా కొత్త అధ్యక్షుడు రామ్‌ఫోసా ప్రతిన

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా తాజా అధ్యక్షునిగా నియమితులయిన సిరిల్ రామ్‌ఫోసా అవినీతిని నిర్మూలించి దేశానికి నూతన ఉషోదయాన్ని కల్పిస్తానని ప్రకటించారు. తన ముందునాటి అధ్యక్షుడు జాకోబ్ జుమా పోషించిన అవినీతికి చరమగీతం పాడుతానని తన తొలి ప్రసంగంలో హామీ ఇచ్చారు. నిలువనీరులా తయారయిన ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తానని ఆయన ప్రతిన గైకొన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తానని, పెచ్చుపెరుగుతున్న ప్రభుత్వ రుణ భారాన్ని తగ్గిస్తానని కూడా ఆయన హామీ ఇచ్చారు. దేశాన్ని గత తొమ్మిదేళ్ల జుమా హయాంలో కుదిపేసిన విరుద్ధ పరిణామాలకు ఫుల్ స్టాప్ పెడతానని రామ్‌ఫోసా ప్రకటించారు. ఆర్థిక అంతరాన్ని పూడ్చడానికి కఠిన నిర్ణయాలు తప్పవని కూడా చెప్పారు. యువజనం నిరుద్యోగంలో కూరుకుపోవడమే తన ముందున్న పెద్ద సవాల్ అని ఆయన పేర్కొన్నారు. ఆయన శనివారం



నాడు అధ్యక్ష పదవి తొలిరోజును ఆఫీసులో గడిపారు.

ఆస్తిపన్ను సేకరణలో భారీ లక్ష్యం

44 రోజులు రూ.470 కోట్లు

మన తెలంగాణ/హైదరాబాద్, సిటీబ్యూరో : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి బల్దియాకు ఇంకా 44 రోజులు మాత్రమే ఉన్నాయి. 2017– 18 ఆర్థిక సంవత్సరంలో రూ.1400 కోట్లు ఆస్తిపన్ను ద్వారా వసూలు చేయాలని జిహెచ్‌ఎంసి లక్ష్యంగా నిర్ధేశించుకుంది. ఇప్పటి వరకు రూ.931 కోట్ల మేరకు ఆస్తిపన్ను వసూలైంది. లక్ష్యం చేరుకోవాలంటే 44 రోజుల్లో రూ.470 కోట్లు వసూలు చేయాల్సి ఉంటుంది. గత 2016 –17 ఆర్థిక సంవత్సరం లో అంతకు ముందు సంవత్సరాలతో పోల్చితే రూ.180 కోట్లు అదనంగా రూ.1205.73 కోట్ల ఆస్తిపన్ను గా వసూలు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గత సంవత్సరం లభించిన మొత్తంతో పాటు అదనంగా మరో 16 శాతం రూ.1400 కోట్ల ఆస్తిపన్నును వసూలు చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ డాక్టర్ బి.జనార్ధన్‌రెడ్డి లక్ష్యం గా నిర్ణయించారు. ఆస్తిపన్నును ఏమాత్రం పెంచకుండా అంతర్గత లొసుగులను సరి చేసుకుంటూ ఇప్పటికే మదింపు కానీ ఆస్తులను ఆస్తిపన్ను చెల్లింపు జాబితాలోకి తేవడం, రూ.1200 లోపు ఆస్తిపన్ను ఉన్న ఆస్తులను పునరు పరిశీలించడం తదితర చర్యల



ద్వారా ఆస్తిపన్ను మొత్తాన్ని పెం పొందించుకోవాలని నిర్ణయించారు. దీనిలో భాగంగానే నేటి వరకు అంటే శుక్రవారం నాటికి రూ.931 కోట్లను ఆస్తిపన్ను వసూలైంది. గతంలో మాదిరిగా ఆర్థిక సంవత్సరం ఆఖరు నెల అంటే మార్చి మాసాంతం వరకు వేచిచూడకుండా ముందుగానే ఆస్తిపన్నును సేకరించాలనే లక్ష్యాలను డిప్యూటి కమిషనర్లకు నిర్దేశించారు. ఇప్పటి వర కు మొత్తం రూ.1400 కోట్ల ఆస్తిపన్నును సేకరించారు. ఈ 44 రోజుల గడువులోగా రూ.470 కోట్లను సేకరించాలన్న భారీ లక్ష్యం ప్రస్తుతం బల్దియాకు లక్ష్యంగా ఉంది.

ఆస్తిపన్ను పర్యవేక్షకాధికారులు : ఆస్తిపన్ను వసూళ్లలో లక్ష్యాలను సాధించేందుకుగాను జోన్‌లవారిగా ఐఎఎస్ అధికారులను నియమిస్తూ కమిషనర్ అదేశాలు జారీ చేశారు. భారతీ హోలికేరి (సెంట్రోల్ జోన్), అద్వైత్ కుమార్ సింగ్(నార్త్‌జోన్), స్నిగ్ధా పట్నాయక్(ఈస్ట్ జోన్), ముషరఫ్ అలీ ఫారుఖీ(సౌంత్‌జోన్)లను నియమించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఇక నుంచి ఆస్తిపన్ను వసూళ్లలో నిమగ్నం కానున్నారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజుల లక్ష్యం రూ.50 కోట్లు : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.50 కోట్లను ఆస్తిపన్ను ద్వారా సేకరించాలని లక్ష్యంగానిర్ణయించుకొని, నేటి వరకు రూ.34 కోట్లను సేకరించింది.లక్ష్యంలో 76 శాతం పురోగతి సాధించగా, మిగిలిన 24 శాతం ట్రేడ్ లైసెన్స్ ఫీజును సేకరించారు.

అన్ని సర్కిల్ కార్యాలయాల్లో ఆదివారం ప్రాపర్టి ట్యాక్స్ పరిష్కారం

ఆస్తిపన్ను సంబంధిత ఫిర్యాదులు, ఆస్తిపన్ను మదింపు, కోర్టు కేసుల పరిష్కారం తదితర అంశాలపై ఆదివారం నాడు నగరంలోని అన్ని సర్కిల్ కార్యాలయాల్లో ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆదివారం ఉదయం 3 : 30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ నిర్వహిస్తామని అన్నారు. ఇందులో జోనల్, డిప్యూటి కమిషనర్లు ఇతర అధికారులు పాల్గొని, ఆస్తిపన్ను వివాదాలను పరిష్కరిస్తారని తెలిపారు. ఆస్తిపన్ను సంబంధిత సమస్యలు ఏవైనా ఉంటే ఈ ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం కార్యక్రమానికి హాజరై, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ తెలిపారు. దీంతో పాటు ఈనెల 25వ తేదీన మార్చి,4వ, 11, 25వ తేదీలలో కూడా ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారాన్ని నిర్వహిస్తున్నట్లు జనార్ధన్‌రెడ్డి వివరించారు.

సిఎం అపాయింట్‌మెంట్ కోరిన టిడిపి నేతలు

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర టిడిపి నేతలు సిఎం కె. చంద్రశేఖర్‌రావు అపాయింట్‌మెంట్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఎంఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య టిడిపి తరపున సిఎం ముఖ్యకార్యదర్శి ఎస్.నర్సింగరావుకులేఖ రాశారు. రైతు సమస్యలపైవిన్నవించుకునేందుకు సమయం ఇవ్వాలని అపాయింట్‌మెంట్ కోసం రాసిన లేఖలో పేర్కొన్నారు.

ఈ నెల 28 చంద్రబాబు సమావేశం : టిడిపి జాతీయ అధ్యక్షులు, ఎపి సిఎం ఎన్. చంద్రబాబు నాయుడు రాష్ట్ర టిడిపి నేతలతో ఈ నెల 28న భేటీ కానున్నారు.రాష్ట్ర నేతలతో గురువారం టెలి కాన్ఫరెన్స్‌లో ఈ విషయం చెప్పినట్లు ఎల్.రమణ 'మన తెలంగాణ'కు తెలిపారు.

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, కళలు ముఖ్యం

మన తెలంగాణ /హైదరాబాద్ : యాంత్రిక మవుతున్న ప్రజల జీవన విధానంలో మానసిక ప్రశాంతతను చేకూర్చేందుకు క్రీడలు, కళలు దోహదపడ్తాయని టిఎస్‌ఆర్‌టిసి ట్రాన్స్‌పోర్ట్ అకాడమీ ప్రిన్సిపాల్, జాతీయ మాజీ వాలీబాల్ క్రీడాకారులు జి.ఆర్.కిరణ్ అన్నారు. నగరంలోని జి.పుల్లారెడ్డి స్మారక విద్యా సంస్థల వార్షికోత్సవంలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. కిరణ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడలు, కళలు ముఖ్యమని, వారి అభిరుచి మేరకు అందులో ప్రావీణ్యం కల్పించేందుకు తల్లిదండ్రులు పిల్లల్ని ప్రోత్సహించాలన్నారు. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన ప్రశంసా పత్రా లను అంజేశారు. కార్యక్రమంలో బాలల హక్కుల సంఘం అధ్యక్షులు అచ్యుతారావు,విద్యావేత్త డాక్టర్ కె.ఇంద్ర,రాణి పాల్గొన్నారు.

వివాహిత దారుణ హత్య

మన తెలంగాణ/ గూడూరు: మండలంలోని పొనుగొడు గ్రామ శివారు టేకులతండాలో విషాదం నెలకొంది. అతికిరాతకం గా తల, మొండెంను వేరు చేసి అతి దారుణంగా హత్య చేశారు. వివరాల్లోకి వెళితే పొనుగొడు శివారు టేకులతండాకు చెందిన భూక్య వినోద (26) ఇంటి పక్కనే రోడ్డు అవతల గల చేనులో పని చేస్తూ హత్యకు గురైంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం నెల్లికు దురు మండలం నర్సింహుల గూడెం గ్రామానికి చెందిన గుగులోతు ఈర్య కూతురును గూడూరు మండలం పొనుగొడు శివారు టేకుల తండాకు చెందిన భూక్య హర్యి, చిలికిల రెండవ కుమారుడు భూక్య రమేష్‌తో 12 సంవత్సరాల క్రింత వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు చరణ్ (8), చిన్నవాడు సాయిచరణ్ (4)లు ఉన్నారు. మృతురాలు భర్త హైదరాబాద్‌లో కూలి పని చేస్తున్నాడు. వినోద కౌలుకు భూమిని తీసుకొని కౌలు చేస్తుంది. గత రెండు రోజుల కింద వీరి భూమి పక్కనే మరో వ్యక్తి కౌలు చేస్తున్నాడు. మృతిరాలి భావి మీద ఉన్నస్టాటర్ పెట్టే లేక పోవడంతో నీవే దొంగలించావని పెద్ద మనుషుల వద్ద పెట్టడంతో వీరి ఇరువురి మధ్య విరోధం బాగా పెరిగిందని నేను నిన్ను ఎప్పుడైనా చంపుతానని బెదిరించాడని అతడే మా కోడలును హత్య చేశాడని మృతురాలు అత్త చిలికి ఆరోపించారు. శుక్రవారం ఉదయం మొక్క జొన్న చేనుకు నీరు పెట్టడానికి వచ్చిందని అంతలోనే ఇంత పని జరిగిందని రోధి స్తూ చెప్పింది. మృతురాలు చిన్న కుమారుడు అమ్మ లేదని రోధి స్తుండడంతో మృతురాలు మేన కోడలు గుగులోతు స్వప్న చేను వద్ద కు వచ్చేసరికి పత్తి చేనులో మరణించి ఉండడంతో భయపడిన స్వప్న తండాకు వెళ్లి విషయం చెప్పడంతో ఈ వార్త దావణంలా మండలం లో వ్యాపించి, విషయం తెలుసు కున్న పోలీస్‌లు హుటాహుటిన సం ఘటన స్థలానికి చేరుకొని డాగ్ స్క్వాడ్‌ను రప్పించి డాగ్‌స్క్వాడ్ సం ఘటన స్థలం నుంచి పెట్రోల్‌బంక్ వద్దకు వెళ్లి మరల వెనుతిరిగాయి. పోలీస్‌లు పంచనామా నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో ఉంచామన్నారు.సంఘటనా స్థలానికి మహబూబాబాద్ డిఎస్పి నరేష్‌కుమార్, గూడూరు సిఐ రమేష్, ఎస్‌ఐలు ఎస్‌కె యాసిన్, రావు, సతీష్, బాలకృష్ణలు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నిందితులను రెండురోజుల్లో పట్టుకుంటామని డిఎస్పి నరేష్ అన్నారు.

మోడరన్ హెయిర్ స్టెయిల్, బ్యూటిఫికేషన్‌పై శిక్షణ

తరగతుల కేంద్రాన్ని పరిశీలించిన బిసిశాఖ కార్యదర్శి

మన తెలంగాణ / హైదరాబాద్: ఆధునిక మార్పులకు అనుగుణంగా నాయీ బ్రాహ్మణ యువతను సాంకేతికంగా అభివృద్ధి చేసే చర్యలకు శ్రీకారం చుట్టిందని బిసి సంక్షేమశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో 650 మంది యువతను ఎంపిక చేసి వారికి ప్రత్యేకమైన శిక్షణను అందించనున్నట్లు చెప్పారు. నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణ తరగతులను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ యువతి, యువకులకు మోడరన్ హెయిర్ స్టెయిల్‌తో పాటు బ్యూటిఫికేషన్‌పై 15 రోజుల పాటు శిక్షణను ఇస్తున్నట్లు చెప్పారు. దశల వారీగా ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని చెప్పారు. ప్రభుత్వం అందించే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని యువత అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. శిక్షణ పూర్తి చేసిన యువతకు బీసీ సంక్షేమ రుణ సదుపాయం కల్పించి ఆధునిక సెటూన్ల ఏర్పాటుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని చెప్పారు. శిక్షణలోని యువతతో



స్వయంగా మాట్లాడిన కార్యదర్శి బుర్రా వెంకటేశం శిక్షణ తరగతుల ముఖ్య ఉద్దేశ్యాన్ని వారికి వివరించారు. ఆధునిక కాలానికి అనుగుణంగా యువత అభిరుచులు మారుతున్నాయని చెప్పారు. వారి అభిరుచులకు అనుగుణంగా యువత హెయిర్ స్టేల్‌తో పాటు బ్యూటిఫికేషన్‌లో శిక్షణ తీసుకోవడం అవసరమని భావించి ఈ శిక్షణ తరగతును నిర్వహిస్తున్నట్లు చెప్పారు.దశల వారీగా శిక్షణను నిర్వహిస్తామని చెప్పారు.కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హెచ్‌సిఎ సిఇఒగా పాండురంగ మూర్తి

మన తెలంగాణ/ హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం చీఫ్ ఎగ్జిక్యూటీవ్ అధికారిగా పాండురంగ మూర్తిని నియమిస్తూ అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని హెచ్‌సిఎ అధ్యక్షుడు జి.వివేకానంద్ తెలిపారు. ఎపిఎస్‌ఆర్‌టిసి ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పాండురంగ మూర్తిని హెచ్‌సిఎ కార్యనిర్వాణ అధికారిగా నియమించినట్టు అపెక్స్ కౌన్సిల్ అధికారికంగా ప్రకటించిందన్నారు. మేనేజ్‌మెంట్ రంగంలో దాదాపు 25 ఏళ్ల అనుభవం కలిగివున్న మూర్తిను హెచ్‌సిఎ సిఇఓగా నియమించడం ఎంతో ఆనందం కలిగించిందన్నారు. ఆయన పర్యవేక్షణలో హెచ్‌సిఎ మరింత ప్రగతి పథంలో ప్రయాణించడం ఖాయమన్నారు. కాగా, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రికెటర్లను గుర్తించి వారికి తగిన విధంగా శిక్షణ ఇవ్వడమే హెచ్‌సిఎ ప్రధానం ఉద్దేశం అన్నారు. ఇందులో భాగంగానే హెచ్‌సిఎ ఆధ్వర్యంలో టి–20 లీగ్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు కేవలం హైదరాబాద్ వంటి పెద్ద నగరానికే పరిమితమైన క్రికెట్ పోటీలను జిల్లాలకు వ్యాపింప చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ దిశగా పలు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. కాగా, ప్రతిభావంతులైన క్రికెటర్లకు హెచ్‌సిఎ సదా అండగా నిలుస్తుందని వివేకానంద్ స్పష్టం చేశారు.







రాష్ట్ర క్రీడాకారులకు సత్కారం

తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో క్రీడాకారులను, కోచ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతి కార్యక్రమాలు కూడా నిర్వహించారు. అంతేగాక తైక్వాండో పోటీలను కూడా ఏర్పాటు చేశారు. కాగా ఈ కార్యక్రమంలో తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి దాదాపు 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో ప్రాతినిధ్యం వహించిన రాష్ట్ర క్రీడాకారులను, కోచ్‌లను ఘనం సత్కరించారు. రాష్ట్ర క్రీడల మంత్రి పద్మారావు, శాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, శాట్స్ మేనేజింగ్ డైరెక్టర్ దినకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచకప్‌లో చాహల్, కుల్దీప్‌లే కీలకం



బెంగళూరు: వచ్చే ఏడాది ఇంగ్లాండ్ వేదికగా జరిగే ప్రపంచకప్‌లో భారత యువ స్పిన్నర్లు యజువేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌లు ప్రకంపనలు సృష్టించడం ఖాయమని భారత క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ అభిప్రాయపడ్డాడు. శనివారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సచిన్ మీడియాతో మాట్లాడాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో ముగిసిన వన్డే సిరీస్‌లో కుల్దీప్, చాహల్‌లు చెలరేగిన తీరు తనను ఎంతో ఆకట్టుకుందన్నాడు. రానున్న వరల్డ్‌కప్‌లో వీరిద్దరూ భారత్‌కు చాలా కీలకమన్నాడు. ఇదే జోరును అప్పటి వరకు కొనసాగిస్తారనే నమ్మకం తనకుందన్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా వీరికుందన్నాడు. ప్రతికూల వాతావరణంలోనూ వీరిద్దరు రాణించిన తీరును ఎంత పొగిడినా తక్కువే అన్నాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న స్పిన్నర్లలో చాహల్, కుల్దీప్‌లు ఒకరన్నాడు. వీరిద్దరూ రానున్న రోజుల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ మ్యాచ్ విన్నర్ బౌలర్లుగా ఎదుగుతారని సచిన్ జోస్యం చెప్పాడు. కాగా, దక్షిణాఫ్రికా సిరీస్‌లో టీమిండియా ప్రదర్శన తనను ఎంతో ఆనంద పరిచిందన్నాడు. సఫారీ గడ్డపై సిరీస్ గెలవడం ఏ జట్టుకైనా చాలా కష్టమన్నాడు. అయితే కోహ్లి సేన సఫారీలను వారి గడ్డపైనే ఓడించి చరిత్ర సృష్టించిందని సచిన్ ప్రశంసించాడు.

సిరీస్‌పై భారత్ కన్ను

నేడు మహిళల మూడో టి–20

జోహెన్నస్‌బర్గ్: వరుసగా రెండు విజయాలు సాధించి జోరుమీదున్న భారత మహిళా క్రికెట్ జట్టు టి–20 సిరీస్‌పై కన్నేసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది. తొలి రెండు మ్యాచ్‌లు గెలిచి జోరుమీదున్న భారత్ ఇందులోనే విజయం సాధించి సిరీస్ సొంతం చేసుకోవాలని తహతహలాడుతోంది. ఇప్పటికే వన్డే సిరీస్‌ను గెలుచుకున్న భారత్ తాజాగా టి–20 సిరీస్‌లోనూ విజయమే లక్ష్యంగా పెట్టుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్ చాలా బలంగా ఉంది. తొలి రెండు మ్యాచుల్లో కూడా భారత జట్టు భారీ లక్ష్యాలను సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్లు స్మృతి మందన, మిథాలీ రాజ్‌లు అద్భుత బ్యాటింగ్‌తో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మ్యాచ్‌లోనూ వీరిద్దరూ జట్టుకు కీలకంగా మారారు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా వీరికుంది. మందన విధ్వంసక బ్యాటింగ్‌తో సౌతాఫ్రికా బౌలర్లను హడలెత్తిస్తోంది. మరోవైపు మిథాలీ రాజ్ నిలకడైన ప్రదర్శనతో జట్టును ఆదుకుంటుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, వేద కృష్ణమూర్తి, పూనమ్ రౌత్ తదితరులతో భారత్ చాలా బలంగా ఉంది. అంతేగాక పూనమ్ యాదవ్, శిఖా పాండేలు బౌలింగ్‌లో చెలరేగి పోతున్నారు. ఇక, ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టుకు ఈ మ్యాచ్ చావోరేవోగా మారింది. సిరీస్ అవకాశాలు సజీవంగా ఉంచుకోవాలంటే ఈ మ్యాచ్‌లో కచ్చితంగా గెలిచి తీరాలి. దీని కోసం సౌతాఫ్రికా సర్వం ఒడ్డి పోరాడేందుకు సిద్ధమైంది.



సమరోత్సాహంతో భారత్

ప్రతీకారం కోసం సౌతాఫ్రికా, నేడు తొలి టి-20



జోహెన్నస్‌బర్గ్: వన్డే సిరీస్‌లో ఘన విజయం సాధించిన టీమిండియా శనివారం దక్షిణాఫ్రికాతో జరిగే తొలి ట్వంటీ–20 మ్యాచ్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది. ఈ సిరీస్‌ను కూడా సొంతం చేసుకోవాలనే పట్టుదలతో కోహ్లి సేన కనిపిస్తోంది. మరోవైపు కొత్త కెప్టెన్ జెపి.డుమిని కెప్టెన్సీలో ఆతిథ్య దక్షిణాఫ్రికా కూడా విజయమే లక్ష్యంగా పోరుకు సిద్ధమైంది. వన్డేలతో పోల్చితే టి–20ల్లో సౌతాఫ్రికా చాలా బలంగా ఉంది. డివిలియర్స్, డేవిడ్ మిల్లర్, హెన్రిచ్ క్లాసెన్, క్రిస్ మోరిస్, ఫర్హాన్ బెహార్డిన్, ఫెలుక్‌వాయో వంటి టి–20 స్పెషలిస్టులు సౌతాఫ్రికాకు అందుబాటులో ఉన్నారు. వన్డేల్లో భారత్ చేతిలో ఎదురైన పరాజయానికి టి–20 సిరీస్‌లో గెలిచి బదులు తీర్చుకోవాలనే ఉద్దేశంతో సఫారీ జట్టు పోరుకు సిద్ధమైంది. మరోవైపు టీమిండియా మాత్రం వరుస విజయాలతో జోరుమీదుంది. ఓపెనర్లే రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, కెప్టెన్ విరాట్ కోహ్లిలు భీకర ఫాంలో ఉన్నారు. కిందటి మ్యాచ్‌లో కళ్లు చెదిరే సెంచరీతో చెలరేగిన కోహ్లి టి–20ల్లోనూ అదే జోరును కొనసాగించేందుకు తహతహలాడుతున్నాడు. సీనియర్ ఆటగాడు సురేశ్ రైనా చేరికతో భారత్ మరింత బలోపేతంగా మారింది. రెండు జట్లు కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో మూడు మ్యాచ్‌ల సిరీస్ నువ్వానేనా అన్నట్టు సాగడం ఖాయం.

జట్ల వివరాలు

భారత్: విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, ధావన్, రైనా, మహేంద్ర సింగ్ ధోని, మనీష్ పాండే, దినేష్ కార్తీర్, హార్దిక్ పాండ్య, భువనేశ్వర్ కుమార్, బుమ్రా, శార్దూల్ ఠాకూర్, చాహల్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, జైదేవ్ ఉనద్కట్, లోకేష్ రాహుల్.
దక్షిణాఫ్రికా: డుమిని (కెప్టెన్), డివిలియర్స్, రీజా హెండ్రిక్స్, స్మట్స్, మిల్లర్, క్లాసెన్, క్రిస్ మోరిస్, ఫెలుక్‌వాయో, జూనియర్ డాలా, ప్యాటర్సన్, అరోన్ ఫంగిసో, ఫర్హాన్ బెహార్డిన్, క్రిస్టియాన్ జోన్కర్, తబ్రెస్ షంసి.

రోహిత్‌పైనే అందరి దృష్టి..

వన్డే సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లో తప్ప ఐదు మ్యాచుల్లో ఘోరంగా విఫలమైన ఓపెనర్ రోహిత్ శర్మ ట్వంటీ–20ల్లో నైనా రాణిస్తాడా లేదా అన్నది అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన రోహిత్ చెలరేగితే భారత్‌కు భారీ స్కోరు కష్టమేమి కాదు. వైస్ కెప్టెన్‌గా ఉన్న రోహిత్ వైఫల్యం జట్టును వెంటాడుతోంది. సఫారీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొవడంలో రోహిత్ విఫలమవుతున్నాడు. అయితే టి–20ల్లో ఆ లోటును పూడ్చుకోవాలని భావిస్తున్నాడు. దూకుడైన బ్యాటింగ్‌తో జట్టును ఆదుకోవాలని భావిస్తున్నాడు. మరోవైపు ధావన్ భీకర ఫాంలో ఉన్నాడు. ఈ సిరీస్‌లో కూడా మెరుపులు మెరిపించేందుకు సిద్ధమయ్యాడు. దూకుడుగా ఆడి జట్టుకు శుభారంభం అందించేందుకు తహతహలాడుతున్నాడు. అతను రాణిస్తే ప్రత్యర్థి బౌలర్లకు కష్టాలు తప్పక పోవచ్చు. మరోవైపు కెప్టెన్ కోహ్లి అసాధారణ ఫాంలో ఉన్నాడు. వన్డే సిరీస్‌లో మూడు శతకాలు సాధించి ప్రకంపనలు సృష్టించాడు. అతని ఫాం జట్టుకు వరంగా మారిందనే చెప్పాలి. ఈ సిరీస్‌లో కూడా అదే జోరును కొనసాగించేందుకు సిద్ధమయ్యాడు. కోహ్లి విజృంభిస్తే అడ్డుకోవడం సఫారీ బౌలర్లకు తలకు మించిన పనిగానే విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

రైనాకు ఛాన్స్ దొరికేనా...

మరోవైపు సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ టీమిండియాలో చోటు సంపాదించిన స్టార్ బ్యాట్స్‌మన్ సురేశ్ రైనాకు తుది జట్టులో చోటు దక్కుతుందా లేదా అనేది ఇంకా తేలలేదు. టి–20 స్పెషలిస్ట్‌గా పేరున్న రైనా అవకాశం దొరికితే సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నాడు. కీలకమైన సిరీస్ నేపథ్యంలో అనుభవజ్ఞుడైన రైనాకు అవకాశం ఇవ్వడం ఖాయమని విశ్లేషకులు అంటున్నారు. రైనా కూడా తుది జట్టులో స్థానంపై భారీ ఆశలతో ఉన్నాడు. ఒకవేళ ఛాన్స్ దొరికితే మాత్రం చెలరేగేందుకు అన్ని అస్త్రాలు సిద్ధం చేసుకున్నాడు. దినేష్ కార్తీక్, మనీష్ పాండే, లోకేష్ రాహుల్‌ల మధ్య తుది జట్టులో స్థానం కోసం గట్టి పోటీ నెలకొంది. వీరిలో కెప్టెన్ కోహ్లి ఎవరి వైపు మొగ్గు తాడో తేలాల్సి ఉంది. ఇక హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్‌ల మధ్య కూడా తుది జట్టులో స్థానం కోసం తీవ్ర పోటీ ఏర్పడింది. వన్డేల్లో బౌలింగ్‌లో కాస్త మెరుగ్గా రాణించినా పాండ్య బ్యాటింగ్‌లో మాత్రం విఫలమయ్యాడు. అయితే అతనికి టి–20లలో కూడా అవకాశం ఇవ్వాలనే కోహ్లి భావిస్తున్నాడు. ఇక, బౌలింగ్‌లో కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చాహల్‌లు బరిలోకి దిగడం ఖాయం. ఫాస్ట్ బౌలింగ్‌లో భువనేశ్వర్, బుమ్రాలకే చోటు దక్కే అవకాశాలున్నాయి. శార్దూల్ ఠాకూర్‌కు చోటు కష్టంగానే చెప్పవచ్చు.

91	ఓవరాల్‌గా భారత్ ఆడిన టి-20లు
55	భారత్ సాధించిన విజయాలు
33	భారత్ ఓడిన మ్యాచ్‌ల సంఖ్య
100	ఓవరాల్‌గా దక్షిణాఫ్రికా ఆడిన టి-20లు
59	సఫారీలు సాధించిన విజయాలు
40	సఫారీలు ఓడిన మ్యాచ్‌ల సంఖ్య
10	ఇరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు
4	దక్షిణాఫ్రికా గెలిచినవి
6	భారత్ గెలిచిన మ్యాచ్‌లు
260/5	భారత్ సాధించిన అత్యధిక స్కోరు
241/6	దక్షిణాఫ్రికా అత్యధిక స్కోరు

SONY TEN

సాయంత్రం 6:00 గంటల నుంచి సోని నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం



డివిలియర్స్‌పైనే ఆశలు...

మరోవైపు దక్షిణాఫ్రికా ఆశలన్నీ దిగ్గజ ఆటగాడు ఎబి.డివిలియర్స్‌పైనే ఆధారపడి ఉన్నాయి. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన డివిలియర్స్ వన్డేల్లో ఆశించిన స్థాయిలో రాణించలేక పోయాడు. కనీసం టి–20లలోనైన తన స్థాయికి తగ్గ ఆటను కనబరుస్తాడా లేదా అన్నది అంతుబట్ట కుండా మారింది. డుప్లెసిస్, డికాక్ వంటి స్టార్లు లేకుండానే బరిలోకి దిగుతున్న సౌతాఫ్రికాకు డివిలియర్స్ కీలకంగా మారాడు. అతను రాణించడం జట్టుకు ఎంతో అవసరం. ఇక, కెప్టెన్ డుమిని సత్తాకు ఈ సిరీస్ సవాలుగా మారింది. వన్డేల్లో డుమిని ఘోరంగా విఫలమయ్యాడు. అయితే తనకు ఎంతో అచ్చివచ్చే టి–20 ఫార్మాట్‌లో మెరుపులు మెరిపించేందుకు తహతహలాడుతున్నాడు. అతను చెలరేగితే సౌతాఫ్రికాకు భారీ స్కోరు సాధించడం కష్టమేమి కాదు. ఇక, స్టార్ ఆల్‌రౌండర్ డేవిడ్ మిల్లర్ కూడా జట్టుకు చాలా కీలకం. టి–20లలో అద్భుత రికార్డు కలిగిన మిల్లర్ విజృంభిస్తే భారత బౌలర్లకు కష్టాలు తప్పవు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా మిల్లర్ సొంతం. ఇక, వికెట్ కీపర్ క్లాసెన్‌ను కూడా తక్కువ అంచనా వేయలేం. పింక్ వన్డేలో క్లాసెన్ కళ్లు చెదిరే ఇన్నింగ్స్‌తో దక్షిణాఫ్రికాకు సంచలన విజయం అందించిన విషయం తెలిసిందే. టి–20లలో కూడా జట్టు అతని నుంచి భారీ స్కోర్లను ఆశిస్తోంది. ఫెలుక్‌వాయో, బెహార్డిన్, రీజా హెన్రిక్స్, స్మట్స్ తదితరులతో దక్షిణాఫ్రికా చాలా బలంగా ఉంది. సొంత గడ్డపై ఆడనుండడం కూడా సౌతాఫ్రికాకు అదనపు బలాన్ని ఇస్తోంది. రెండు జట్లు కూడా విజయంపై భారీ ఆశలతో ఉండడంతో ఉత్కంఠ పోరును చూసే అవకాశం అభిమానులకు దక్కనుంది.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.